సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 102

బుధవారం 3-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రజాసేవలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొంటా'



### వృద్ధి పరుగే ప్రధాన లక్ష్యం

ఆర్థిక వ్యవస్థపైనే అధికంగా దృష్టిపెడతాం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ –బిజినెస్‌లో



### రెండో రౌండ్‌లో బార్టీ

వింబుల్డన్‌లో ముందంజ వేసిన వరల్డ్ నంబర్‌వన్ –స్పోర్ట్స్‌లో

## న్యూస్‌రీల్

### ఖరీదైన విడాకులు



అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ భార్యతో కుదుర్చుకున్న విడాకుల ఒప్పందం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ ఒప్పందం ద్వారా ఆయన భార్య మెక్‌కెంజీకి రూ.2.62లక్షల కోట్ల(38 బిలియన్ డాలర్లు) మొత్తం సొంతం కానుంది.

- వివరాలు 5లో

### ఎవరినీ ఉపేక్షించం: మోదీ



బీజేపీ నేతలెవరైనా అహంకారపూరితంగా, అనుచితంగా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని ప్రధాని మోదీ హెచ్చరించారు. మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యే ఆకాశ్ వర్గీయ ఇటీవల ఓ ప్రభుత్వ అధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన ఘటన నేపథ్యంలో ప్రధాని ఈ హెచ్చరికలు చేశారు.

- వివరాలు 5లో

### నిప్పుతో చెలగాటం ఆడుతున్న ఇరాన్: ట్రంప్



2015 నాటి అణు ఒప్పందంలోని నిబంధనలను ఉల్లంఘించి యురేనియం నిల్వలను అనుమతించిన స్థాయికి మించి పెంచుకొని ఇరాన్ నిప్పుతో చెలగాటమాడుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు.

- వివరాలు 5లో

### నీరవ్ మోదీకి సింగపూర్ హైకోర్టు షాక్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ని మోసగించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త నీరవ్ మోదీ కుటుంబసభ్యులకు చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయాలంటూ సింగపూర్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. - బిజినెస్‌లో

బాగా ఆడినావ్ బిడ్డా..



మ్యాచ్ అనంతరం రోహిత్ శర్మను అభినందిస్తున్న 87 ఏళ్ల అభిమాని చారులత పటేల్

# ప్రపంచ కప్ సెమీస్‌లో భారత్

## బంగ్లాదేశ్‌పై 28 పరుగులతో విజయం.. రోహిత్ శర్మ సెంచరీ

- వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ చేరిన రెండో జట్టుగా భారత్ నిలిచింది. మంగళవారం బర్మింగ్‌హామ్‌లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 28 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ముందుగా రోహిత్ శర్మ సెంచరీ (92 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 104)తో భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 314 పరుగులు చేసింది. ఈ ప్రపంచకప్‌లో రోహిత్‌కు ఇది నాలుగో శతకం. రాహుల్ (77) అర్ధ సెంచరీ సాధించాడు. తర్వాత బంగ్లాదేశ్ 48 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. బుమ్రా 4, పాండ్యా 3 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. వన్డే ప్రపంచ కప్ చరిత్రలో భారత్ సెమీఫైనల్ చేరడం ఇది ఏడోసారి కాగా.. తాజా ఓటమితో బంగ్లా సెమీస్ అవకాశాలు కోల్పోయింది. శనివారం జరిగే తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ తలపడుతుంది.

- స్పోర్ట్స్‌లో

# కాంగ్రెస్... గజిబిజి!

## పార్టీలో ఎవరుంటారో తెలియని గందరగోళంలో కేడర్



- ముఖ్య నేతలకు బీజేపీ గాలం.. రోజుకో నేత పేరు తెరపైకి
- టచ్‌లోకి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల నేతలు
- పార్టీ మార్పు ప్రచారాన్ని తోసిపుచ్చని కొందరు నేతలు
- 6న అమిత్ షా నేతృత్వంలో భారీ చేరికలంటున్న కమలనాథులు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర కాంగ్రెస్‌లో నైరాశ్యం అలముకుంది! అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుస పరాజయాలకుతోడు రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ సాగిస్తున్న ఆపరేషన్ ఆకర్ష్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తిప్పికొట్టలేకపోతోందన్న భావన కేడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. పార్టీ మారుతున్నారంటూ రోజుకో నేత పేరు తెరపైకి వస్తుండటం, ఆ వార్తలను కొందరు ఖండిస్తున్నా మరికొందరు మౌనంగా ఉండటంతో పార్టీలో ఎవరుంటారో, ఎవరు వీడతారో అర్థంకాక కార్యకర్తలు తలపట్టుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీలోని ముఖ్య నాయకులకు గాలం వేస్తోందన్న వార్తలు కూడా కేడర్‌లో గుబులు పుట్టిస్తున్నాయి. ఇప్పటికే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలకుతోడు కొందరు నాయకులు రహస్యంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను కలిశారన్న ప్రచారాన్ని ఎదుర్కొనే వ్యూహంలో కూడా పార్టీ రాష్ట్రశాఖ వెనుకబడటం గమనార్హం.

**నిజంగానే టచ్‌లో ఉన్నారా..?**

రాష్ట్రంలోని చాలా మంది కాంగ్రెస్ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని బీజేపీ నేతలు

మిగతా 2వ పేజీలో ▶



ముంబైలో మంగళవారం వర్షానికి రహదారి జలమయం కావడంతో ఫ్లైఓవర్‌పై నిలిచిన వాహనాలు

# ముంబై అతలాకుతలం

## గోడ కూలి 21 మంది మృతి, మహారాష్ట్ర వ్యాప్తంగా 39 మంది దుర్మరణం

### ముంబైలో వర్షాలతో స్తంభించిన రవాణా సేవలు.. విమానాలు, రైళ్ల రద్దు

- ముంబైను కుండపోత వర్షాలు స్తంభింపజేశాయి. మలద్‌లోని పింప్రిపద ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఓ గోడ కూలి, పక్కన గుడిసెల్లో నివసిస్తున్న 21 మంది మరణించారు. మరో 78 మంది క్షతగాత్రులయ్యారు. గత రెండ్రోజుల్లో వర్షం కారణంగా మహారాష్ట్రలో 35 మంది మరణించారని అధికారులు చెప్పారు. ఆదివారం నుంచి ముంబైలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రోడ్డు, రైలు, విమాన రవాణా సేవలు ప్రభావితమయ్యాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం ముందుగానే హెచ్చరించడంతో ప్రభుత్వం ముంబై, చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం సాధారణ సెలవుగా ప్రకటించింది.

- వివరాలు 5లో

### అంగుళం భూమినీ ఆక్రమించనివ్వం

- ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం
- ప్రభుత్వం నుంచి మాకు పూర్తి మద్దతు
- దాడులతో మా ఆత్మస్థైర్యం దెబ్బతినలేదు
- అమాయక ప్రజలను రెచ్చగొట్టడం వల్లే ఘర్షణాత్మక పరిస్థితి
- సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో పీసీసీఎఫ్ పీకే ఝా



- 2లో

### జీడీపీనా? ఉద్యోగాలా?

- వృద్ధి కంటే ఉద్యోగాల కల్పనే ముఖ్యమంటున్న 31% మంది
- వ్యవసాయానికి మద్దతు ధర పెంచాల్సిందేనన్న 42% మంది
- ఎకనామిక్స్ టైమ్స్ ముందస్తు బడ్జెట్ సర్వే



- వివరాలు 5లో

### వాట్సాప్‌తో బీఎస్‌ఎన్‌ఎల్ పోటీ

- వైఫైతో కాల్స్ చేసుకునే సదుపాయం
- ప్రస్తుతం ప్రయోగదశలో వీవోవైఫై
- ముందుగా ద్వితీయ శ్రేణి నగరాల్లో ప్రారంభం



- బిజినెస్‌లో

# నిజాం నిధులెవరికి?

## 1948 విలీనానికి ముందు లండన్‌కు నిధులు

### వచ్చే నెలలో తీర్పు ఇవ్వనున్న బ్రిటన్ కోర్టు

**ఇదీ వాదన...**

భారత సైన్యాలు వస్తున్నాయన్న సమాచారంతో ఆరో నిజాం ఉస్మాన్ అలీఖాన్ 1948లో 1.7 లక్షల పౌండ్లను పాకిస్తాన్‌లోని బ్రిటిష్ హైకమిషనర్‌కు బదిలీ చేశారు. అయితే ఈ నిధులపై అప్పటి నుంచి వివాదం కొనసాగుతుంది. కాగా తెలంగాణకే ఆ నిధులు చెందుతాయన్న వాదనా ఉంది.



ఇదీ నిజాం పరివారం..

**నిధుల కోసం పోరాడుతుంది వీరే..**

భారత ప్రభుత్వం, పాకిస్తాన్ ప్రభుత్వం, నిజాం వారసులు

**1.7 లక్షల పౌండ్లు** (సుమారు రూ.23 లక్షలు) నాడు బదిలీ చేసిన మొత్తం

**రూ.304 కోట్లు** నేడు వాటి విలువ

**మీర్ ఉస్మాన్ అలీఖాన్**
భార్య: దుల్హన్ పాషా బేగం
సంతానం: ఆజంజా, మౌజంజా, మహ్మద్ ఉన్నీసా బేగం

**ఆజంజా పరివారం...**
భార్య: దుర్రేషెవార్ (టర్కీ)
సంతానం: ముకర్రం, ముఫకంజ

**మౌజంజా పరివారం...**
భార్యలు: నీలోఫర్(టర్కీ), రజియా, అన్వరీ. సంతానం: ఫాతిమా, ఫాజియా అమీనా, ఓలియా, శ్యామత్ అలీఖాన్

-2లో



### స్పెషలాఫీసర్లు వచ్చేశారు..

- జిల్లా కలెక్టర్లు, డీఆర్‌వోలు, ఆర్డీవోలకు పురపాలన బాధ్యతలు
- హైదరాబాద్ శివారు మున్సిపాలిటీలకు గ్రేటర్ అధికారులు
- 61 మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు

- వివరాలు 4లో



### కృష్ణా బేసిన్ ఖాళీ!

- సీజన్ ఆరంభమై నెల గడిచినా కృష్ణా బేసిన్‌లో చుక్క నీటికి కరువే
- ఎగువ కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్‌కు లేని ప్రవాహాలు
- గత ఏడాదితో పోలిస్తే కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో 60 టీఎంసీల లోటు
- ఇప్పుడు ప్రవాహాలు మొదలైనా రాష్ట్ర ప్రాజెక్టులకు ఆగస్టులోనే నీళ్లు

- వివరాలు 2లో









ఇదం జగత్



..చివరకు మీ రాజీనామాకు కూడా అడ్డుపడుతున్నార్సార్!




## నేడు, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయ జార్ఖండ్ దాన్ని ఆనుకుని ఉన్న ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉండటంతో, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది.

**వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం**

మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లో 4 సెం.మీ., దామరగిద్ద 3 సెం.మీ., కొమురం భీం జిల్లా సిర్పూరు 4 సెం.మీ., ఆసిఫాబాద్ 3 సెం.మీ., జైనూర్ 3 సెం.మీ., కెరిమెరి 2 సెం.మీ., ధర్మసాగర్ (వరంగల్ అర్బన్) 2 సెం.మీ., డిచ్‌పల్లిలో (నిజామాబాద్) 2 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

## భూ నిర్వాసితుల చెక్కులు తీసుకురండి

### ప్రభుత్వానికి సూచించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం వేములఘాట్‌లో సేకరించిన భూములకు పరిహార చెక్కులను హైకోర్టుకు అందజేయాలని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. పరిహార చెక్కులు సిద్ధంగా ఉన్నా రైతులు తీసుకోవడం లేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేశామని, ఇల్లు వద్దన్న వారికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పినా పిటిషనర్లు తీసుకోవడం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. సిద్ధంగా ఉన్న చెక్కులను ఈ నెల 18న జరిగే విచారణకు తీసుకురావాలని సూచించింది. గతంలో హైకోర్టులోనే రైతులు భూపరిహార చెక్కులను తీసుకున్నారని, ఇప్పుడు కూడా తీసుకోవచ్చని స్పష్టం చేసింది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌లో భూసేకరణ అవార్డు నోటిఫికేషన్‌ను ఎం.జయమ్మ, మరో 15 మంది హైకోర్టులో సవాల్ చేశారు. 2007లో ఇచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగానే అవార్డు జారీ చేయడం చట్ట వ్యతిరేకమనేది పిటిషనర్ల వాదన.

## మమ్మల్ని ఆదుకోండి

### బీసీ కమిషన్ ముందు బైల్ కమ్మర, గౌడజెట్టీల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటివరకు తాము అభివృద్ధిని, సంక్షేమ ఫలాలను అందుకోలేక ఇప్పటికీ సంచార జీవులుగానే బతుకులు వెళ్లదీస్తున్నామని, తమను బీసీలుగా గుర్తించి వెంటనే ఆదుకోవాలని బైల్ కమ్మర, గౌడజెట్టి కులాలకు చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్‌కు విన్నవించారు. ఈమేరకు వారు కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఆంజనేయులుగౌడ్, జూలూరి గౌరీశంకర్, మెంబర్ సెక్రటరీ అనితా రాజేంద్రలు కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బైల్‌కమ్మర, ఫిసాడి, బైటకమ్మర, గౌడజెట్టి కులాల వారు తమ సమస్యలను కమిషన్ ముందుంచి పరిష్కరించాలని కోరారు. గౌడ కులస్తులకు సాంస్కృతికంగా ఆశ్రిత కులమైన గౌడజెట్టీలు తమ కళారూపాలైన గౌడపురాణం, యక్షగాన ప్రక్రియలను కమిషన్ ముందు ప్రదర్శించి చూపారు. బైల్ కమ్మర వారు రోడ్ల పక్కన గుడారాల్లో వారు ఏ విధంగా జీవనం కొనసాగిస్తున్నారో కమిషన్‌కు వివరించారు. అలాగే ఇనుముతో తయారు చేస్తున్న పారలు, గడ్డపారలు, గొడ్డళ్లు, ఇతర పనిముట్ల తయారీ విధానాన్ని కమిషన్ ముందు ప్రదర్శించారు. రిజర్వేషన్లు వర్తింపచేయకపోవడం వల్ల విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో పూర్తిగా నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రతికూల వాతావరణంతో ముంబైకి విమానాల రద్దు

హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా ముంబై విమానాశ్రయంలో ప్రధాన రన్‌వే మూసివేయడంతో హైదరాబాద్ నుంచి ముంబైకి రాకపోకలు సాగించే పలు విమానాలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి పలు విమానాలను అధికారులు రద్దు చేశారు. ముంబై నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రావాల్సిన కొన్ని విమానాలు రద్దవడమే కాకుండా నగరం నుంచి ముంబై వెళ్లాల్సిన వివిధ ఎయిర్‌లైన్స్‌లకు చెందిన మొత్తం 13 విమానాలు రద్దయ్యాయి. వీటితోపాటు ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలు ల్యాండ్ కావడానికి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పలు దేశీయ, అంతర్జాతీయ విమానాలను కూడా శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించినట్లు విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోర్ట్ బ్లెయిర్ వెళ్లాల్సిన ఇండిగో విమానం, వడోదర విమానాశ్రయానికి వెళ్లాల్సిన కొన్ని విమానాలూ సాంకేతిక కారణాలతో రద్దయ్యాయని సమాచారం.

## భవనం పైనుంచి పడిన శ్రీవారి సేవకుడు

తిరుమల: శ్రీవారి సేవ కోసం వచ్చిన ఓ యువకుడు తిరుమలలోని శ్రీవారి సేవా సదన్‌లో రెండవ అంతస్తు నుంచి కింద పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన సుమన్ (28) శ్రీవారి సేవ చేసేందుకు గత నెల 28న తిరుమలకు వచ్చాడు. మంగళవారం రాత్రి భోజనం చేసిన అనంతరం రెండో అంతస్తులోని కిటికీ వద్ద నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన సుమన్‌ను తిరుమలలోని అపోలో ఆస్పత్రిలోని అత్యవసర చికిత్సకు తరలించారు. అతని తల, కాలు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయని, పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. దీంతో అతన్ని మెరుగైన చికిత్సకోసం రుయాకు తరలించనున్నారు. సేవా సదన్ భవనంలోని కొన్నిచోట్ల కిటికీలకు గ్రిల్స్ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు అభిప్రాయపడుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రోడ్ల విస్తరణ చేపట్టండి: బీబీ పాటిల్



సాక్షి, న్యూఢిల్లీ: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రోడ్ల విస్తరణ చేపట్టాల్సిందిగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ బీబీ పాటిల్ కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఆయన ఎన్‌హెచ్–161బీబీ సెక్షన్‌లో బోధన్–రుద్రూరు–మద్నూరు రహదారిని నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో రహదారుల అభివృద్ధికి ప్రవేశపెట్టిన భారతమాల, ఇతర పథకాల ద్వారా నియోజకవర్గ పరిధిలో అవసరమైన రోడ్ల విస్తరణ, అభివృద్ధి చేపట్టాల్సిందిగా పలు ప్రాజెక్టుల వివరాలను కేంద్ర మంత్రికి అందించారు.

## ఆచార్య ఉమామహేశ్వరరావుకు 'తానా' పురస్కారం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు తానా ప్రతిష్ఠాత్మకంగా అందించే గిడుగు రామ్మూర్తి స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. జూలై 4 నుంచి 6 వరకు వాషింగ్టన్‌లో జరిగే 22వ తానా మహాసభల్లో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. బయాలజీలో ఎమ్మెస్సీ చేసిన ఉమామహేశ్వరరావు ఆ తర్వాత భాషా శాస్త్రం వైపు దృష్టి సారించారు. తెలుగు భాష మూలాలకు సంబంధించిన పరిశోధనలో ఆయన కీలకంగా వ్యవహరించారు. తెలుగు భాషకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంలో కూడా గారపాటి కృషి గొప్పదని తానా అధ్యక్షుడు సతీశ్ వేమన, తానా భాషాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎనికెపాటి జనార్దన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## వకుళాభరణానికి తానా ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరిగే 22వ తానా మహాసభలకు రావాల్సిందిగా బీసీ కమిషన్ సభ్యులు, ప్రముఖ రచయిత, సాహితీవేత్త డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావును తానా కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు తానా అధ్యక్షుడు సతీశ్ వేమన కృష్ణమోహన్‌రావుకు ఆహ్వానాన్ని పంపారు.

# కృష్ణా బేసిన్ ఖాళీ!

- సీజన్ ఆరంభమై నెల గడిచినా కృష్ణా బేసిన్‌లో నీటికి కరువే
- కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్‌కు లేని ప్రవాహాలు
- గత ఏడాదితో పోలిస్తే కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో 60 టీఎంసీల లోటు
- ఇప్పటికిప్పుడు ప్రవాహాలు మొదలైనా ఆగస్టులోనే నీళ్లు
- గోదావరి ప్రాజెక్టుల్లోనూ గడ్డు పరిస్థితి




సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు మిగిల్చిన నైరాశ్యం రాష్ట్రంలోని భారీ ప్రాజెక్టులపై ఎనలేని ప్రభావం చూపుతోంది. నెల రోజులైనా వానల జాడలేకపోవడంతో రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లోకి చుక్క నీరు రాలేదు. సాధారణంగా జూన్‌లో ప్రవాహాలుండే గోదావరి సైతం నీటి ప్రవాహాల జాడ కానరాక నిర్జీవంగా మారగా, కృష్ణా బేసిన్‌లో కరువు పరిస్థితులే కళ్లకు కడుతున్నాయి. ఎగువ కర్ణాటకలోనూ ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టుల్లోకి నెల రోజుల్లో చుక్క నీరు రాకపోవడం దయనీయ పరిస్థితిని కళ్లకు కడుతోంది. ఇక్కడే ఏకంగా 223 టీఎంసీల మేర నీటి కొరత ఉండటం, ఇప్పటికిప్పుడు మెరుగైన వర్షాలు కురిసినా అక్కడి ప్రాజెక్టులు నిండి తెలంగాణలోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు నీటి ప్రవాహం రావాలంటే ఆగస్టు ఆఖరి దాకా ఆగాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కనీస నీటి మట్టాల దిగువకు వెళ్లి ప్రాజెక్టుల్లో నీటిని తోడుతున్న నేపథ్యంలో ఆగస్టు వరకు ఆగడం రాష్ట్రానికి కొత్త చిక్కులు తెచ్చి పెట్టనుంది.

**ఎగువనా కరువే...**

కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నిల్వలు ఇప్పటికే కనీస మట్టాల దిగువకు పడిపోయాయి. ఈ రెండు ప్రాజెక్టుల్లోనే ఏకంగా 368 టీఎంసీల నీటి లోటు ఉంది. గత నెల రోజుల్లో ఇక్కడ ఎలాంటి ప్రవాహాలు లేవు. ఇప్పటికే సాగర్‌లో రాజధాని తాగునీటి అవసరాల కోసం అత్యవసర పంపింగ్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల్లోకి నీరు చేరాలంటే ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు నిండాల్సి ఉంది. ఆల్మట్టి, నారాయణపూర్ నిండితేనే దిగువకు ఇన్‌ఫ్లో ఉంటుంది. అక్కడా లోటు వర్షపాతం కారణంగా ప్రవాహాలే లేవు. ఆల్మట్టిలో ప్రస్తుతం 129.72 టీఎంసీలకు గాను కనీస నీటి మట్టాలకు దిగువన 21.70 టీఎంసీలు, నారాయణపూర్‌లో 37.64 టీఎంసీలకు గాను 18.18 టీఎంసీ, తుంగభద్రలో 100.86 టీఎంసీలకు కేవలం 1.91 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మొత్తంగా 223 టీఎంసీల మేర లోటు కనబడుతోంది. ఇందులో కనీసంగా 105 నుంచి 120 టీఎంసీలు చేరితే గానీ దిగువకు ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశం లేదు. ముఖ్యంగా ఆల్మట్టిలో 100 టీఎంసీల నీరు చేరితే దిగువ నారాయణపూర్‌కు వదులుతారు. అక్కడ ప్రాజెక్టు నిండిన అనంతరం దిగువ రాష్ట్రానికే వదిలే అవకాశం ఉంటుంది. సాధారణంగా జూన్ రెండు, మూడో వారం నుంచే ప్రవాహాలుంటాయి. ఇంతకుముందు సంవత్సరాల్లో ఆల్మట్టికి జూన్‌లోనే 20 నుంచి 30 టీఎంసీల నీటి రాక వచ్చిన సందర్భాలున్నాయి. జూలై నుంచి అవి పుంజుకుంటే జూలై మూడో వారం నుంచి దిగువకు నీటి విడుదల జరిగేది. కానీ ప్రస్తుతం భిన్న పరిస్థితి కనబడుతోంది. గత ఏడాది జూలైతో పోలిస్తే ప్రస్తుతం ఎగువ, దిగువ ప్రాజెక్టుల్లో 60 టీఎంసీల మేర నిల్వలు తక్కువగా ఉన్నాయి. అక్కడ చుక్క నీటి ప్రవాహాలు లేకపోవడంతో ఈ నెలలో కురిసే వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ నెలలో సరైన రీతిలో వర్షాలు కురిసి ప్రవాహాలు కొనసాగితే.. ఆగస్టు చివరి వారం నుంచి దిగువ ప్రాజెక్టులకు ప్రవాహాలు ఉంటాయి. లేనిపక్షంలో కృష్ణా బేసిన్‌లో గడ్డు పరిస్థితులు తప్పవు.

**గొల్లుమంటున్న గోదావరి...**

రాష్ట్రానికి వరప్రదాయినిగా ఉన్న గోదావరికి కూడా ఈ ఏడాది నీటి ప్రవాహాలు లేవు. జూన్ చివరి వారానికే ఉధృతరూపం దాల్చే గోదావరిలో ఈ ఏడాది కనీస నీటి ప్రవాహాలు కూడా నమోదవడం లేదు. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లోనూ ఎక్కడా పెద్దగా నీరు రాలేదు. ప్రధాన ప్రాజెక్టుల్లోకి ఇప్పటివరకు కేవలం ఒక్క టీఎంసీ నీరు కూడా చేరలేదు. ఎగువ మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్టులో గతేడాదితో పోలిస్తే ఏకంగా 83 టీఎంసీల మేర నీటి నిల్వలు తక్కువగా ఉండటం, అక్కడ అధిక వర్షాలు నమోదైతే గానీ దిగువకు నీరిచ్చే అవకాశం లేకపోవడం రాష్ట్రాన్ని కలవరపెడుతోంది. సాధారణంగా కృష్ణా బేసిన్‌తో పోల్చి చూస్తే గోదావరి బేసిన్‌లో జూన్, జూలైలో మంచి వర్షాలుంటాయి. అయితే ఈ ఏడాది గోదావరి బేసిన్‌లో ఎక్కడా ఆశాజనక పరిస్థితులు లేవు. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిసినా అవి గోదావరి పరీవాహకంలో లేకపోవడంతో దిగువ ఎస్సారెస్పీ, సింగూరుకు నీటి ప్రవాహాలు పెద్దగా లేవు. నిజాంసాగర్ పూర్తిగా వట్టిపోయింది. బాబ్లీ గేట్లు సోమవారం తెరుచుకున్నా దిగువకు చుక్క వచ్చే పరిస్థితులు లేవు. గోదావరి, ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద సైతం గత ఏడాది ఇదే సమయానికి లక్షల క్యూసెక్కుల మేర ప్రవాహాలు ఉండగా ఈ ఏడాది కేవలం 3వేల క్యూసెక్కులకు మించి ప్రవాహం లేదు. అయితే ఇప్పుడిప్పుడే మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రవాహాలు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## భూగర్భం విలవిల

రాష్ట్రంలో భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా అడుగంటి పోతున్నాయి. లోటు వర్షపాతం కారణంగా నీరు భూగర్భానికి చేరడం లేదు. నైరుతి రుతుపవనాల జాప్యం ఎన్నడూ లేనంత ప్రభావాన్ని చూపుతుండటంతో నీటి మట్టాలు పాతాళానికి చేరాయి. రాష్ట్ర సరాసరి భూగర్భ నీటి మట్టం ప్రస్తుతం 14.40 మీటర్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే 2.13 మీటర్ల దిగువన భూగర్భ జలాలుండటం పరిస్థితికి అద్దం పడు తోంది. జూన్ మాసానికి సంబంధించి భూగర్భ జల శాఖ 589 మండలాల్లోని 941 పరిశీలక బావుల ద్వారా భూగర్భ జల మట్టాలను విశ్లేషించింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 129.2 మిల్లీమీటర్లకు గానూ కేవలం 87.1 మి.మీ.లుగా నమోదైంది. 33 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో గత ఏడాది జూన్‌లో రాష్ట్ర సరాసరి నీటి మట్టం 12.27 మీటర్లు ఉండగా, అది ఈ ఏడాది 14.40 మీటర్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే.. 2.13 మీటర్ల మేర భూగర్భ మట్టం దిగజారింది. కేవలం నాలుగు జిల్లాల్లో మాత్రమే 0.12 మీటర్ల నుంచి 1.03 మీటర్ల మేర పెరుగుదల కనిపించగా, 29 జిల్లాల్లో 10.70 మీ. నుంచి 0.06 మీటర్ల మేర తగ్గుదల కనిపించింది. రాష్ట్ర మొత్తంగా మెదక్ జిల్లాలో 26.5 మీటర్ల దిగువకు మట్టాలు పడిపోగా, తర్వాతి స్థానంలో సంగారెడ్డి (23.96 మీటర్లు), వికారాబాద్ (20.23 మీటర్లు) ఉన్నాయి.

# అంగుళం భూమినీ ఆక్రమించనివ్వం

- ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం
- ప్రభుత్వం నుంచి మాకు పూర్తి మద్దతు
- దాడులతో మా ఆత్మస్థైర్యం దెబ్బతినలేదు
- అమాయక ప్రజలను రెచ్చగొట్టడం వల్లే ఘర్షణాత్మక పరిస్థితి
- సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో పీసీసీఎఫ్ పీకే ఝా



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఒక్క అంగుళం అటవీభూమిని కూడా ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, ఈ విషయంలో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని అటవీ సంరక్షణ ప్రధానాధికారి (పీసీసీఎఫ్) ప్రశాంత్‌కుమార్ ఝా స్పష్టంచేశారు. ప్రభుత్వపరంగా తమకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు, మద్దతు అందుతున్న నేపథ్యంలో తమకు అప్పగించిన విధులను అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. విధుల నిర్వహణ, అటవీ ఆక్రమణలను అడ్డుకునే క్రమంలో ఇటీవల కొన్నిచోట్ల చోటుచేసుకున్న ఘటనలతో అధికారులు, సిబ్బంది ఆత్మస్థైర్యం ఏమాత్రం దెబ్బతినలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి కేసులు పెట్టడంతోపాటు దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుందని, అలాగే తమ విధుల నిర్వహణకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినందున వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. మంగళవారం సాక్షి ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయడంతో పాటు అడవుల సంరక్షణ, తదితర చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు.

**సాగుకాలం మొదలుకావడంతో...**

సాగుకాలం జూలైలో మొదలుకానుండటంతో అడవుల్లో కొత్త ఆక్రమణలకు ప్రయత్నాలు మొదలయ్యాయని ఝా వెల్లడించారు. గతంలోనే గుర్తించిన అటవీభూమిలో మొక్కలు నాటేందుకు అధికారులు, సిబ్బంది వెళుతుండడంతో కొన్నిచోట్ల ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడుతోందన్నారు. గిరిజనులు, ఇతర రైతులు ఇప్పటికే సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు బలవంతంగా చెట్లు నాటుతున్నారనే ఆరోపణలున్నాయి కదా అని అడగ్గా.. అలాంటిదేమీ లేదని బదులిచ్చారు. వివిధ స్థాయిల్లో అధికారులు, సిబ్బంది ఎన్నో కష్టనష్టాలకోర్చి పనిచేస్తున్నా అటవీశాఖను అడవులు సంరక్షించే విభాగంగా, చట్టాలను కాపాడే శాఖగా చూడకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. సార్సాలో జరిగిన ఘటన చూస్తే పోలీసులు, అటవీ సిబ్బందిపై దాడి జరిగిన తీరు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. చట్ట పరిరక్షణకు వెళ్లినవారిపై ఇలాంటి దాడులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సిబ్బందికి ఆయుధాలిస్తే ఇలాంటి దాడులు జరిగేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయని భావిస్తారా అన్న ప్రశ్నకు.. అలాంటిదేమీ లేదన్నారు. అటవీ అధికారులకు కూడా ఆయుధాలు సమకూర్చాలని వస్తున్న డిమాండ్‌పై ఎలా స్పందిస్తారని ప్రశ్నించగా.. అలాంటి పరిస్థితి ఉత్పన్నమయ్యే సూచనలు కనిపించడం లేదని పేర్కొన్నారు. 1980లలో అటవీశాఖ వద్ద కూడా ఆయుధాలుండేవని.. అయితే, మారుమూల ప్రాంతాల్లో అటవీ సిబ్బంది నుంచి నక్సలైట్లు ఆయుధాలు ఎత్తుకెళ్తుండటంతో వాటన్నింటినీ పోలీస్‌శాఖ వద్ద డిపాజిట్ చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఆయుధాలు లేకుండానే అన్నిస్థాయిల్లోని అధికారులు అడవుల్లో విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. గిరిజనుల భూములను అటవీశాఖ బలవంతంగా లాక్కుంటోందని, కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్న చోట కూడా హరితహారం కింద మొక్కలు నాటుతోందని, దాడులకు కూడా పాల్పడుతోందని వస్తున్న ఆరోపణలను ఝా తోసిపుచ్చారు. అడవుల్లోని భూమిని అప్పగిస్తామని, చెట్లను కొట్టి వ్యవసాయం చేసుకుంటే పట్టాలు ఇప్పిస్తామని అమాయక ప్రజలను కొంతమంది రెచ్చగొట్టడం వల్లే అడవుల్లో ఘర్షణాత్మక పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్... గజిబిజి!

మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. అందులో భాగంగానే తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డితో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఆయన సతీమణి పద్మినిల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే శశిధర్‌రెడ్డితోపాటు రాజనర్సింహ తాము బీజేపీలో చేరడం లేదని, అలాంటి ప్రస్తావనే రాదని కొట్టిపారేశారు. కానీ సుదర్శన్‌రెడ్డి మాత్రం ఎక్కడా ఈ విషయంపై మాట్లాడలేదు. దీనికితోడు గత ఎన్నికలకు ముందే రాజనర్సింహ సతీమణి పద్మిని బీజేపీ కండువా కప్పుకోవడంతో ఆమెపై కూడా ఊహాగానాలు మొదలయ్యాయి. అలాగే రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ ఎంపీ, అదే జిల్లాకు చెందిన మాజీ మంత్రి, కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన మరో నేత, మెదక్ జిల్లా నుంచి పార్లమెంటుకు పోటీ చేసిన ఓ అభ్యర్థి, టీపీసీసీలో కీలక పదవిలో ఉన్న మహిళా నాయకురాలు ఒకరు బీజేపీతో టచ్‌లో ఉన్నారని తెలుస్తోంది. వీరంతా తమతో టచ్‌లో ఉన్నారని బీజేపీ నేతలు బాహాటంగానే చెబుతున్నా ఆ నాయకులు మాత్రం మౌనంగానే ఉంటున్నారు. తాము బీజేపీలోకి వెళుతున్నామని తమ కేడర్‌తో కూడా చర్చించకుండానే రంగం సిద్ధం చేసుకుంటున్నారనే చర్చ కూడా జరుగుతోంది.

**ఖాళీ చేయడమేమో కానీ...**

రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకు గాలం వేస్తున్న బీజేపీ డిసెంబర్‌కల్లా గాంధీభవన్‌ను ఖాళీ చేయించే ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని చెబుతుండగా, ఖాళీ చేయడమేమోకానీ మానసికంగా ఇబ్బందుల్లో పడేసే పనిలో మాత్రం బీజేపీ సక్సెస్ అయిందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి బీజేపీలోకి కాంగ్రెస్ నేతలు వస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం వల్లే కాంగ్రెస్ కేడర్ అయోమయంలో పడిపోతోంది. బీజేపీ వ్యూహాత్మకంగా కావాలనే కొందరు నేతల పేర్లను ప్రచారంలో పెట్టి వారంతా తమ పార్టీలోకి వస్తున్నారనే సంకేతాలను పంపడం ద్వారా మైండ్‌గేమ్ ఆడుతోందనే భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**గుంభనంగా కాంగ్రెస్...**

పార్టీ నుంచి నాయకులంతా వెళ్లిపోతున్నారనే ప్రచారం జరుగుతున్నా కాంగ్రెస్ మాత్రం గుంభనంగా ఉంది. రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని గట్టిగా నమ్ముతోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తమకన్నా ఒక సీటు అదనంగా వచ్చినా ఓట్ల శాతం మాత్రం బీజేపీకన్నా దాదాపు 10 శాతం తమకే ఎక్కువగా వచ్చిందనే విషయాన్ని గుర్తుచేస్తోంది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయిందని చెబుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికార టీఆర్‌ఎస్‌కు భవిష్యత్తులో తామే ప్రత్యామ్నాయం కాగలమని, నేతలెవరూ పార్టీని వీడరని కాంగ్రెస్ నాయకత్వం నమ్ముతోంది. ఒకవేళ ఒకరిద్దరు నేతలు పార్టీని వీడినా ప్రతిపక్షంగా మాత్రం తామే నిలబడగలమని ధీమాగా ఉంది. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతామని చెబుతోంది. పట్టణ ప్రాంతాల్లో టీఆర్‌ఎస్‌పై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టింది.

# ఎన్నికల వల్లే స్పందించలేకపోయాం

- అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించనున్న ప్రభుత్వం?
- నిజాం షుగర్స్ లిక్విడేషన్‌పై చక్కెర శాఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: నిజాం దక్కన్ షుగర్స్‌ను విక్రయించాలనే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆదేశాల నేపథ్యంలో.. అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. సమస్య పరిష్కారానికి 12 వారాల గడువు ఇవ్వాలని గతంలో ట్రిబ్యునల్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అయితే ట్రిబ్యునల్ మాత్రం ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టెన్సీ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనలను కారణంగా చూపుతూ ఎన్‌డీఎస్‌ఎల్ ఆస్తులను లిక్విడేట్ (విక్రయం) చేయాలని ఆదేశించింది. గత నెల మూడో తేదీన ట్రిబ్యునల్ లిక్విడేట్‌కు వీలుగా ఆదేశాలు జారీ చేయగా.. ఇదే అంశాన్ని చక్కెర శాఖ అధికారులు గత నెల రెండో వారంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే లిక్విడేషన్‌కు వీలుగా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వరుస ఎన్నికల నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఎల్ పునరుద్ధరణకు నిర్దేశిత వ్యవధిలోగా కార్యాచరణ ప్రణాళిక ఇవ్వలేదనే అంశాన్ని అప్పిలేట్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### భారీ చేరికలా?

ఈ నెల 6న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్ర పర్యటన కూడా కాంగ్రెస్ నేతలను, పార్టీ శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఏకంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు వస్తుండటంతో కమలదళంలోకి భారీగా చేరికల కార్యక్రమం కూడా ఉంటుందనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో గుబులు పుట్టిస్తోంది. బీజేపీ వర్గాలు మాత్రం చేరికలుంటాయని చెబుతున్నాయే కానీ ఎవరన్న విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే బీజేపీలోకి వెళతానని చెప్పిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితోపాటు టీఆర్‌ఎస్ అసంతృప్త నేత వివేక్ తదితరులు కాషాయ కండువాలు కప్పుకోవచ్చని, వారికి మరికొందరు కాంగ్రెస్ నేతలు కూడా తోడవుతారనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ రాజగోపాల్‌రెడ్డి చేరిక సాంకేతికంగా ఇబ్బందికరమైందని బీజేపీ అధిష్టానమే చెబుతోందని, ఈ కారణంతో ఆయన చేరిక కొంత ఆలస్యం కావచ్చని సమాచారం.



ముకర్రంజ పరివారం: భార్యలు: ఎస్రా(టర్కీ)హెలెన్, మనోలియా ఒనూర్, జమీల (మొరాకో), ఒర్చిడ్ (టర్కీ), వీరందరికీ ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వీరంతా ఇప్పుడు టర్కీ, ఆస్ట్రేలియా, లండన్‌లో స్థిరపడ్డారు.
ముఫకంజ: భార్య ఏసెస్(టర్కీ), పిల్లలు: రఫత్ జా, ఫర్హత్ జా

- వీరు కాకుండా నిజాం వారసులుగా మరో 3,600 మంది చలామణి అవుతున్నారు. ప్రస్తుతం ముకర్రంజ ఆస్ట్రేలియా, టర్కీలలో, ముఫకంజ లండన్, హైదరాబాద్‌లలో నివసిస్తున్నారు.

# నిజాం నిధులెవరికి?

### తమవంటే తమవంటున్న పాక్, భారత్, నిజాం వారసులు



కుమారుడు ఆజంజా, కోడలు దుర్రేషెవార్, మనుమలు ముకర్రం, ముఫకంజాలతో ఉస్మాన్ అలీఖాన్. చిత్రంలో అప్పటి గవర్నర్ భీంసేన్ సచార్

సాక్షి, హైదరాబాద్: నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ దాచుకున్న భారీ నగదు వివాదం త్వరలో తేలిపోనుంది. హైదరాబాద్‌పై సైనిక చర్యకు కొన్ని రోజుల ముందు పాకిస్తాన్‌లోని బ్రిటిష్ హైకమిషనర్‌కు బదిలీ అయిన మొత్తం రూ.వందల కోట్లకు చేరటంతో భారత్, పాకిస్తాన్‌తో పాటు నిజాం వారసుల్లోనూ కదలిక మొదలైంది. హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసే దిశగా భారత సైన్యాలు వస్తున్నాయన్న సమాచారంతో ఆరో నిజాం ఉస్మాన్ అలీఖాన్ 1948లో 1.7 లక్షల పౌండ్లను పాకిస్తాన్‌లోని బ్రిటిష్ హైకమిషనర్‌కు బదిలీ చేశారు. అయితే ఈ నిధులపై అప్పటి నుంచి భారత్, పాకిస్తాన్‌లు న్యాయ పోరాటం చేస్తుండగా, ఇందులో నిజాం వారసులు ముకర్రంజ, ముఫకంజ కూడా నిధులు తమకే చెందుతాయంటూ వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు విన్న బ్రిటన్ హైకోర్టు వచ్చే నెలలో తీర్పు ఇవ్వనుందని నిజాం వారసులు పేర్కొంటున్నారు. లండన్‌లోని నాట్‌వెస్ట్‌లో బ్యాంక్‌లో జమ అయిన నిధులు.. ప్రస్తుత లెక్కల ప్రకారం సుమారు రూ.304 కోట్లకు చేరాయి. ఈ నిధులు మావంటే, మావేనని ఇరు దేశాలు నాలుగున్నర దశాబ్దాలుగా న్యాయ పోరాటం చేస్తున్నాయి.

**ఆయుధాల కోసమన్న పాకిస్తాన్..**

హైదరాబాద్ విలీనానికి ముందు ఉస్మాన్ అలీఖాన్ వద్ద ప్రధానమంత్రిగా ఉన్న లాయక్ అలీ నగదును పాకిస్తాన్‌లోని బ్రిటిష్ హైకమిషనర్‌కు బదిలీ చేశారు. దేశ విభజన అనంతరం లాయక్ అలీ పాకిస్తాన్ పౌరసత్వం పొందటంతో ఈ నిధులు తమకే చెందుతాయని పాకిస్తాన్ వాదించింది. దీనికి తోడు భారత్ దాడిని ఎదుర్కొనేందుకు ఉస్మాన్ అలీఖాన్ ఆయుధాల సరఫరా కోసం ఆ మొత్తాన్ని తమకు పంపాడని కూడా పేర్కొంది. తీర్పు భారత్, నిజాం వారసులకు అనుకూలంగా వస్తే ఎవరి వాటా ఎంత అన్న కోణంలో చర్చలు జరుగుతున్నాయి. నిజాం అసలు వారసులతో పాటు మరో 4 వేల మంది వరకు క్లెయిమ్ చేసుకుంటున్నారని నిజాం పాలనపై పరిశోధన చేసిన ఇజాస్ ఫారుఖీ 'సాక్షి'కి తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయవాది వెంకటరమణ మాట్లాడుతూ.. హైదరాబాద్ రాష్ట్ర ప్రజల ఆస్తినే నిజాం పంపారని పేర్కొన్నారు. అందుకే ఈ మొత్తాన్ని తెలంగాణకు వచ్చేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పార్టీ మారే ప్రసక్తే లేదు

### మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ



**సాక్షి, హైదరాబాద్:** తాను పార్టీ మారే ప్రసక్తే లేదని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టంచేశారు. తాను బీజేపీలో చేరతానన్నది తప్పుడు ప్రచారమని, తమది మొదటినుంచీ కాంగ్రెస్ కుటుంబమని మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడుతూ వెల్లడించారు. తాను కాంగ్రెస్ పార్టీకి బలమైన విధేయుడినని చెప్పారు. 2014 నుంచి 2018 వరకు బలమైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ నిలబడలేకపోయిందని, అందుకే ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయిందని ఆయన అభిప్రాయపడ్డారు. వైఎస్ జగన్ తరహాలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లలేకపోయిందన్నారు. తమ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి టీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారని చెప్పిన రాజనర్సింహ, ఫిరాయింపులు, వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. విధేయులకు ప్రాధాన్యతనివ్వాలని, పార్టీలో ప్రక్షాళన జరగాలని చెప్పారు. డబ్బులున్న వారికే పదవులు ఇవ్వడం సరికాదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలకు గుదిబండ కాబోతోందని వ్యాఖ్యానించారు.

## తిరస్కరించినా మారరా?: శ్రీనివాస్‌గౌడ్



**సాక్షి, హైదరాబాద్:** వరుస ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించినా ఆ పార్టీ నేతల వైఖరి మాత్రం మారడం లేదని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసనసభలో ప్రతిపక్ష హోదా కోల్పోవడంతో కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై మతిలేని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్ తరాల కోసం నిర్మిస్తున్న సచివాలయం, అసెంబ్లీ భవన నిర్మాణాలపై కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. పాత భవనాలన్నీ హెరిటేజ్ భవనాలు కావని.. హెరిటేజ్ భవనం గుర్తింపు కోసం కొన్ని ప్రత్యేక నిబంధనలుంటాయన్నారు. గతంలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను అడ్డుకునేందుకు కోర్టుకు వెళ్లిన కాంగ్రెస్ నేతలు.. ప్రస్తుతం అసెంబ్లీ, సెక్రటేరియట్ భవనాల విషయంలోనూ అదే వైఖరి అవలంభిస్తున్నారని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం పరిధిలో అటవీ శాఖ అధికారిణిపై దాడి ఘటనకు సంబంధించి.. పార్టీ నేతలపైనా ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

## పోడు సాగుకు అనుమతించాలి: చాడ



**సాక్షి, హైదరాబాద్:** పోడు వ్యవసాయానికి ప్రభుత్వం ఆటంకాలు సృష్టించడంపై ఆదివాసీల్లో ఏర్పడిన ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకే టీఆర్ఎస్ నాయకులు వారికి అండగా ఉన్నట్టుగా నాటకాలు ఆడుతున్నారని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ మొండిపట్టుదల కారణంగానే అటవీ అధికారులు పోడు సాగు చేసుకునే భూముల్లో హరితహారం చేపడుతున్నారనే విషయం అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు తెలియదా అని ప్రశ్నించారు. ఇటీవలి ఎన్నికల్లో ఆదివాసీల నియోజకవర్గాల్లో టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఫలితాలు రావడంతో ఆదివాసీలపై ఆగ్రహంతో ఉన్న టీఆర్ఎస్.. వారిని భూముల నుంచి తొలగించడంతోపాటు ఆ వ్యతిరేకత తమపై రాకుండా ఆ పార్టీ ప్రజా ప్రతినిధులతో అడ్డుకున్నట్లు చేస్తున్నారన్నారు.

## మూసీ ప్రక్షాళనకు చర్యలేవి?: కోమటిరెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** మూసీ నది ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చా రు. కొన్నేళ్ల క్రితం సాగు, తాగునీరు అందించిన ఈ న ది ప్రస్తుతం కాలుష్యమయమై దుర్వాసన వెదజల్లుతోందన్నారు. తన నియోజకవర్గంలో 70 శాతం ఉన్న ఈ నది ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం ప్రత్యేకంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## సుప్రీం చెప్పినా పట్టించుకోరా?: జాజుల



**హైదరాబాద్:** ఇంజనీరింగ్ ఫీజులు పెంచుకోవచ్చని హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తప్పు పట్టినా పట్టించుకోకుండా ఫీజులను పెంచుతామంటూ తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ చైర్మన్ స్వరూపరెడ్డి ప్రకటించడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. దీనిపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే విద్యార్థులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 'ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు'అనే అంశంపై విద్యార్థి, ప్రజా, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ఇంజనీరింగ్ కాలేజీల వ్యవహారశైలిని వ్యతిరేకిస్తూ ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లను ముట్టడిస్తున్నట్లు ప్రకటించారు. ఏపీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మంత్రి వర్గంలో బీసీలకు 60% చోటు కల్పించడం అభినందనీయమని కొనియాడారు.

## ఆ దాడులకు కేసీఆర్‌దే బాధ్యత: అన్వేష్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ఆసిఫాబాద్ జిల్లాలో అటవీ అధికారులను ప్రభుత్వమే రెచ్చగొట్టి ఆదివాసీల భూములపైకి పంపిందని టీపీసీసీ కిసాన్ సెల్ ఆరోపించింది. అధికార పార్టీ నేతలే ఆ అధికారులపై దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనకు సీఎం కేసీఆరే బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వంతోపాటు అధికార పార్టీ వ్యవహార శైలి కారణంగా అమాయక గిరిజన ఆదివాసీలకు తీరని నష్టం కలిగిందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అన్వేష్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతియేటా తొలకరి జల్లులు పడగానే ఆదివాసీ గిరిజనులు పోడు భూముల్లో విత్తనాలు చల్లి పంటలకు సిద్ధం కావడం, అటవీ అధికారులు ట్రాక్టర్లు, జేసీబీలతో వాటిని ధ్వంసం చేయడం గత నాలుగేళ్లుగా జరుగుతోందని ఆయన ఆరోపించారు.

## '8న నగరానికి జాతీయ బీసీ కమిషన్'



**హైదరాబాద్:** జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఈ నెల 8న హైదరాబాద్ వస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తెలిపారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8న బీసీ కమిషన్ చైర్మన్ భగవాన్‌లాల్ సహానీ, వైస్ చైర్మన్ లోకేశ్ కుమార్ ప్రజాపతి, సభ్యులు తల్లోజు ఆచారి, కౌశలేంద్ర, పటేల్, సుధా యాదవ్ హైదరాబాద్ రానున్నారని తెలిపారు. వీరంతా రవీంద్రభారతిలో 8న మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం కానున్నారన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించిన తర్వాత దేశ పర్యటనలో భాగంగా హైదరాబాద్ రానుందన్నారు. బీసీలకు ఎలాంటి అన్యాయం జరిగినా కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చని, ఈ కమిషన్ స్పందించి తగు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటుందన్నారు.

## 'ఆ ఘటనను సీరియస్‌గా తీసుకున్నాం'



**సాక్షి, హైదరాబాద్:** సార్సాల దాడి ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, అటవీ శాఖ అధికారులు స్థైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, అధికారులు ధైర్యంగా విధులు నిర్వహించాలని చెప్పారు. పేద, గిరిజన రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సార్సాల ఘటనపై సోమవారం సచివాలయంలో అటవీశాఖ ఉద్యోగుల సంఘం జేఏసీ ప్రతినిధులు మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించారు. అటవీ ఉద్యోగులపై జరిగిన దాడులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని వారు కోరారు. ఈ బృందంలో ఎస్ఎఫ్ఎస్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వోల సంఘం కార్యదర్శి బి.మోహన్, టీజేఎఫ్ఓఏ రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు మౌలం అలీఖాన్, అటవీశాఖ టీఎన్జీవోల ఫోరం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

# కృష్ణా అవసరం.. 431 టీఎంసీలు

- రాష్ట్రానికి శ్రీశైలంపై 256 టీఎంసీ, సాగర్‌పై 174 టీఎంసీల అవసరాలు
- నీటి అవసరాలు, అలైన్‌మెంట్‌లపై రాష్ట్ర ఇంజనీర్ల కమిటీ చర్చలు
- గోదావరి–కృష్ణా అనుసంధాన అధ్యయనం వేగిరం..
- నీటి తరలింపు మార్గాలపై అధ్యయనం



**సాక్షి, హైదరాబాద్:** గోదావరి జలాలను కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు తరలించే ప్రక్రియలో భాగంగా రాష్ట్రానికి ఉన్న అవసరాలు, జలాల లభ్యత, ప్రస్తుత వినియోగం, గత 60 ఏళ్లుగా వచ్చిన ప్రవాహాలు తదితర లెక్కలపై తెలంగాణ అధ్యయనం మొదలుపెట్టింది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక వేస్తూనే, గోదావరి నీటిని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ఎలా తరలించాలన్న దానిపై పరిశీలిస్తోంది. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు గరిష్ఠంగా 431 టీఎంసీల మేర నీటి అవసరాలు ఉన్నాయని ఇంజనీర్ల కమిటీ గుర్తించింది. కనిష్ఠంగా 200 టీఎంసీల నీరు తెలంగాణ అవసరాలకు గోదావరి నుంచి కృష్ణాకు మళ్లించాల్సి ఉందని తేల్చింది. తుపాకులగూడేనికి ఎగువన ఉన్న ప్రాంతం నుంచి శ్రీశైలానికి, దుమ్ముగూడెం, పోలవరం నుంచి నాగార్జునసాగర్ వరకు తరలించే ప్రతిపాదనలపై చర్చలు ప్రారంభించింది.

**గోదావరి నీరే శరణ్యం..**

కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల మేర నీటి కేటాయింపులు ఉండగా, ఇందులో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలు దక్కాయి. ప్రస్తుతం తెలంగాణకు కేటాయించిన 299 టీఎంసీల్లో 89 టీఎంసీల మేర చిన్న నీటి వనరుల కింద కేటాయించినవే. ఇవికాకుండా 210 టీఎంసీల నీటితో తెలంగాణ అవసరాలు తీరవు. మొత్తంగా శ్రీశైలం, జూరాల, సాగర్‌లపై ఆధారపడి 431 టీఎంసీల మేర అవసరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో శ్రీశైలంపై 256 టీఎంసీల అవసరమున్న ప్రాజెక్టులు ఉండగా, సాగర్‌పై 174 టీఎంసీలు, జూరాలపై 88 టీఎంసీల మేర ఆధారపడ్డ ప్రాజెక్టులున్నాయి. ప్రస్తుతం కేటాయింపులు పోను అదనంగా కనిష్ఠంగా 200 టీఎంసీల మేర నికర జలాల అవసరముంది. ప్రస్తుతం కర్ణాటక నుంచి దిగువకు నీటి లభ్యత లేని నేపథ్యంలో గోదావరి నీటి తరలింపే శరణ్యం కానుంది.

> **ఏపీ ఇంజనీర్లతో భేటీ వాయిదా**
>
> గోదావరి జలాల తరలింపు ప్రతిపాదనలపై బుధవారం జరగనున్న ఏపీ, తెలంగాణ ఇంజనీర్ల సమావేశం వాయిదా పడింది. వారి అధ్యయనాలు ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**ఏ మార్గం అనుకూలం..?**

ఏయే ప్రాంతాల్లోని ఆయకట్టుకు నీరందట్లేదు.. ప్రస్తుతం గోదావరి నీటిని ఏ మార్గాల ద్వారా తరలిస్తే రాష్ట్ర ఆయకట్టుకు ప్రయోజనకరంగా ఉంటుందన్న అంశాలపై ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు. మంగళవారం తెలంగాణ ఇంజనీర్ల కమిటీ ఈఎన్‌సీ మురళీధర్ నేతృత్వంలో జలసౌధలో భేటీ అయింది. ముఖ్యంగా తుపాకులగూడేనికి ఎగువన ఉన్న ప్రాంతం నుంచి నీటిని శ్రీశైలం ప్రాజెక్టు తరలించే మార్గాలపై టోపోషీట్ల ఆధారంగా అధ్యయనం చేశారు. ఎక్కువ ముంపు, అటవీ, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు లేకుండా, శ్రీశైలానికి దగ్గరగా ఉండే మార్గాలను అన్వేషించారు. దీంతో పాటే దుమ్ముగూడెం నుంచి సాగర్ టెయిల్‌పాండ్‌కు తరలించేందుకు గతంలో నిర్ధారించిన ముంపు ప్రాంతాలను తగ్గించి రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించే మార్గాలపై చర్చించారు. పోలవరం నుంచి సాగర్‌కు నీటిని తరలించడానికి ఉన్న అవకాశాలపై మాట్లాడుకున్నారు. పోలవరం నుంచి కృష్ణా బేసిన్‌కు నీటి తరలింపు చేస్తే ఎగువ రాష్ట్రాలు కృష్ణాలో నీటిని తీసుకునే అవకాశాలు, 1978 గోదావరి బచావత్ ట్రిబ్యునల్ అవార్డులో పేర్కొన్న అంశాలపైనా చర్చించారు. అయితే ప్రతిపాదిత ప్రాంతాల్లో గోదావరిలో గడిచిన 60 ఏళ్లుగా ఉన్న నీటి ప్రవాహపు లెక్కలను ముందుపెట్టి ఒక్కో ప్రాంతం నుంచి 200 టీఎంసీల నీటిని తరలించే అలైన్‌మెంట్‌లపై సమీక్షించారు. భేటీకి అంతర్రాష్ట్ర జల విభాగం సీఈ నరసింహారావు, ఎస్ఈ మోహన్‌కుమార్, సాగర్ సీఈ నర్సింహా, సీతారామ ఎస్ఈ నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ ఇంజనీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, వెంకటరామారావు తదితరులు హాజరయ్యారు.

**జూరాలపై ఆధారపడ్డ అవసరాలు.. (టీఎంసీల్లో)**

| ప్రాజెక్టు | అవసరం |
|---|---|
| జూరాల | 17.84 |
| ఊకచెట్టువాగు | 1.9 |
| భీమా | 20 |
| నెట్టెంపాడు | 25.4 |
| కోయిల్‌సాగర్ | 3.9 |
| మిషన్ భగీరథ | 4.05 |
| గట్టు | 15 |
| **శ్రీశైలంపై..** | |
| కల్వకుర్తి | 40 |
| పాలమూరు–రంగారెడ్డి | 90 |
| డిండి | 30 |
| చెన్నై తాగునీటికి | 1.67 |
| మిషన్ భగీరథ | 7.17 |
| **నాగార్జునసాగర్‌పై..** | |
| నాగార్జునసాగర్ | 105.7 |
| జంట నగరాల తాగునీరు | 16.8 |
| ఎస్ఎల్‌బీసీ | 40 |
| మిషన్ భగీరథ | 12.14 |
| మొత్తం | 431.52 |

# స్పెషలాఫీసర్లు వచ్చేశారు

- కలెక్టర్లు, డీఆర్‌వోలు, ఆర్డీవోలకు పురపాలన బాధ్యతలు
- హైదరాబాద్ శివారు మున్సిపాలిటీలకు గ్రేటర్ అధికారులు

**సాక్షి, హైదరాబాద్:** పట్టణాల పగ్గాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. మంగళవారం పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో మున్సిపాలిటీల్లో స్పెషలాఫీసర్లు కొలువుదీరారు. రాష్ట్రవ్యాప్తంగా పదవీకాలం ముగిసిన 61 నగర/పురపాలక సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ, గ్రేటర్ వరంగల్, ఖమ్మం, రామగుండం నగర పాలక సంస్థలు, సిద్దిపేట, అచ్చంపేట మున్సిపాలిటీల పదవీకాలం మరో రెండేళ్లు ఉంది. ఇవిగాక.. గతేడాది కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ఇప్పటికే ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. పాలక వర్గాల గడువు ముగిసిన మున్సిపాలిటీలకు ఆ స్థాయికి అనుగుణంగా స్పెషలాఫీసర్లను రాష్ట్ర సర్కారు నియమించింది. నగర పాలక సంస్థలు, పెద్ద మున్సిపాలిటీలకు కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా ప్రకటించగా.. మిగతా వాటి పగ్గాలను జాయింట్ కలెక్టర్లు, ఆర్డీఓలకు అప్పగించింది. ఇటు మున్సిపాలిటీల సంఖ్య ఎక్కువగా ఉండి.. సంబంధిత అధికారుల కొరత ఉన్న జిల్లాల్లో అదే స్థాయిలో ఇతర విభాగాల్లో పని చేస్తున్న అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించింది. ఇక హైదరాబాద్ శివార్లలోని పురపాలక సంఘాలకు మాత్రం జీహెచ్‌ఎంసీ సేవలను వినియోగించుకుంటోంది. జీహెచ్‌ఎంసీ, డీఎంఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు ఈ మున్సిపాలిటీల పాలన అప్పగించింది.

## 'సీట్లు ధ్రువీకరణ చేసుకోవాలి'

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీలో సీట్లు పొంది ఆన్‌లైన్‌లో రిపోర్ట్ చేసిన విద్యార్థులు ఈనెల 4వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సంబంధిత కళాశాలల్లో చేరాలని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఇన్ తెలంగాణ (దోస్త్) కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ (ఓఎస్ఆర్) చేసుకున్నపుడు వచ్చిన ఓటీపీ తోపాటు తమ ధ్రువపత్రాలను ఆయా కాలేజీల్లో అందజేసి, వారి సీట్లను పూర్తిస్థాయిలో ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. మూడో దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్ట్ చేసి, సంబంధించిన కాలేజీల్లో వారి సీట్లను కన్ఫర్మ్ చేసుకోవాలని కన్వీనర్ లింబాద్రి సూచించారు.

# షా చేతుల మీదుగా సభ్యత్వ నమోదు

### ప్రతి నియోజకవర్గంలో 15 నుంచి 20 వేల సభ్యత్వాలు బీజేపీ లక్ష్యం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చేతుల మీదుగా ప్రారంభించేందుకు రాష్ట్ర పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. శంషాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదుపై గత ఎన్నికల్లో పార్టీ తరపున పోటీచేసి గెలుపొందిన ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ముఖ్య నేతలతో మంగళవారం పార్టీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు తోపాటు వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరికలపైనా చర్చించినట్లు తెలిసింది. రామగుండం నుంచి మాజీ డిప్యూటీ మేయర్, పలువురు మాజీ కార్పొరేటర్లు అమిత్‌షా సభలో బీజేపీలో చేరే అవకాశం ఉంది. లేదంటే అంతకుముందుగానే పార్టీలో చేర్చుకుని, అమిత్ షా సభలో వారిని పరిచయం చేయనున్నారు. ప్రతి నియోజకవర్గంలో 15 వేల నుంచి 20 వేల వరకు సభ్యత్వాలు నమోదు చేయించేలా పక్కా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకుసాగాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో 50 మందిని కొత్తగా చేర్పించాలని నిర్ణయించామన్నారు. 6వ తేదీన అమిత్ షా శంషాబాద్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, 7వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందన్నారు. 3 రోజులపాటు ముఖ్యమైన నేతలు రాష్ట్రంలో విస్తృత పర్యటనలు నిర్వహిస్తారన్నారు. సభ్యత్వ నమోదు కోసం 8 వేల మంది విస్తారక్‌లుగా వారం రోజులపాటు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

# కనీస సామర్థ్యాలకు 'మూలాల్లోకి వెళ్దాం'!

- పాఠశాలల విద్యార్థుల కోసం విద్యాశాఖ కార్యాచరణ
- భాషల్లో, గణితంలో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మూలాల్లోకి వెళ్దాం (అటేన్‌మెంట్ ఆఫ్ బేసిక్ కాంపిటెన్సెస్ (ఏబీసీ)' పేరుతో విద్యార్థులకు కనీస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. బడిబాటలో భాగంగా పాఠశాలల్లో చేరిన 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకున్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అందరికీ ఆయా తరగతుల్లో కొనసాగడానికి మాతృభాష, గణితం, ఇంగ్లిషు భాషల్లో అవసరమైన కనీస సామర్థ్యాలను సాధించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి పాఠశాల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అమల్లోకి తెచ్చే లా చర్యలు చేపట్టింది. కనీసంగా 45 రోజుల నుంచి 60 రోజుల వరకు కనీస సామర్థ్యాల సాధనకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఆందోళన కలిగించే స్థాయిలో..**

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) ప్రకారం 3, 5, 8 తరగతుల్లో విద్యార్థుల భాషా, గణిత సామర్థ్యాలు ఆందోళన కలిగించేలా ఉన్నట్లు తేలింది. ప్రాథమిక తరగతులు పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన చదవడం, రాయడం, లెక్కలు వేయడం వంటి కనీస సామర్థ్యాలు వారిలో ఉండటం లేదని తేలింది. ఈ నేపథ్యంలో 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకున్న విద్యార్థులు అందరికీ ప్రత్యేక శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ వారంలోనే ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. తద్వారా విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషు, తమ మాతృభాషల్లో ధారాళంగా చదవడం, చదివిన దాన్ని అర్థం చేసుకోవడం, తప్పుల్లేకుండా సొంతంగా రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం వంటి లెక్కలు చేయడం నేర్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

**ఈ వారంలోనే స్థాయి పరీక్ష..**

కనీస సామర్థ్యాలపై విద్యార్థుల స్థాయి తెలుసుకునేందుకు ప్రారంభ పరీక్ష (ప్రీ టెస్టు)ను ఈ వారంలోనే తెలుగు, ఇంగ్లిషు, గణితంలో నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ పరీక్ష ఆధారంగా మాతృభాష, గణితం, ఇంగ్లిషులో కనీస సామర్థ్యాలున్న వారిని, లేని వారిని గుర్తించి, తరగతుల వారీగా ఆయా జాబితాలను రూపొందించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించింది. ఆ జాబితాల ఆధారంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టీచర్లతో చర్చించి కనీస సామర్థ్యాలు లేని వారికి ఏ సమయంలో వాటిని నేర్పించాలని.. ఎవరెవరు ఏయే బాధ్యతలు తీసుకొని పని చేయాలన్న ప్రణాళికలను రూపొందించుకొని అమలు చేయాలంది.

## 4న అఖిల భారత గిరిజన సదస్సు

**హైదరాబాద్:** తరతరాలుగా అడవులే జీవనాధారంగా జీవిస్తున్న గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా అఖిల భారత రైతు–కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'అఖిల భారత గిరిజన సదస్సు'నిర్వహిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య వెల్లడించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు జీవనాధారం, నివాసం అడవులే అని అలాంటి వారిని అడవుల నుంచి వెళ్లగొట్టడం దారుణమన్నారు. ఈ ఏడా ది మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 42 లక్షల మంది భూమి హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 19.84 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారని పేర్కొన్నారు.

## 'పోడు భూముల జోలికొస్తే పోరాటమే'

**హైదరాబాద్:** తాము సాగు చేసుకుంటున్న పోడు భూములు, తమపైకి ప్రభుత్వం అటవీ అధికారులను పంపడం వెంటనే ఆపేయాలని, లేకుంటే గిరిజనులంతా ఏకమై ఉద్యమిస్తామని గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం నాగోలులో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి దాడుల వెనుక రాష్ట్ర ప్రభుత్వం కుట్రదాగి ఉందన్నారు.

# స్వచ్ఛంద సంస్థల ద్వారా 'కంటి వెలుగు'

### ఆపరేషన్ల వేగవంతానికి సర్కారు సూత్రప్రాయ నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న ఆపరేషన్లను పూర్తిచేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు స్వచ్ఛంద సంస్థలు, ఎల్వీ ప్రసాద్ వంటి ప్రముఖ ఆసుపత్రుల్లో వీలైనంత త్వరగా కంటి ఆపరేషన్లు చేయాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. అలాగే సరోజినీదేవి కంటి ఆసుపత్రిలోనూ అదనపు వసతులు కల్పించి ఆపరేషన్లు జరిగేలా ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ భావిస్తోంది. అందుకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయి. ఎన్నికల కారణంగా అర్ధంతరంగా నిలిచిపోయిన ఆపరేషన్లను సత్వరం పూర్తిచేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. కంటి వెలుగు పథకం కోసం మంజూరై నిలిచిపోయిన రూ. 87.29 కోట్ల నిధులను కూడా ప్రభుత్వం రెండు రోజుల క్రితం విడుదల చేసింది. గతేడాది ఆగస్టు 15న 'కంటి వెలుగు'ప్రారంభమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఎన్నికల నాటికి 1.55 కోట్ల మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో చాలా మంది 18 ఏళ్లకు పైబడిన వారే ఉన్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో దాదాపు 90% మంది బడుగు బలహీనవర్గాలకు చెందిన వారే ఉన్నారు. పరీక్షల సందర్భంగా 35 లక్షల మందికి రీడింగ్ గ్లాసులు ఇచ్చారు. 20 లక్షల మందికి చత్వారీ గ్లాసులు ఇవ్వాలని ప్రిస్క్రిప్షన్ రాశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 7.04 లక్షల మందికి వివిధ రకాల ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. అందులో 6.64 లక్షల మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని తేల్చగా 2018–19 ఆర్థిక సంవత్సరంలో 23,629 మందికి ఆపరేషన్లు నిర్వహించారు.

# 'ఇస్టా' ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కేశవులు

- ప్రపంచ వేదికపై తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం
- 2022–24 మధ్య అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్న కేశవులు
- ప్రస్తుతం తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థకు డైరెక్టర్
- అభినందనలు తెలిపిన మంత్రి నిరంజన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ విత్తన పరీక్ష ప్రమాణాల సంస్థ (ఇస్టా) ఉపాధ్యక్షుడిగా తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు ఎన్నికయ్యారు. భారతదేశానికి, అందునా తెలంగాణకు ప్రపంచ వేదికపై దక్కిన అరుదైన గౌరవంగా వ్యవసాయశాఖ వర్గాలు అభివర్ణించాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల అవసరాలకు అనుగుణంగా విత్తన చట్టాలను, పాలసీలను, మార్కెట్‌లో విత్తన నాణ్యత, నియంత్రణ, సరఫరా మొదలగు అంశాలన్నింటిలో తీసుకునే కీలక నిర్ణయాలలో ప్రధానపాత్ర పోషించే ఇస్టా కార్యనిర్వాహక కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. జూన్ 26 నుంచి హైదరాబాద్ కేంద్రంగా హెచ్ఐసీసీలో అంతర్జాతీయ విత్తన సదస్సు–2019 నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇస్టా అత్యున్నత కమిటీలో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌తోపాటు 8 మంది సభ్యులు ఉంటారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి వివిధ దేశాల ప్రతినిధుల ద్వారా ఈ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. మొట్టమొదటిసారిగా భారతదేశం నుంచి తెలంగాణకు చెందిన డాక్టర్ కె.కేశవులు వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1924లో ఏర్పాటైన ఈ సంస్థలో భారతదేశానికి ఉపాధ్యక్ష పదవి లభించడం ఇదే మొదటిసారి. ఇస్టా ఉపాధ్యక్షుడిగా కేశవులు ఎన్నికవ్వడం దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కేంద్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ అగర్వాల్, రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి పేర్కొన్నారు. భారతదేశ విత్తనరంగంలో ఈ దశాబ్దకాలంలో వివిధ దేశాలకు దీటుగా, దేశ అవసరాలకు సరిపడా విత్తనోత్పత్తి చేస్తూ, వివిధ దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్న తరుణంలో ఈ స్థానం సంపాదించడం తెలంగాణకు ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఇస్టా సంస్థ ఉపాధ్యక్షుడిగా 2019–22 వరకు కేశవులు కొనసాగుతారు. సంస్థ నిబంధనల ప్రకారం ఇస్టా ఉపాధ్యక్షుడే తదుపరి అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. అంటే 2022–24 మధ్య ఇస్టా అధ్యక్షుడిగా డాక్టర్ కేశవులు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇస్టా సంస్థ వందేళ్ల కార్యక్రమం కేశవులు నేతృత్వంలోనే జరిగే అవకాశం ఉంది. ఈ అవకాశం ద్వారా మన దేశం ముఖ్యంగా తెలంగాణ నుంచి వివిధ దేశాలకు విత్తనాలు ఎగుమతులు చేసుకోవడానికి దోహదపడనుంది. అంతేకాకుండా విత్తన పరీక్షలో పద్ధతులు, నాణ్యత పెరిగి విత్తన చట్టాలను, పాలసీలను రూపొందించడానికి ఉపయోగపడనుంది.

**తెలంగాణ బిడ్డ...**

డాక్టర్ కేశవులు ఇస్టా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వడం తెలంగాణకు గర్వకారణం. ఒక సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన కేశవులు ఇంటర్మీడియట్ వరకు వరంగల్ జిల్లాలో విద్యను అభ్యసించి, వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీని పొంది, తమిళనాడులోని కోయంబత్తూరు అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, డేవిస్, అమెరికాలో పోస్ట్ డాక్టరల్ పరిశోధన చేసి విత్తన శాస్త్రంలో అత్యంత అనుభవం గడించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో విత్తన శాస్త్ర విభాగానికి అధిపతిగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థలో, విత్తనాభివృద్ధి సంస్థలో సంచాలకులుగా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ విత్తన ప్రముఖుడైన ప్రొఫెసర్ కెంట్ బ్రాడ్‌ఫోర్డ్‌తో కలిసి పనిచేశారు. యూఎస్ఏఐడీ భాగస్వామ్య సభ్యుడిగా ఉండి ఈస్ట్ ఆఫ్రికన్, సౌత్ ఆసియా దేశాలలో విత్తన పద్ధతుల అభివృద్ధిపై అధ్యయనం చేశారు. విత్తన నిల్వలో ఆహారధాన్యాల నష్టాన్ని తగ్గించి అంతర్జాతీయంగా అంగీకరించిన వినూత్న విత్తన నిల్వ పద్ధతులను కనుగొన్నారు. ఇస్టా, ఓఈసీడీ నేపాల్ అగ్రికల్చర్ రీసెర్చ్ కౌన్సిల్, ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సీఏబీఐ ఆఫ్రికా, సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీస్ ఆఫ్ టాంజానియా, బంగ్లాదేశ్‌లతో కలిసి విత్తన రంగ అభివృద్ధికి కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా తీర్చిదిద్దడంలో, 32వ అంతర్జాతీయ విత్తన సదస్సు హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంలో కేశవులు కీలకపాత్ర పోషించారు. కేశవులు ఇస్టా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడంతో తెలంగాణకు అనేక అవకాశాలు లభిస్తాయంటున్నారు. విత్తన శాస్త్ర సాంకేతిక రంగాలలో ఇతర దేశాలతో భాగస్వామ్యం కావడానికి మంచి అవకాశం లభించనుంది.

**ఇస్టా నూతన కార్యవర్గం**

**అధ్యక్షుడు:** స్టీవ్ జోన్స్ (కెనడా)

**ఉపాధ్యక్షుడు:** డాక్టర్ కె.కేశవులు (తెలంగాణ, భారత్)

**కార్యవర్గ సభ్యులు:** క్లెయిడ్ ముజాజు (జింబాబ్వే); వాలేరి కొకరేల్ (యునైటెడ్ కింగ్‌డమ్); శైల్వీ డ్యూకోర్నో (ఫ్రాన్స్); బెర్టా కిల్లర్‌మన్ (జర్మనీ); రిటాజెకెనెల్లీ (ఇటలీ); రూయెల్ సి.గెస్‌ముండో (ఫిలిప్పైన్స్); లీనా పియెటిల్లా (ఫిన్లాండ్); ఇగ్నోషియో అర్నషియాగ (అర్జెంటీనా)

# ముంబై అతలాకుతలం

## గోడ కూలి 21 మంది మృతి • మహారాష్ట్ర వ్యాప్తంగా 39 మంది దుర్మరణం

### ముంబైలో వర్షాలతో స్తంభించిన రవాణా సేవలు • విమానాలు, రైళ్ల రద్దు



కూలిన గోడ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు. (ఇన్‌సెట్లో) కుటుంబీకులను కోల్పోయి రోదిస్తున్న ఓ వృద్ధురాలు





ముంబై విమానాశ్రయంలో ల్యాండ్ అవుతూ భారీ వర్షం ధాటికి రన్‌వే నుంచి పక్కకు వెళ్లిన విమానం. ఘట్కోపర్‌లో వరదతో నిండిన రోడ్డు

**సాక్షి, ముంబై:** ముంబైను కుండపోత వర్షాలు మంగళవారమూ స్తంభింపజేశాయి. మలద్‌లోని పింప్రిపద ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఓ గోడ కూలి, పక్కన గుడిసెల్లో నివసిస్తున్న 21 మంది మరణించారు. మరో 78 మంది క్షతగాత్రులయ్యారు. గత రెండ్రోజుల్లో వర్షం సంబంధిత కారణాలతో మహారాష్ట్రలో మొత్తంగా 39 మంది మరణించారని అధికారులు చెప్పారు. ఆదివారం నుంచి ముంబైలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రోడ్డు, రైలు, విమాన రవాణా సేవలు ప్రభావితమయ్యాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం ముందుగానే హెచ్చరించడంతో ప్రభుత్వం ముంబై, చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం సాధారణ సెలవుగా ప్రకటించింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించింది. మలద్ ప్రాంతంలో గోడ కూలిన ఘటనలో 15 ఏళ్ల బాలిక శిథిలాల కింద చిక్కుకోగా, ఆమెను రక్షించే ప్రయత్నం విఫలమైంది. శిథిలాల నుంచి బయటకు తీసుకొచ్చే సమయానికే బాలిక మృతి చెందింది. మలద్ ప్రాంతంలోనే వరద రావడంతో మరో ఇద్దరు వ్యక్తులు కారులో చిక్కుకుని చనిపోయారు. విలే పార్లే ప్రాంతంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మరణించగా, ముంబై శివారు ప్రాంతమైన ములంద్‌లోనూ గోడ కూలి ఓ సెక్యూరిటీ గార్డు ప్రాణాలు కోల్పోయారు.

ముంబైలోనే 25 మంది వర్షాల కారణంగా మృత్యువాత పడ్డారు. ముంబైలోని ఎయిర్‌పోర్ట్ కాలనీ, వకోలా జంక్షన్, పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. మిఠీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు పరివాహక ప్రాంతాల నుంచి వెయ్యి మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు. బీఎస్సీ విద్యార్థులకు నిర్వహించాల్సిన ఓ పరీక్షను కూడా ముంబై విశ్వవిద్యాలయం వాయిదా వేసింది. మహారాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే రెండ్రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల మధ్యన ఉన్న 24 గంటల్లో ముంబైలో 16.3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబైకి తూర్పున ఉన్న శివారు ప్రాంతాల్లో 32.9 సెంటీ మీటర్లు, పడమరన ఉన్న శివారు ప్రాంతాల్లో 30.9 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**203 విమానాల రద్దు.. మరో 55 దారి మళ్లింపు**

మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముంబైలో ప్రజా రవాణా సేవలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వాతావరణం సహకరించని కారణంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించాల్సిన విమానాల్లో 203 పూర్తిగా రద్దవ్వగా, మరో 55 దారి మళ్లాయి. మరో 350 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. గురువారం వరకు విమానాశ్రయంలో ప్రధాన రన్‌వే మూసి ఉంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మధ్య, పశ్చిమ రైల్వే జోన్‌లకు సంబంధించిన అనేక దూరప్రాంతపు రైళ్లను కూడా రద్దు చేశారు. మరిన్ని రైళ్లు గమ్యస్థానం చేరకుండానే మధ్యలో నిలిచిపోయాయి. పట్టాలపైకి నీరు రావడంతో లోకల్ రైళ్లు కూడా కొన్ని చోట్ల దారి మధ్యలోనే నిలిచిపోయాయి. రైళ్లలో చిక్కుకున్న వేలాదిమంది ప్రయాణికులను ఆర్‌పీఎఫ్ జవాన్ల సాయంతో మధ్య రైల్వే సిబ్బంది రక్షించి, వారికి తేనీరు, ఆహార పదార్థాలు అందించారు. పశ్చిమ రైల్వే అధికారి ఒకరు మాట్లాడుతూ తమ సబర్బన్ రైలు సేవలు చర్చిగేట్, విరార్‌ల మధ్య సాధారణం కన్నా తక్కువ సంఖ్యలో తిరుగుతున్నాయని చెప్పారు. రోడ్లన్నీ నీళ్లతో నిండటంతో వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర ఆటంకం కలిగింది.

**పుణేలోనూ ఆరుగురు..**

ఇక మహారాష్ట్రలోని రెండో అతిపెద్ద నగరం పుణేలోని అంబేగావ్‌లో సోమవారం రాత్రి పొద్దుపోయాక గోడ కూలడంతో ఆరుగురు కార్మికులు చనిపోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. థాణే జిల్లాలోని కల్యాణ్ ప్రాంతంలోనూ మంగళవారం ఉదయం గోడ కూలి ముగ్గురు మరణించారు. బుల్ధానా జిల్లాలో పిడుగు పడటంతో 52 ఏళ్ల మహిళ చనిపోయింది. నాసిక్ జిల్లాలో మంగళవారం నీళ్ల ట్యాంకు కూలి నలుగురు కూలీలు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఉత్తర కొంకణ్ ప్రాంతం మొత్తం రుతుపవనాల కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు, చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది. కాగా, ప్రభుత్వాల అవినీతి కారణంగానే ముంబై, పుణేల్లో గోడలు కూలి ప్రజలు చనిపోయారని ప్రతిపక్ష పార్టీలు మంగళవారం అధికార బీజేపీ, శివసేన పార్టీలపై విరుచుకుపడ్డాయి. నగరాన్ని నీళ్లతో ముంచేసినందుకు ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ చవాన్ డిమాండ్ చేశారు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే నివాసం ఉండే ప్రాంతమైన బాంద్రాలోని కళా నగర్ కూడా నీట మునిగిందని, లోక్‌సభ ఎన్నికలకు ముందు ఠాక్రే తమ ఎంపీలతో గుళ్లు, గోపురాలకు తిరగకుండా తమ ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదని ఎద్దేవా చేశారు.

భారీ వర్షాలతో కష్టాల్లో చిక్కుకున్న వారికి నగర ప్రజలు ఆపన్నహస్తం అందించారు. దారి మధ్యలో చిక్కుకున్న వారిని వీలైతే గమ్యస్థానాలకు చేర్చడం, సమీప ఇళ్లలో ఆశ్రయం కల్పించడం తదితర చర్యలతో సాయం చేశారు. రవాణా సౌకర్యాలు లేకపోవడంతో దగ్గర్లో ఎవరైనా చిక్కుకుపోతే తమ ఇళ్లకు వచ్చి ఆతిథ్యాన్ని స్వీకరించాల్సిందిగా పలువురు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'నేనే చేసేది చాలా చిన్న సాయమే. వీర దేశాయ్ రోడ్ లేదా అంబోలీ ప్రాంతంలో ఎవరైనా చిక్కుకుపోయి ఉంటే వర్షం, వరద తగ్గే వరకు మా ఇంటికి వచ్చి ఉండటానికి మొహమాట పడకండి. ఎవరైనా ఉంటే నాకు నేరుగా మెసేజ్ పంపండి' అని బిభాష్ చటర్జీ అనే వ్యక్తి ట్వీట్ చేశారు. విధుల్లో ఉన్న పోలీసులు అవెంజర్స్ సూపర్ హీరోలు అని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. ముంబైని

## అదే స్ఫూర్తి..

భద్రంగా ఉంచేందుకు వారెంతో శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఓ ట్వీట్ చేస్తూ 'ముంబై విమానాశ్రయం మూతపడింది. పాఠశాలలను మూసేశారు. రైల్వే స్టేషన్లలోకి నీరు చేరింది. అయినా నా ఇంటికి వార్తా పత్రికలు సరైన సమయానికి, తడవకుండా వచ్చాయి. ఎవరికీ కనిపించని విధంగా గొప్ప గొప్ప పనులు చేస్తున్న వాళ్లందరికీ నేను అభివాదం చేస్తున్నా' అని పేర్కొన్నారు. వర్షాలు, వరదలను తట్టుకునేలా సరైన మౌలిక వసతులు లేకపోవడం, పరిస్థితిని ఎదుర్కొనేందుకు యంత్రాంగం ముందుగా సిద్ధం కాకపోవడం తదితర సమస్యలపై వ్యాపారవేత్తలెవరూ ఒక్క మాటా మాట్లాడకపోవడం గమనార్హం.



ముంబైలో చిన్నారిని సురక్షితంగా తీసుకెళ్తున్న స్థానికుడు

# ఖరీదైన విడాకులు

## 'అమెజాన్' బెజోస్ భార్యకు రూ. 2.62 లక్షల కోట్ల భరణం!

**వాషింగ్టన్:** అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ భార్యతో కుదుర్చుకున్న విడాకుల ఒప్పందం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ ఒప్పందం ద్వారా ఆయన భార్య మెకెంజీకి రూ.2.62 లక్షల కోట్ల (38 బిలియన్ డాలర్లు) మొత్తం సొంతం కానుంది. ఈ వారంలోనే ఇద్దరి మధ్య ఒప్పందం ఖరారుకానుంది. స్వతహాగా రచయిత అయిన మెకెంజీ(49) ప్రపంచంలో నాలుగో అత్యంత ధనిక మహిళగా మారారు. ఈ సంపదలో సగం వారెన్ బఫెట్, బిల్‌గేట్స్ స్థాపించిన ది గివింగ్ ప్లెడ్జ్ అనే ధార్మిక సంస్థకే కేటాయించనున్నట్లు గతంలో ఆమె చెప్పారు. అమెజాన్ ప్రారంభించటానికి ముందే 1993లో మెకెంజీకి బెజోస్‌తో వివాహమైంది. ఈ దంపతులకు నలుగురు పిల్లలున్నారు. జెఫ్ బెజోస్(55)కు వివాహేతర సంబంధం ఉన్నట్లు



వార్తలు రావడంతో వైవాహిక బంధానికి వీడ్కోలు చెప్పాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. బెజోస్ దంపతులకు అమెజాన్‌లో ఉన్న ఉమ్మడి షేర్లలో 25 శాతం మెకెంజీకి దక్కనున్నాయి.

# మాల్యా అప్పీల్‌పై విచారణకు హైకోర్టు ఓకే

**లండన్:** బ్యాంకులకు రూ.9వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన మద్యం వ్యాపారి విజయ్ మాల్యాకు బ్రిటన్ హైకోర్టులో ఊరట లభించింది. మాల్యాను భారత్‌కు అప్పగించే నిర్ణయం తీసుకుంటూ గతంలో బ్రిటన్ హోం శాఖ ఇచ్చిన ఉత్తర్వులపై మాల్యా చేసుకున్న అప్పీల్‌ను విచారించేందుకు హైకోర్టు అంగీకారం తెలిపింది. మాల్యా అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలా, వద్దా అన్న విషయంపై జస్టిస్ జార్జ్ లెగ్గాట్, జస్టిస్ ఆండ్రూ పాపుల్‌వెల్‌ల ద్విసభ్య ధర్మాసనం మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్నది. అనంతరం తాము అప్పీల్‌ను విచారణకు అనుమతిస్తున్నట్లు ప్రకటించింది. మాల్యా తరఫున న్యాయవాది క్లారీ మోంట్‌గోమెరీ వాదనలు వినిపించగా, భారత హై కమిషన్ కార్యాలయ అధికారులు, మాల్యా భాగస్వామి పింకీ లల్వానీ, కొడుకు సిద్ధార్థ్‌లు కూడా కోర్టుకు వచ్చారు. మాల్యా అప్పీల్ పిటిషన్‌ను కోర్టు తదుపరి రోజుల్లో విచారించనుంది. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం అప్పు తీసుకుని, బ్యాంకులకు దాదాపు 9 వేల కోట్ల రుణాన్ని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన మాల్యాను బ్రిటన్ పోలీసులు 2017 ఏప్రిల్‌లోనే అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయన అక్కడే బెయిల్‌పై ఉంటున్నారు. అప్పటి నుంచి మాల్యాను భారత్‌కు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బ్యాంకులకు ఉద్దేశపూర్వకంగానే మాల్యా రుణాలను ఎగ్గొట్టారనడానికి ఆధారాలు ఉన్నాయని గతేడాది డిసెంబర్‌లోనే లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు తేల్చింది. దీంతో మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ హోం శాఖ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది.

## వయోధికుల నిబంధనలు మరింత కఠినం

**న్యూఢిల్లీ:** తల్లిదండ్రులను సరిగ్గా పట్టించుకోకుండా వదిలిపెట్టే పిల్లల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ నిర్ణయించింది. తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమం, నిర్వహణ చట్టం–2007ను సవరణ చేయాలని, తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా వదిలేసే వారికి ప్రస్తుతం ఉన్న మూడు నెలల జైలు శిక్షను ఆరు నెలలకు పెంచాలని భావిస్తున్నట్లు ఆ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదిత బిల్లును ఆమోదం కోసం కేంద్ర కేబినెట్ ముందు ఉంచనున్నట్లు వెల్లడించారు. 'మంచి ఉద్యోగం ఉంది, ఎక్కువ జీతం ఉన్న వారు వారి తల్లిదండ్రులకు నిర్వహణ ఖర్చుల కింద ఎక్కువ మొత్తం ఇవ్వాలి'అని అధికారి పేర్కొన్నారు. కన్న పిల్లలే కాకుండా దత్తత తీసుకున్న వారు కూడా తల్లిదండ్రులకు నిర్వహణ ఖర్చులు ఇచ్చేలా మార్పులు చేయనున్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ చీఫ్‌గా రాహుల్‌గాంధీయే కొనసాగాలని, లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ కార్యకర్త బెదిరించడం పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం కలకలం రేపింది. పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానన్న రాహుల్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే చెట్టుకు ఉరేసుకుంటానంటూ ఢిల్లీకి చెందిన హనీఫ్‌ఖాన్ ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో అక్కడే ఉన్న పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు అతడిని అడ్డుకుని, ఆ ప్రయత్నాన్ని విరమింప జేశారు. పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ కొనసాగాలంటూ కొద్దరు నేతలు పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా కొనసాగుతోంది.

## జలాంతర్గామిలో మంటలు; 14 మంది మృతి

**మాస్కో:** రష్యాలో సముద్ర భూగర్భంపై శాస్త్రీయ పరిశోధనలకు వినియోగిస్తున్న ఓ జలాంతర్గామిలో మంటలు చెలరేగి 14 మంది మృతి చెందారు. రష్యా నావికా అవసరాల కోసం సముద్రగర్భంలో జలాంతర్గామిలో పరిశోధకులు బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్న సమయంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగిందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ప్రమాద సమయంలో చెలరేగిన మంటల నుంచి విషవాయువులు వెలువడ్డాయని, విషవాయువుల కారణంగా 14 మంది సిబ్బంది మృతి చెందారని అధికారులు చెప్పారు. రష్యా నేవీ కమాండర్ ఇన్ చీఫ్ నేతృత్వంలో ఘటనపై దర్యాప్తు కొనసాగనుంది.

## మెడికల్ కౌన్సిల్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ:** ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లు–2019కు మంగళవారం లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే వైద్య విద్యారంగంలో సమూల సంస్కరణలకు వీలవుతుందని ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ అన్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) ఏర్పాటవుతుందని బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన అన్నారు. ఇందుకు సంబంధించి ఫిబ్రవరిలో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఇది అమలవుతుందన్నారు. దేశంలో వైద్య విద్యను మెరుగుపరిచేందుకు నూతన వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌ఎంసీలోని బోర్డ్ ఆఫ్ గవర్నర్ల సంఖ్య ఏడు నుంచి 12కు పెరగనుంది. ఈ విధానంతో కళాశాలల మంజూరు, పోస్టుల భర్తీ, విద్యార్థుల ప్రవేశాల తీరులో జవాబుదారీతనం, పారదర్శకత పెరిగాయని మంత్రి తెలిపారు.

## భారత్‌కు నాటో హోదా

**వాషింగ్టన్:** భారత్‌కు నాటోతో సమాన హోదా ఇచ్చేందుకు సంబంధించిన శాసనసభ నిబంధనకు అమెరికా సెనేట్ ఆమోదం తెలిపింది. దీనివల్ల భారత్–అమెరికా దేశాల మధ్య రక్షణ సహకారాన్ని పెంపొందించేందుకు అవకాశముంటుంది. దీంతో అమెరికా నాటో మిత్రపక్ష దేశాలైన ఇజ్రాయిల్, దక్షిణ కొరియా దేశాల సరసన భారత్ నిలవనుంది. 2020 ఆర్థిక సంవత్సరానికి గాను జాతీయ రక్షణ అధికార చట్టం (ఎన్‌డీఏఏ) బిల్లును యూఎస్ సెనేట్ ఆమోదించింది. దీని ద్వారా హిందూ మహాసముద్రంలో భారత్–అమెరికాల మధ్య రక్షణ సహకారం మరింత పెరగడంతో పాటు, మానవతా సహాయం, ఉగ్రవాద నిర్మూలన, సముద్ర ప్రాంతంలో భద్రత వంటివి పెంపొందించడానికి ఈ చట్టందోహదపడుతుంది.

# దేశవ్యాప్తంగా 50 చోట్ల సీబీఐ సోదాలు

**న్యూఢిల్లీ:** రూ.1,139 కోట్ల మేర బ్యాంకులను మోసం చేసిన కేసులో సీబీఐ భారీ డ్రైవ్ చేపట్టింది. మంగళవారం దేశవ్యాప్తంగా ఏకకాలంలో 12 రాష్ట్రాల్లోని 18 నగరాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 61 చోట్ల సోదాలు చేపట్టింది. ఎస్‌బీఐ, సెంట్రల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర బ్యాంకులు చేసిన ఫిర్యాదుల మేరకు నమోదైన 17 కేసులకు సంబంధించిన వివిధ వాణిజ్య సంస్థల డైరెక్టర్లు, ప్రమోటర్లకు చెందిన ఇళ్లు, సంస్థలపై దాడులు జరిగాయి. పరారైన వజ్రాల వ్యాపారి జతిన్‌కి చెందిన ముంబైలోని విన్సమ్ గ్రూప్, తాయల్ గ్రూప్‌నకు చెందిన ఎస్కే నిట్, ఢిల్లీ కేంద్రంగా పనిచేసే నఫ్తోగజ్, ఎస్ఎల్ కన్జ్యూమర్, పంజాబ్‌లోని ఇంటర్నేషనల్ మెగా ఫుడ్‌పార్క్, సుప్రీం టెక్స్ మార్ట్ తదితరాలు లక్ష్యంగా సోదాలు చేపట్టినట్లు సీబీఐ తెలిపింది. గృహ రుణాల మంజూరులో అవకతవకలకు పాల్పడిన భువనేశ్వర్‌లోని యూనియన్ బ్యాంక్ శాఖ అధికారులపై మూడు కేసులు నమోదు చేసినట్లు సీబీఐ తెలిపింది. ఢిల్లీ, ముంబై, థానే, లూధియానా, వల్సాద్, పుణే, గయ, గుర్గావ్, చండీగఢ్, భోపాల్, సూరత్, కోలార్ తదితర నగరాల్లో చేపట్టిన ఈ సోదాల్లో 300 మంది అధికారులు పాల్గొన్నారని తెలిపింది. సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా నేతృత్వంలో చేపట్టిన తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయని సీబీఐ పేర్కొంది. రూ.640 కోట్ల మేర మోసం జరిగి ఉంటుందని అంచనా వేసిన అధికారులు సోదాల తర్వాత ఈ మొత్తం రూ.1,139 కోట్ల వరకు ఉంటుందని తేల్చారు. ఈ మేరకు జతిన్ మెహతాపై 16వ ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఎగ్జిమ్ బ్యాంకును రూ.202 కోట్ల మేర మోసం చేసినట్లు ఇతనిపై ఇప్పటికే పలు కేసులున్నాయి. భారీ వర్షాలతో అతలాకుతలమవుతున్న ముంబైలోనూ అధికారులు సోదాలు కొనసాగించారు.

# ఇరాన్ నిప్పుతో చెలగాటమాడుతోంది: ట్రంప్

**వాషింగ్టన్:** 2015 నాటి అణు ఒప్పందంలోని నిబంధనలను ఉల్లంఘించి యురేనియం నిల్వలను అనుమతించిన స్థాయికి మించి పెంచి ఇరాన్ నిప్పుతో చెలగాటమాడుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. యురేనియం నిల్వలను పెంచుకోవడాన్ని ఆపాలంటూ అమెరికా విదేశాంగ మంత్రి గట్టిగా చెప్పిన నేపథ్యంలో ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు చేశారు. అణు ఒప్పందంలోని నిబంధనలను ఇరాన్ తొలిసారిగా గత సోమవారం ఉల్లంఘించింది. 'ఇరాన్ నిప్పుతో చెలగాటమాడుతోంది. నేను కొత్తగా ఇరాన్‌కు



చెప్పదలచుకున్నది ఏదీ లేదు. అయితే తాము నిప్పుతో ఆడుకుంటున్నామన్న విషయాన్ని ఇరాన్ గుర్తెరగాలి' అని ట్రంప్ శ్వేతసౌధంలో మీడియాతో అన్నారు. అనంతరం శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ స్టెఫానీ గ్రిషమ్ ఓ ప్రకటన విడుదల చేస్తూ 'యురేనియంను చిన్న మొత్తంలో నిల్వ చేసుకునేలా అణు ఒప్పందంలో ఇరాన్‌కు అవకాశం కల్పించడమే తప్పు. అసలు ఏ స్థాయిలోనూ యురేనియం నిల్వలను కలిగి ఉండేందుకు ఇరాన్‌ను అనుమతించి ఉండాల్సింది కాదు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేసేందుకు అమెరికాతో పాటు మా మిత్రదేశాలు కూడా ఎప్పటికీ అనుమతించవు' అని అన్నారు. అణు ఒప్పందం ప్రకారం 300 కేజీల వరకు యురేనియంను నిల్వచేయొచ్చు.

# ఎవరినీ ఉపేక్షించం

- అహంకారంతో వ్యవహరిస్తే చర్యలు తప్పవు: మోదీ

**న్యూఢిల్లీ:** బీజేపీ నేతలెవరైనా సరే అహంకారపూరితంగా, అనుచితంగా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని ప్రధాని మోదీ హెచ్చరించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ సీనియర్ నేత కైలాశ్ విజయ్‌వర్గీయ కొడుకు, ఎమ్మెల్యే ఆకాశ్ వర్గీయ ఇటీవల ఓ ప్రభుత్వ అధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన ఘటన నేపథ్యంలో ప్రధాని ఈ హెచ్చరికలు చేశారు. మంగళవారం ఇక్కడ జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. 'అతడు ఎవరి కొడుకైనా సరే అటువంటి వారి అహంకారపూరిత, దుష్ప్రవర్తనను సహించేది లేదు. ఎవరికి వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తామంటే ఊరుకోబోం. కఠిన చర్యలు తప్పవు' అని హెచ్చరించారు. ఆకాశ్ జైలు నుంచి విడుదలైనపుడు హడావుడి చేసిన నేతలపై బీజేపీ గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమయంలో ఆకాశ్ తండ్రి కైలాశ్ సమావేశంలోనే ఉండటం గమనార్హం. ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టిన సమయంలో లోక్‌సభలో పార్టీ సభ్యుల హాజరు శాతం తక్కువగా ఉండటంపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ప్రజలకు గుర్తుండేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బీజేపీ సిద్ధాంతకర్త శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఈ నెల 6వ తేదీన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారణాసి నుంచి ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ప్రతి బూత్ పరిధిలో కనీసం ఐదు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ 'పంచవటి'గా పేర్కొన్నారు. శ్రీ సీతారామలక్ష్మణులు వనవాస సమయంలో 14 ఏళ్లపాటు పర్ణశాలలో నివసించిన విషయం తెలిసిందే.



మోదీని సన్మానిస్తున్న అమిత్ షా, నడ్డా

**ఎంపీలతో ప్రధాని వరుస సమావేశాలు**

బీజేపీ ఎంపీలతో మోదీ తన నివాసంలో ఈ వారం వరుస సమావేశాలు జరపనున్నారు. ఎంపీలను ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, యువత తదితర గ్రూపులుగా విభజించి వేర్వేరుగా మాట్లాడతారు. పార్లమెంట్‌తో వివిధ అంశాలపై ప్రధానితో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించడమే ఈ భేటీల ఉద్దేశం.

# జీడీపీనా? ఉద్యోగాలా?



- వృద్ధి కంటే ఉద్యోగాల కల్పనే ముఖ్యమంటున్న 31% మంది
- ఎకనామిక్స్ టైమ్స్ ముందస్తు బడ్జెట్ సర్వే

ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని ఐదేళ్లలో ఐదు ట్రిలియన్లకు చేర్చాలనేది ప్రధాని మోదీ కల. కానీ ఈ కల సాకారానికి ఎన్నో సవాళ్లు. ఇంకెన్నో సమస్యలు. కనుచూపు మేరలో పరిష్కారం కానరావడమే లేదు. ఆర్థిక వ్యవస్థ 20 త్రైమాసికాల కనిష్టానికి దిగజారింది. పెట్టుబడులు మందగించాయి. ఎకానమీలో కీలక సూచికలేవీ విశ్వాసం రేకెత్తించడం లేదు. ఉద్యోగాలు దొరకడం లేదు. వ్యవసాయ సంక్షోభం ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది. కానీ అత్యధిక భారతీయులకు ఇవి ప్రాధాన్యతాంశాలుగా కన్పించడం లేదని, రుణమాఫీ గురించి సానుభూతితో యోచించే పరిస్థితి లేదని ఎకనామిక్స్ టైమ్స్ ముందస్తు బడ్జెట్ సర్వే తేల్చింది.

సర్వేలో పాల్గొన్న వారిలో 35.4 శాతం మంది ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, వృద్ధి రేటు పెంచడమే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ముందున్న ప్రధాన కర్తవ్యమన్నారు. 31.5 శాతం మంది వృద్ధి కంటే ఉద్యోగాల కల్పనకే పెద్దపీట వేయాలన్నారు. 19.7 శాతం మంది ఆదాయం పన్ను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగ సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వారు కేవలం 13.4 శాతం మంది మాత్రమే.

**మద్దతు ధర పెంచాల్సిందే..**

కనీస మద్దతు ధర పెంచడమే వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమంటున్నారు 42.8 శాతం మంది. 29 శాతం మంది ఎకరానికి నిర్ణీత మొత్తం చొప్పున చెల్లింపులు జరపడం ఉత్తమమని భావిస్తున్నారు. రుణ మాఫీ వైపు మొగ్గు చూపుతున్న వారు 6.5 శాతం మంది మాత్రమే. 21.7 శాతం మంది ఉచిత విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించడంపై ఆర్థికమంత్రి దృష్టి పెట్టాలంటున్నారు.

**పన్నులు ఎలా?**

38 శాతం మందికిపైగా ప్రజలు ఆదాయం పన్ను బేసిక్ స్లాబ్‌ను ఐదు లక్షలకు పెంచాలని కోరుతున్నారు. 80(సీ) కింద పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలంటున్న వారు 19.9 శాతం మంది. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి ఏదో ఒక రూపంలో రివార్డులు ఇవ్వాలనే ఆలోచనను 33 శాతం మంది సమర్థిస్తున్నారు. మిగిలిన వారు ప్రస్తుత పన్ను శ్లాబులు బాగున్నాయని, మార్పులు చేయాల్సిన అవసరమే లేదని అభిప్రాయపడ్డారు.

**సంస్కరణలు అవసరమా?**

ప్రత్యక్ష పన్నుల విధానంలో మార్పులు చేయాలని 34 శాతం మంది కోరుతున్నారు. తక్షణమే ఈ మార్పులు అవసరమంటున్నారు. 25.7 శాతం మంది భూ సేకరణ చట్టంలో మార్పులు అవసరమని భావిస్తుండగా, 24.7శాతం మంది కార్మిక చట్టాలను సంస్కరించాలంటున్నారు. విద్యుత్ రంగ సంస్కరణల వైపు మొగ్గు చూపిన వారు 15.6శాతం మంది మాత్రమే.

**ఉద్యోగాలు ఎలా?**

ఉపాధి సంక్షోభాన్ని ఎలా పరిష్కరించాలి? ఈ ప్రశ్నకు విద్యా వ్యవస్థను ప్రక్షాళించడమే మార్గమని 40 శాతం మంది తమ అభిప్రాయాన్ని చెప్పారు. 21.9 శాతం మంది కార్మిక సంస్కరణలతో సమస్యను పరిష్కరించవచ్చునన్నారు. పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేవారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం (27.5 శాతం మంది) 'ముద్ర'తరహా పథకాలు మరిన్ని అమలు చేయడం (10.6 శాతం) ద్వారా ఉద్యోగాలు కల్పించవచ్చునన్నారు కొందరు.

## కేటాయింపులు ఎలా?

బడ్జెట్ కేటాయింపుల్లో మౌలిక సదుపాయాల రంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని 36.4 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ రంగ కేటాయింపులకు పెద్ద పీట వేయాలంటున్నారు 29 శాతం మంది. మిగిలిన వారు నైపుణ్యాలు (18.7శాతం) పర్యావరణం (15.9శాతం) వైపు మొగ్గు చూపుతున్నారు. షేర్ల లాభాలపై విధిస్తున్న దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్నును రద్దు చేయడం ద్వారా మదుపర్లను ఆకట్టుకోవచ్చునని 27.4 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. అంకుర పరిశ్రమలకు విధించే ఏంజెల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలంటున్నారు 30 శాతం మంది.

సాక్షి

బుధవారం, జూలై, 3

# మళ్లీ అదే తీరు!

యథాప్రకారం ముంబై మళ్లీ కుంభవృష్టిలో చిక్కుకుంది. దశాబ్దకాలంలో కనీవినీ ఎరుగని స్థాయిలో పడిన భారీ వర్షంతో ఆ మహా నగరాన్ని వరద నీరు ముంచెత్తింది. 28మంది మృత్యువాత పడటం, రోడ్లపై గంటలతరబడి ట్రాఫిక్ స్తంభించిపోవడం, మెట్రో రైళ్ల దారంతా వరద నీటితో నిండటం, వందలాది విమానాలు రద్దు కావడం గమనిస్తే బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) గతానుభవాలనుంచి ఏమీ నేర్చుకోలేదని అర్థమవుతుంది. ఏటా వర్షాకాలంలో ముంబైకి ఈ వరదకష్టాలు తప్పడం లేదు. ముంబై నగరవీధుల నుంచి తాము తోడిపోసిన నీరు మూడు సరస్సుల నీటితో సమానమని అధికారులు చెబుతున్నారంటే ఆ నగరం ఎంత గడ్డు స్థితిలో ఉందో తెలుస్తుంది. జూన్ నెల మొత్తం కురవాల్సిన వర్షంలో 85 శాతం కేవలం నాలుగు రోజుల్లో పడిందని వాతావరణ విభాగం చెబుతోంది. భారీవర్షం పడినప్పుడు వరద నీరంతా పోవడానికి వీలుగా డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని బీఎంసీ ఏడాది క్రితం ప్రకటించింది. అందుకోసం దాదాపు రూ. 1,600 కోట్ల వ్యయం చేసింది. కానీ చివరికి ఫలితం మాత్రం ఎప్పటిలానే ఉంది.

ఒకపక్క చెన్నై మహానగరం గొంతెండి దాహార్తితో అలమటిస్తోంది. సరిగ్గా అదే సమయానికి పడమటి దిక్కునున్న ముంబై మహానగరం పీకల్లోతు వరదనీటిలో చిక్కుకుని బిక్కుబిక్కుమని కాలం గడుపుతోంది. ఈ రెండు సమస్యలకూ మూలం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల్లోనే ఉంది. నగరాల్లో ఆకాశహర్మ్యాలుంటాయి. వేలాదిమందికి ఉపాధి కల్పించే భారీ సంస్థలుంటాయి. విశాలమైన రోడ్లు, వాటిపై దూసుకుపోయే కార్లుంటాయి. ఇవి మాత్రమే నగరానికి ఆనవాళ్లని చాలా ప్రభుత్వాలు భావిస్తున్నాయి. కానీ అవి సురక్షితంగా ఉండాలంటే వాటికి సమీపంలో చెరువులు, సరస్సులుండాలి. కురిసే వర్షాన్నంతా అవి ఇముడ్చుకోగలగాలి. చెట్లు, తుప్పలు, గడ్డి వగైరాలు కనబడాలి. ఇవన్నీ నగర కాలుష్యాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. వాతావరణ సమతుల్యతను కాపాడతాయి. భూగర్భ జలవనరులను పెంచుతాయి. వీటన్నిటినీ ఒక ప్రణాళికాబద్ధంగా చేస్తే నగరాల్లో ఇంతచేటు వేసవి తాపం ఉండదు. అంతేకాదు, కురిసే నీరు నేలలోకి ఇంకేందుకు వీలుండాలి. కానీ నగరాలన్నీ సిమెంటు రోడ్లతో నిండిపోతున్నాయి. ఎక్కడికక్కడ భారీ భవనాలు నిర్మాణమవుతున్నాయి. వీటి సంగతలా ఉంచి ఉపాధి నిమిత్తం, చదువుల కోసం, ఇతరత్రా అవకాశాల కోసం జనమంతా నగరాలవైపు చూడక తప్పనిస్థితి కల్పించినప్పుడు వారికి అవసరమైన పౌర సదుపాయాలన్నీ అందుబాటులోకి తీసుకురావాలి. సురక్షితమైన మంచినీరు లభ్యమయ్యేలా చూడటం, మురుగునీటి వ్యవస్థ, చెత్త తొలగింపు ఈ సదుపాయాల్లో కీలకం. చెత్త తొలగింపు అనేది నగరాలను ఇప్పుడు పట్టిపీడిస్తున్న సమస్య. ప్రస్తుతం ముంబై వరదనీటిలో చిక్కుకోవడానికి ప్రధాన కారణం కూడా ఈ చెత్తేనని అధికారులు చెబుతున్నారు. జనం వాడి పారేసిన ప్లాస్టిక్ సీసాలు, సంచులు వగైరాలు డ్రైనేజీ వ్యవస్థకు పెద్ద అవరోధంగా నిలిచాయని వారు చెబుతున్న మాట. నగరాన్ని వరదలు ముంచెత్తడానికి కురిసిన వాన నీరంతా సక్రమంగా పోయే దోవ లేకపోవడమేనని ఇప్పుడు తెలుసుకోవడం వల్ల ప్రయోజనం లేదు. నగరంలో ప్లాస్టిక్ సంచులు, సీసాలు ఉత్పత్తిని, వినియోగాన్ని నిరోధించి వాటి స్థానంలో పర్యావరణహితమైన ఇతర ప్రత్యామ్నాయాలను ఇన్నేళ్లుగా అమల్లోకి ఎందుకు తీసుకురాలేకపోయారో పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. శివారు ప్రాంతాల్లో డంపింగ్ యార్డులు పెట్టి అక్కడ చెత్తను పారబోయడం పరిష్కారం కాదు. ఆ చెత్తను రీసైక్లింగ్ చేసుకుని, తిరిగి వినియోగించగలిగే వ్యవస్థలు రూపొందించాలి.

ముంబైలోని విరార్, జుహూ, మలాద్, గోరెగావ్, పోవై, అంధేరి, బొరివ్లీ, శాంతాక్రజ్, చెంబూర్, వొర్లి, పన్వేల్, థాణే వంటి ప్రాంతాలు నడుంలోతుకు మించిన వరదనీటితో విలవిల్లాడాయి. భారీ వర్షాలు ముంచెత్తిన ప్రతిసారీ ఈ ప్రాంతాల్లో ఇదే దుస్థితి. కాస్త ముందు చూపు ఉండి, ఏ ఏ ప్రాంతాలను తరచు వరద నీరు ముంచెత్తుతున్నదో గమనించి, ఆ నీరంతా పోవడానికి అనువైన కాల్వలను ఏర్పాటు చేస్తే సమస్య తలెత్తదు. కానీ ఆ పనులేవీ సక్రమంగా సాగటం లేదు. ముంబైలో కురిసిన వాన నీరంతా అటు సముద్రంలోగానీ, దానికి ఆనుకుని ఉన్న మహుల్, మహిం, థాణే కయ్యల్లోగానీ కలుస్తుంది. కొంత నీరు మిథి నదిలో కలుస్తుంది. మిథి తీరంలో అక్రమ కట్టడాలు పెరిగి, దాని దోవ కుంచించుకుపోవడంతో వరదనీరు పట్టాలపైకి చేరుతోంది. ఫలితంగా ప్రతిసారీ రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

వర్షాకాలంలో ఈ మహానగరం ఎందుకిలా తల్లడిల్లుతున్నదో ముంబై ఐఐటీ, గాంధీనగర్ ఐఐటీ బృందాలు అధ్యయనం చేశాయి. వివిధ రకాల చర్యలను సూచిస్తూ నివేదికలిచ్చాయి. కానీ వాటిని అమలు చేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వమూ, బీఎంసీ కూడా విఫలమయ్యాయి. నిజానికి రెవెన్యూపరంగా చూస్తే దేశంలోని మున్సిపల్ కార్పొరేషన్లన్నిటికంటే బీఎంసీ రాబడే అధికం. కానీ సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించుకుని నగరాన్ని తీర్చిదిద్దడంలో ఆ సంస్థ పదే పదే విఫలమవుతోంది. మన పొరుగునున్న చైనాలో నగరాలు ఇలా తరచు వరదల వాతబడుతున్న తీరుచూసి ఆ దేశాధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2013లో ఒక ప్రణాళిక ప్రకటించారు. చుక్క నీరు కూడా వృథా కాని రీతిలో కురిసిన వర్షం నీటినంతటినీ ఒడిసిపట్టాలని, అదంతా ఇముడ్చుకోవడానికి అనువైన సరస్సులు, చెరువులు నగరాల వెలుపల ఉండాలని, మురుగునీరు పునర్వినియోగానికి అవసరమైన సహజ విధానాలు అమలుకావాలని ఆదేశించారు. అయిదారేళ్లు గడిచాక చూస్తే ఆ నగరాలు అన్నివిధాలా మెరుగ్గా మారాయి. సంకల్పం ఉంటే సాధించలేనిదంటూ ఉండదు. అది కొరవడటం వల్లే మన దేశంలో ముంబైకి, చెన్నైకి, అనేక ఇతర నగరాలకూ తరచుగా ఈ ఈతిబాధలు!

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢమాసం, తిథి శు.పాడ్యమి రా.11.19 వరకు, తదుపరి విదియ, నక్షత్రం ఆరుద్ర ఉ.7.50 వరకు, తదుపరి పునర్వసు వర్జ్యం రా.7.20 నుంచి 8.50 వరకు, దుర్ముహూర్తం ప.11.36 నుంచి 12.28 వరకు, అమృతఘడియలు... తె.4.32 నుంచి 5.46 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 5.33
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# బడ్జెట్‌లో వ్యవసాయం వాటా ఎంత?

విశ్లేషణ



దేవిందర్‌శర్మ

**దేశంలోని ఏదో ఒక ప్రాంతం నుంచి వ్యవసాయదారుల ఆత్మహత్యలు నమోదు కాని రోజంటూ లేదు. దేశంలోని ప్రతి వ్యవసాయ కుటుంబానికి నెలకు కనీసం రూ. 18,000ల ఆదాయం తప్పనిసరిగా అందించేలా రైతులు ఆదాయం – సంక్షేమం కోసం జాతీయ కమిషన్‌ను ఏర్పర్చే విషయంలో కేంద్రప్రభుత్వం తీసుకురావలసిన అత్యంత మౌలిక సంస్కరణ కోసం దేశం ఎదురుచూస్తోంది. వ్యవసాయ పంటల సాగు కాలంలో రైతులు ఎదుర్కొంటున్న అడ్డంకులు, అవరోధాలను తొలగించడానికి వ్యవసాయాన్ని కూడా సులభతరంగా చేసే విధానాలను కేంద్రం అమలులోకి తీసుకురావలసిన అవసరం ఎంతగానో ఉంది. పంటలకు కనీస మద్దతు, రైతుకు కనీస ఆదాయ కల్పనలో మౌలిక సంస్కరణ తీసుకురావడం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పెనుసవాల్ కానుంది.**

దేశ భూభాగంలో దాదాపు 50 శాతం వరకు ప్రస్తుతం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితుల్లో చిక్కుకుపోవడం చూస్తున్నాం. గత వందేళ్లలో అయిదో అత్యంత అధిక ఉష్ణోగ్రత నమోదైన నెలగా ఈ జూన్ మాసం రికార్డుకెక్కింది. దానికితోడుగా గత ఏడు సంవత్సరాల్లో వ్యవసాయరంగ వాస్తవ రాబడుల్లో వృద్ధి దాదాపుగా జీరోకి సమీపంలో ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ జూలై 5న తన తొలి బడ్జెట్ సమర్పించనున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కఠినతరమైన లక్ష్యాన్ని ఎదుర్కోబోతున్నారు. మరోవైపున వ్యవసాయదారుల ఆశలు, అంచనాలు తారస్థాయిలో ఉంటున్నాయి.

దేశ వ్యవసాయ రంగంలో మౌలిక సంస్కరణలు తప్పనిసరి అనే విషయాన్ని ఎవరూ తోసిపుచ్చలేని వాస్తవమే కానీ కేంద్రంలోని నూతన ప్రభుత్వానికి అంతకుమించిన పెద్ద సవాలు ఏదంటే వ్యవసాయరంగంలో వాస్తవ రాబడులను పెంచడం ఎలా అన్నదే. ఎకనమిక్ సర్వే 2016 అంచనా ప్రకారం దేశంలోని 17 రాష్ట్రాల్లో వ్యవసాయరంగ ఆదాయం సగటున సంవత్సరానికి రూ. 20,000 మాత్రమే. ఓఈసీడీ–ఐసీఆర్ఐఈఆర్ నిర్వహించిన కీలకమైన అధ్యయనం ప్రకారం 2007–2017 మధ్యకాలంలో రైతులకు న్యాయమైన ధరలను తృణీకరించిన కారణంగా వారు నష్టపోయిన మొత్తం రూ. 45 లక్షల కోట్లుగా తేలింది. ఇది చాలదన్నట్లుగా, గత పదిహేను సంవత్సరాల్లో వ్యవసాయరంగ రాబడులు అత్యంత కనిష్టస్థాయికి పడిపోయినట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. దీనిఫలితంగా గ్రామీణ వ్యవసాయరంగంలో ఉపాధి కల్పన భారీ స్థాయిలో క్షీణించిపోయింది. ఇక వ్యవసాయేతర శ్రామికుల విషయం చెప్పనక్కరలేదు.

భారీ దిగుబడులను పండించడానికి దేశీయ రైతాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. కానీ ప్రతి సంవత్సరం, వ్యవసాయదారుల పరిస్థితి మరింత దిగజారిపోతూ వస్తోంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని కనిష్టంగా ఉంచడం, పరిశ్రమకు ముడిసరుకును తక్కువ ధరలకు అందించడం, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను నెరవేర్చాల్సి రావడం వంటి లక్ష్యాల సాధనకోసం తీసుకొచ్చిన సూక్ష్మ ఆర్థిక విధానాలకు మన వ్యవసాయరంగం నిజంగానే బలవుతోంది. వాణిజ్యరంగ నిబంధనలు తొలి నుంచీ వ్యవసాయరంగానికి వ్యతిరేకంగానే ఉంటున్నాయి. దీనికితోడుగా 2011–12, 2016–17 మధ్యకాలంలో ప్రభుత్వ రంగ పెట్టుబడులు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 0.4 శాతానికి పడిపోయాయి. వ్యవసాయరంగాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పడానికి ఇది చాలు.

దేశంలోని ఏదో ఒక ప్రాంతం నుంచి వ్యవసాయదారుల ఆత్మహత్యలు నమోదు కాని రోజంటూ లేదు. ఉదాహరణకు పంజాబ్‌ను తీసుకుందాం. 2018 సంవత్సరం జనవరిలో ప్రతిరైతుకూ 2 లక్షల రూపాయల రుణ మాఫీని ప్రకటించిన తర్వాత కూడా ఆ సంవత్సరం మొత్తంలో 430 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని భారతీయ కిసాన్ యూనియన్ అంచనా వేసింది. 2000–2017 మధ్యకాలంలో మూడు ప్రభుత్వ రంగ యూనివర్సిటీలు ఇల్లిల్లూ తిరిగి చేసిన సర్వే ప్రకారం 16,600 మంది రైతులు ఆత్మహత్యల బారిన పడినట్లు తేలింది. దేశంలోని అత్యంత కీలకమైన వ్యవసాయ రాష్ట్రంలోనే రైతుల దుస్థితి ఈ స్థాయిలో ఉండగా మిగతా దేశంలో వ్యవసాయ రంగం ఎంతగా కునారిల్లిపోతోందో సులభంగా అర్థం చేసుకోవచ్చు.



అత్యంత లోపభూయిష్టమైన ఆర్థిక విధానాల రూపకల్పన కారణంగానే రైతులు బాధితులుగా మిగిలిపోతున్నారు. రైతులకు న్యాయమైన ఆదాయాన్ని తిరస్కరించిన కారణంగానే దేశవ్యాప్తంగా వ్యవసాయ సంక్షోభం ఏర్పడిందని గ్లోబల్ అనలిటికల్ కంపెనీ క్రిసిల్ (సీఆర్ఐఎస్ఐఎల్) తేల్చి చెప్పింది. వ్యవసాయ పంటలకు కనిష్ట మద్దతు ధర 2009–2013 మధ్య 19.3 శాతం మేరకు ఉండగా, తదుపరి నాలుగేళ్ల కాలంలో ఇది 3.6 శాతానికి క్షీణించిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా ఇస్తున్న డీఏ (డియర్నెస్ అలవెన్స్) స్థాయిలో కూడా రైతు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వడం లేదు. 1970లో స్కూల్ టీచర్లకు నెలకు రూ. 90ల వేతనం ఉండగా 2015 నాటికి వారి వేతనం 170 రెట్లకు పెరిగింది. అదే కాలంలో ప్రభుత్వోద్యోగుల వేతనం 150 రెట్లు పెరిగింది. దీనికి భిన్నంగా దేశీయ రైతులు పండించిన గోధుమ పంట ధర 19 రెట్లు మాత్రమే పెరిగింది. వ్యవసాయ రంగంలో మౌలిక సంస్కరణలు ఎంత అవసరమో దీన్ని బట్టే తెలుస్తోంది.

2019 ఫిబ్రవరిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎమ్– కిసాన్) ప్రారంభమైంది. ఈ పథకంలో భాగంగా దేశంలో భూమి ఉన్న రైతులందరికీ సంవత్సరానికి రూ. 6,000ల ప్రత్యక్ష నగదు మద్దతును ఇస్తున్నట్లు ప్రకటించారు. అంటే నెలకు రూ.500లు అన్న మాట. వ్యవసాయాన్ని పునరుద్ధరించడానికి కేంద్రప్రభుత్వం నడుంకట్టినట్లు ఇది సూచిస్తోంది. పైగా దేశ చరిత్రలో రైతుకు తొలిసారిగా ప్రత్యక్ష నగదు సహాయం అందించడానికి కేంద్రప్రభుత్వం సంసిద్ధత చూపుతుండటానికి ఇది స్పష్టమైన సంకేతం కూడా. ఈ విశిష్ట పథకాన్ని ఇప్పుడు 14.5 కోట్లమంది భూమి ఉన్న రైతులకు విస్తరించారు. దీన్ని దేశంలోని 14.4 కోట్లమంది భూమిలేని రైతులకు కూడా విస్తరింపజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పటికే ఈ పథకం అమలుకు గాను బడ్జెట్‌లో రూ. 87,000 కోట్లను కేటాయిస్తూ ప్రతిపాదన చేశారు కూడా. దీనికి 14.4 కోట్ల భూమిలేని రైతులను కూడా జతచేస్తే బడ్జెట్‌లో రైతులకు ప్రత్యక్ష నగదు సహాయ పథకం కోసం దాదాపు రూ.1.6 లక్షల కోట్లు కేటాయించినట్లు అవుతుంది. ఇంత పెద్ద మొత్తం కేటాయింపునకు అవసరమైన డబ్బు ఎక్కడనుంచి వస్తుంది అనేది ప్రశ్న. దీనికి ఒకటే సమాధానం. 2008–09 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం నాటినుంచి పారిశ్రామిక రంగానికి మద్దతుగా అమలులోకి తీసుకువచ్చిన రూ. 1.86 కోట్ల వార్షిక ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీని తక్షణం రద్దు చేయడమే ఆర్థికమంత్రికి అందుబాటులో ఉన్న సులభమైన మార్గం. ఈ ప్యాకేజీకి ఎలాంటి ఆర్థిక సమర్థన ఇప్పుడు లేదు. గత పది సంవత్సరాలుగా ఈ ఉద్దీపన ప్యాకేజీని మన పారిశ్రామిక రంగానికి అందజేస్తూనే ఉన్నారు.

2018–19లో వ్యవసాయరంగానికి రూ.11.68 లక్షల కోట్ల రుణాన్ని విస్తరించారు. బడ్జెట్‌లో దీన్ని రూ.12 లక్షల కోట్లకు సవరించే అవకాశం కూడా ఉంది. అయితే అతిపెద్ద సవాలు ఏమిటంటే, వ్యవసాయ రుణం సన్నకారు, చిన్నకారు రైతుల వరకు చేరడం ఎలా అన్నదే. దేశంలో సంస్థాగత రుణాలకు 15 శాతం కంటే తక్కువ మంది చిన్నకారు రైతులే పొందగలుగుతున్నారని ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ తాజాగా అంచనా వేసింది. రైతుల ఆత్మహత్యలను రైతు రుణమాఫీలు అరికట్టలేకపోవడానికి ఇదే ప్రధాన కారణం. కాబట్టే సంస్థాగత రుణాల పరిధిలోకి మరింతమంది రైతులను తీసుకురావడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాల్లో ఒకటిగా ఉండాలి.

పైగా, దేశంలోని ప్రతి వ్యవసాయ కుటుంబానికి నెలకు కనీసం రూ. 18,000ల ఆదాయం తప్పనిసరిగా అందించేలా రైతులు ఆదాయం –సంక్షేమం కోసం జాతీయ కమిషన్‌ను ఏర్పర్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురావలసిన అత్యంత మౌలిక సంస్కరణ కోసం దేశం ఎదురుచూస్తోంది. దీనికోసం ప్రతి జిల్లాలోనూ రైతుల సగటు ఆదాయాన్ని పెంపొందించేందుకు తగిన మార్గాన్ని ఏర్పర్చవలసి ఉంది. దీనికి అవసరమైన డేటా కూడా ఇప్పుడు అందుబాటులో ఉంటోంది.

వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎమ్‌సీ) క్రమబద్ధీకరణ మార్కెట్ల యంత్రాంగాన్ని విస్తరించడం తక్షణ కర్తవ్యంగా ఉండాలి. ప్రతి 5 కిలోమీటర్లకు ప్రస్తుతం ఉన్న 7,000 మండీలను 42,000కు పెంచడానికి ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉంది. దీంతోపాటు దేశవ్యాప్తంగా ధాన్యాగారాలను, గోడౌన్లను ఏర్పర్చడంపై బడ్జెట్ విధి విధానాలను రూపొందించాలి. వచ్చే అయిదేళ్ల కాలానికి గానూ దేశీయ వ్యవసాయ రంగంలో 25 లక్షల కోట్ల రూపాయలను అందిస్తామని భారతీయ జనతా పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చి ఉన్న విషయం తెలిసిందే. ఈ హామీ అమలు కోసం ప్రారంభ దిశగా ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా మండీలు, గోడౌన్ల ఏర్పాటు కోసం కనీసం రూ. 5 లక్షల కోట్లను మదుపు చేయాల్సి ఉంది.

అయితే దీనికంటే మిన్నగా, రైతులు ప్రభుత్వ పాలనకు సంబంధించిన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలకోసం సులభతరమైన వాణిజ్యవిధానాన్ని ప్రోత్సహించినట్లుగానే, వ్యవసాయ పంటల సాగు కాలంలో రైతులు ఎదుర్కొంటున్న అడ్డంకులు, అవరోధాలను తొలగించడానికి వ్యవసాయాన్ని కూడా సులభతరంగా చేసే విధానాలను కేంద్రం అమలులోకి తీసుకురావలసిన అవసరం ఎంతగానో ఉంది. గతంలో వాణిజ్యమంత్రిగా సులభతరమైన వాణిజ్య విధానం కోసం దాదాపు 7,000 చర్యలను తీసుకున్న అనుభవం ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ఉంది కాబట్టి వ్యవసాయ రంగానికి కూడా ఇలాంటి విధానాన్నే అమలు చేయడం ఆమెకు సులభమైన పనే. అయితే వ్యవసాయరంగంలో సులభతర విధానం అమలుకోసం కనీసం 5,000 చర్యలను అందించే యంత్రాంగం స్థాపనకోసం ఆమె ఇంకా ఎందుకు నడుం కట్టలేదన్నదే నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఉద్రిక్తత



"ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో గల ఆలయంపై దాడి తీవ్రంగా ఖండించదగినది. వెంటనే దోషులను పోలీసులు అరెస్ట్ చేయాలి. మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం ముఖ్యం. అయితే, అందుకు మీడియాకు నిబంధనలు విధించడం సరికాదు. దుండగులు, బాధితులు ఎవరనే విషయంతో సంబంధం లేకుండా మీడియా ఎప్పుడూ సమాచారం అందిస్తూంటుంది"

– బైజయంత్ జై పండా, బీజేపీ నేత

### రేప్



"హిందువులంతా గుంపుగా ముస్లింల ఇళ్లపై దాడిచేసి మహిళలపై సామూహిక అత్యాచారాలు చేయాలంటూ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకురాలిని పదవి నుంచి తొలగించారని తెలిసి ఆశ్చర్యపోయా. ఇటువంటి సందర్భాల్లో బీజేపీ సహజంగా అటువంటివారికి పార్లమెంట్‌లో స్థానం కల్పించడం ద్వారా, ఏదో ఒక రాష్ట్రానికి చెందిన పెద్ద పదవి కట్టబెట్టడం ద్వారానో శిక్షిస్తుందని అనుకున్నా"

– ఆతిష్ తసీర్, జర్నలిస్ట్

### స్పిరిట్



"స్పిరిట్' ఆఫ్ ముంబైకి నేను ఏ మాత్రం వ్యతిరేకం కాదు. కానీ, మహారాష్ట్ర భారీ ఎక్సైజ్ ధరల కారణంగా నేను నా 'స్పిరిట్'ను ఢిల్లీలోనే కొనుగోలు చేయడానికి ప్రాధాన్యతనిస్తా. 'స్పిరిట్'పై గౌరవ్ కపూర్ చాలా జోక్స్ చెబుతాడు. ఈ విషయంలో గౌరవే మా స్పిరిచ్యువల్ గురువు"

– జోయ్ భట్టాచార్య
క్రీడా నిపుణుడు

### బీజేపీ నేత



"రాజ్యసభలో బిల్లులు ప్రవేశపెట్టే సందర్భంలో భారతీయ జనతా పార్టీ అధినేత, హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగాన్ని అందరూ వినాలి. ఆ ప్రసంగం ఆయన వాదనా పటిమకు నిదర్శనం. ఏదో పైపైన కాకుండా, ఒక బీజేపీ మంత్రి బీజేపీ నేతలా మాట్లాడటం నేను చాలా రోజుల తర్వాత విన్నా"

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

### గౌరవం



"ప్రముఖ రచయిత, దర్శకురాలైన నా కుమార్తె జోయా అక్తర్‌ను ఆస్కార్ అకాడమీ సభ్యురాలిగా ఆహ్వానించినందుకు సాటి భారతీయులుగా మీరంతా గర్విస్తారని, సంతోషిస్తారని భావిస్తున్నా. ఆస్కార్ అకాడమీ ఆహ్వానం అనేది చాలా అరుదైన గౌరవం. జోయాతో పాటు అనుపమ్‌ఖేర్, అనురాగ్ కశ్యప్‌లను కూడా అకాడమీ ఆహ్వానించింది"

– జావేద్ అక్తర్, గీత రచయిత

# గీతన్నల రాత మారేదెన్నడు?

లక్షలాది మంది గీత కార్మికులు తమ వృత్తిలో స్వయం ఉపాధి కల్పించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ విధానాల వలన బహుళజాతి కంపెనీల లిక్కర్, ఇతర శీతల పానీయాల ఉత్పత్తుల ధాటికి తట్టుకోలేక కల్లు అమ్మకాలు పడిపోయాయి. ఫలితంగా వృత్తిలో ఉపాధి దొరకక బతుకుదెరువు కోసం ఇతర పనులు వెతుక్కుంటూ పట్టణాలకు వలస బాట పడుతున్నారు. మరో ప్రక్క వృత్తిలో ప్రమాదాలు జరిగి వేలాది మంది వికలాంగులు అవుతున్నారు. క్రమంగా వృత్తి చేసే కార్మికులు తగ్గుతున్నారు. కొత్త తరం ఈ వృత్తిపై ఆసక్తి కనబర్చడం లేదు.

ప్రభుత్వం ఆసరా పెన్షన్లు, ఎక్స్‌గ్రేషియోతో సరిపెట్టకుండా గీత కార్మికులకు వృత్తిలో ఉపాధి కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో కోటి తాటి, ఈత చెట్లు ఉన్నాయి. 4,366 గీతకార్మిక సహకార సంఘాలు (టీటీసీఎస్), 3,709 వ్యక్తిగత లైసెన్సు (టీఎఫ్‌టీ)ల ద్వారా 2,18,107 మంది సభ్యత్వం కలిగి వృత్తి చేస్తున్నారు. సభ్యత్వం లేకుండా కూడా వృత్తిపని చేసేవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. గీచేపని పురుషులు చేస్తే, అమ్మకంలో స్త్రీలు ఉంటున్నారు. వీరికి సభ్యత్వం లేనప్పటికీ వృత్తిలో భాగస్వాములుగా ఉన్నారు. వీరితోపాటు వృత్తిలో పరికరాలు తయారుచేసే కుమ్మరి, కమ్మరి, చర్మకారులు ఆధారపడి జీవిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. ఇవి ఉపశమనమే తప్ప ఉపాధి కాదు. కార్పొరేషన్ ఉన్నప్పటికీ దానికి బడ్జెట్ కేటాయింపులు లేవు. నామినేటెడ్ బాడీ కూడా వేయలేదు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మద్యం పాలసీ ప్రభుత్వానికి ఆదాయం పెంచుకునే విధంగా ఉంది. లిక్కర్ తయారీదారులకు, లిక్కర్ షాపుల యజమానులకు కూడా లక్షలాది రూపాయల ఆదాయం వస్తుంది. ఇదొక పెద్ద వ్యాపారం. కానీ కల్లుగీత ఒక వృత్తి మాత్రమే, వ్యాపారం కాదు. తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం గీతకార్మికులు ఈ వృత్తిని కొనసాగించక తప్పడం లేదు.

ప్రాణాలకు ప్రమాదమని తెలిసి కూడా ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. వీరికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉన్నది. కల్లులో అనేక పోషకాలు ఉన్నాయని, క్యాన్సర్‌లాంటి రోగాలు రాకుండా నివారించవచ్చని, కిడ్నీలో రాళ్లను తొలగిస్తుందని జాతీయ పోషకాహార సంస్థ తెలిపింది. దీనికి ప్రభుత్వమే ప్రచారం నిర్వహించడంవల్ల కల్లుకు మార్కెట్ పెరుగుతుంది.

యం.వి. రమణ, ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం
మొబైల్ : 94900 98485

# 'పోడు' సమస్య ఇంకెన్నాళ్లు?

కొమురం భీం అసిఫాబాద్ జిల్లాలో ఆదివారం అటవీ అధికారులపై స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు కృష్ణ తన మనుషులతో సాగించిన దాడిలో ఎఫ్ఆర్ఓ అనిత తీవ్రంగా గాయపడటం పోడు భూముల సమస్యను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాల శివారులోని 20 హెక్టార్ల భూమి విషయంలో కొంతకాలంగా స్థానిక రైతులకు, అటవీ అధికారులకు మధ్య వివాదం సాగుతోంది. తాము సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఆ భూములను ఖాళీచేయాలని అటవీశాఖ ఒత్తిడి చేస్తోంది. పోడు భూములంటే అటవీశాఖ స్వాధీనం చేసుకోదగిన భూములుగా, ప్రజలకు ఏ హక్కు లేని భూములుగా ప్రభుత్వం భావించాల్సిన అవసరం లేదు. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పోడు భూములపై ఆదివాసీలకు హక్కు లేకుండా అటవీ హక్కుల చట్టం 2006 పేరుతో ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. భూములు హరితహారాలుగా మారుతాయేమో కాని పోడు చేసుకుంటున్న జీవితాలకు ఆధారం పోతుందని, వారికి తామే ప్రత్యామ్నాయం చూపెట్టవలసిన బాధ్యత ఉందని ప్రభుత్వం గుర్తించటం లేదు. అటవీభూమిపై ఆదివాసీలకు హక్కు ఉంటుందని 1997లో సుప్రీం కోర్టు తీర్పు స్పష్టం చేసింది. కానీ ఆదివాసీల భూములను పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలనే ప్రభుత్వ విధానం వల్ల ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారు. నెలరోజుల క్రితం ఇదే జిల్లాలో కొలాం గోంది గ్రామ ఆదివాసీలపై పోలీసుల అండదండలతో అటవీశాఖ సిబ్బంది అమానుషంగా ప్రవర్తించారు. అప్పుడు ఎవరూ ఆదివాసీలను రక్షించడానికి రాలేదు. అదే సిబ్బందిపై సార్సాలలో దాడిచేస్తే దానికి నాయకత్వం వహించింది అధికారపక్ష ప్రజాప్రతినిధి కనుక పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు. ప్రభుత్వాల 'చట్టబద్ధ పాలన'లో అధికారుల పాత్ర ఎలా ఉందో దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రజాప్రతినిధులు తమను దుర్భాషలాడినా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉండిపోవడం ఇది మొదటిసారి కాదు. గతంలో టీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, దానం నాగేందర్‌లు కూడా ఇలాగే వ్యవహరించారు. స్థానిక ఎస్ఐ మొదలుకొని జిల్లా ఎస్పీ వరకూ అందరి బదిలీలనూ ప్రజాప్రతినిధులే నిర్దేశిస్తున్నారు. కనుకనే వారిని ప్రశ్నించడం, ఎదిరించడం అధికారులకు సాధ్యం కావడం లేదు. ఏం జరిగినా వారు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. సార్సాల దాడిని ఈ నేపథ్యంలోనే చూడాలి.

సార్సాల ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ మొదలుకొని అందరూ స్పందించారు. ఖండించారు. కానీ కొలాంగోంది ఆదివాసీ గ్రామాన్ని టైగర్ ప్రాజెక్టు పేరుతో అటవీ శాఖ సిబ్బంది దగ్గరుండి ఖాళీ చేయించినప్పుడు ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదు? ఒక ఆదివాసీ గ్రామాన్ని ధ్వంసం చేస్తుంటే వీరెవరికీ పట్టదా? ఆ గ్రామం 40 ఏళ్ల నుంచి అక్కడ ఉంది. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఈ గ్రామాన్ని కుట్రపూరితంగా టైగర్ ప్రాజెక్టులో విలీనం చేయించారు. తమ రేషన్ కార్డులతోసహా అన్ని పత్రాలూ ఆయన దగ్గరే పెట్టుకున్నారని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. కానీ ఎలాంటి పత్రాలూ లేవనే సాకుతో అటవీ శాఖ ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా బయటకు వెళ్లగొట్టింది. అంతేగాక ఆ సమస్య గురించి న్యాయస్థానానికి తప్పుడు నివేదిక ఇచ్చింది. ఇది నేరం కాదా?

ఈ జిల్లా పరిధిలోని పలు గ్రామాల్లో గిరిజనేతరుల ఆధిపత్యం అమలవుతోంది. అక్కడ 1/70 చట్టం ఉన్నా ఈ కబ్జాలు ఆగడం లేదు. గిరిజనులకు దక్కాల్సిన ఎన్నో సారవంతమైన భూములు గిరిజనేతరుల వద్ద ఉన్నాయి. తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం కోనేరు సోదరులు వీటిని ప్రోత్సహిస్తున్నారు. కొలాంగోంది గ్రామాన్ని ధ్వంసం చేయడంలోనైనా, మొన్న అటవీ సిబ్బందిపై దాడి వెనకైనా ఈ కబ్జాల బాగోతమే ఉంది. కొలాంగోంది గ్రామానికి తిరిగి వెళ్లాలని ఆదివాసీలు ప్రయత్నిస్తున్నా అటవీశాఖ అనేక ఆటంకాలు కల్పిస్తోంది. ఇప్పటికీ ఆ జిల్లాలోని పలు గ్రామాలపై అటవీ సిబ్బంది దాడులు చేస్తున్నారు. వీటన్నిటినీ ఆపాలని పౌరహక్కుల సంఘం కోరుతోంది. కొలాంగోంది గ్రామస్తులపై అటవీ సిబ్బంది జరిపిన దాడినైనా, అటవీ సిబ్బందిపై కోనేరు కృష్ణ నేతృత్వంలో సాగిన దాడినైనా పౌరహక్కుల సంఘం ఖండిస్తోంది. ఈ రెండు రకాల దాడుల వెనకా కబ్జాలే ఉన్నాయి. కబ్జారాయుళ్లను నిరోధించి ఆదివాసీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. అదే సమయంలో అటు ఆదివాసీలపైన, ఇటు అటవీ సిబ్బందిపైన దాడులు జరగకుండా నియంత్రించవలసిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉంది. పోడు భూములపై ఆదివాసీలకు హక్కులు కల్పించి, వారిపై అటవీ సిబ్బంది జులుం చేయకుండా తగిన ఆదేశాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

ఎన్. నారాయణరావు, ప్రధాన కార్యదర్శి,
పౌర హక్కుల సంఘం, తెలంగాణ
మొబైల్ : 98667 34867

# నవ్వుతూ పక్కకు తప్పుకోవాలి

ఓరోజు బలరామకృష్ణులు, అర్జునుడు కలిసి ఓ అడవి గుండా వెళ్తున్నారు. అప్పటికి చీకటిపడటంతో ఆ ముగ్గురూ ఓ చోట విశ్రమించి, మరుసటి రోజు పొద్దున్నే ముందుకు సాగాలనుకున్నారు. అడవిలో క్రూరమృగాలు ఉండటం వల్ల ముగ్గురూ ఒకేసారి పడుకోకూడదని, ఒకరి తర్వాత మరొకరు పడుకోవాలని అనుకున్నారు. మొదట అర్జునుడు కాపలా ఉండగా, బలరామకృష్ణులు పడుకున్నారు. అప్పుడు ఉన్నట్లుండి దట్టమైన పొగ కమ్ముకుంది. ఆ పొగ నుంచి ఓ భీకర రూపం బయటకు వచ్చింది. పెద్ద నాలుక, కత్తుల్లాంటి దంతాలు, పెద్ద పెద్ద కళ్ళు కలిగిన ఆ రూపం బలరామకష్ణుల వద్దకు వెళ్ళింది. అది చూసి అర్జునుడు కోపావేశంతో ఆ రూపాన్ని అడ్డుకున్నాడు. అప్పుడు ఆ భీకర రూపం వారిద్దరినీ హతమారుస్తానని చెప్పింది. అందుకు నువ్వు సాయం చేయాలంది. ఆ మాటలకు అర్జునుడు కోపంతో ఊగిపోయాడు.

అర్జునుడి కోపం పెరిగే కొద్దీ ఆ భీకర రూపం బలమూ పెరుగుతూ వచ్చింది. అర్జునుడు దాంతో పోరుకు తలపడ్డాడు. అయితే అది అర్జునుడిపై ప్రతి దాడి చేసి అదృశ్యమైంది. తర్వాత బలరాముడు కాపలా ఉన్నాడు. అప్పుడు మళ్ళీ ఆ భీకర రూపం వచ్చింది. అర్జునుడితో చెప్పినట్లే బలరాముడితోనూ చెప్పింది. దాంతో బలరాముడు కూడా దాంతో గొడవపడ్డాడు. అర్జునుడిని దెబ్బతీసినట్టే ఆ భీకర రూపం బలరాముడినీ దెబ్బతీసి అదృశ్యమైంది. అనంతరం కృష్ణుడి వంతు. అతను లేచి కాపలా ఉండగా బలరాముడు, అర్జునుడు పడుకున్నారు.మళ్ళీ భీకర రూపం ప్రత్యక్షమైంది. అది చూసి కృష్ణుడు పెద్దగా నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నావు అని ఆ భీకర రూపం అడిగింది.



జ్యోతిర్మయం

ఏముందీ నీ ఎత్తు పళ్ళు, వికారమైన నీ కళ్ళు చూస్తే నాకు నవ్వొస్తోంది అని చెప్పాడు కృష్ణుడు. దాంతో ఆ భీకరరూపం కృష్ణుడితో గొడవకు దిగింది. అయినప్పటికీ కృష్ణుడు నవ్వులో ఎలాంటి మార్పూ లేదు. కృష్ణుడు నవ్వే కొద్దీ ఆ భీకర రూపం బలం తగ్గుతూ వచ్చింది. చివరికి అది ఓ చిన్న పురుగులా మారి నేలపై పాకింది. కృష్ణుడు ఆ పురుగుని తీసి ఓ గుడ్డలో ఉంచాడు. తెల్లవారింది. బలరాముడు, అర్జునుడు నిద్ర లేచారు. అప్పుడు కృష్ణుడు తన దగ్గరున్న గుడ్డలోని పురుగును చూపించి మీరు నిన్న రాత్రి కాపలా ఉండి పోరాడింది దీంతోనే అని చెప్పాడు. మీరిద్దరూ దాంతో గొడవపడ్డప్పుడు మీ కోపం పెరుగుతున్న కొద్దీ దాని బలమూ పెరుగుతూ వచ్చింది. కానీ నేను నవ్వుతూ దానితో తలపడ్డాను. దాంతో దాని బలం తగ్గుతూ వచ్చి చివరికి ఇలా పురుగులా మారింది. కావాలని కయ్యానికి కాలుదువ్వే వారిని పట్టించుకోకుండా ఓ నవ్వు నవ్వి పక్కకు తప్పుకుంటే అతను పురుగుతో సమానమైపోతాడని చెప్పాడు కృష్ణుడు.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
3-7-2019

ఊపిరి ఉండేదే ఆకాశంలో.
అవును. అంత తేలిగ్గా ఉంటుంది మరి.
మనం పిచ్చివాళ్లం.
ఊపిరి మనది అనుకుంటాం.
నలుగురికి ప్రాణం పోసేదే ఊపిరి.
జీవం ఇచ్చేదే ఊపిరి. ధైర్యం చూపేదే ఊపిరి.
ఆయేషాకు పందొమ్మిదేళ్లు.
ఊపిరి ఆగిపోయింది.
మనందరికీ ఊపిరిగా మిగిలిపోయింది.

ఎడిటర్, ఫీచర్స్

# ఆకాశానికే ఊపిరి పోసింది



'మై లిటిల్ ఎపిఫనీస్' పుస్తకంపై పుస్తక రచయిత్రి ఐషా చౌదరి

ది స్కై ఈజ్ పింక్. అక్టోబర్ 11న రిలీజ్ కావలసిన బాలీవుడ్ పిక్చర్. ఏమిటిప్పుడు! రిలీజ్ అవడం లేదా? అవుతోంది. ప్రోమోషన్ టూర్‌లకు కూడా నిర్మాతలు రెడీ అవుతున్నారు. ఒక్కరు మాత్రం 'సారీ.. అయామ్ నాట్ అవైలబుల్' అన్నారు. ఆ మాట అన్నది జైరా వసీమ్! సినిమాలో మెయిన్ క్యారెక్టర్ తనదే. చిన్నమ్మాయి కనుక నిర్మాతలు పెద్ద మనసుతో అర్థం చేసుకున్నారు. 'ఇట్సాల్ రైట్' అని చిరునవ్వు నవ్వారు. అసలు ఈ చిన్నమ్మాయి (19) జూన్ 29నే ఒక పెద్ద ప్రకటన చేశారు. ఇక మీదట తను సినిమాల్లో నటించబోవడం లేదని! కారణం కూడా చెప్పారు. మతవిశ్వాసాలకు లోబడి ఉండబోతున్నానని. అలా అని సోషల్ మీడియాలో పెద్ద పోస్టే పెట్టారు. అభినందించినవారు అభినందించారు. విమర్శించినవారు విమర్శించారు. అన్నిట్లోకీ పెద్ద అభినందన ఒమర్ అబ్దుల్లా పెట్టిన ట్వీట్. 'తనకు ఏది హ్యాపీగా అనిపిస్తే అదే చెయ్యనివ్వండి. మనమెవరం మధ్యలో మాట్లాడేందుకు!' అన్నారు అబ్దుల్లా. జమ్మూకశ్మీర్ లీడర్ ఆయన. ఒకప్పటి ముఖ్యమంత్రి కూడా. ఇక జైరాకు వచ్చిన అతి చెత్త విమర్శ.. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కోసం 'యాక్ట్' చేస్తోందని!

జైరా వసీమ్‌కు యాక్ట్ చేసే అవసరం లేదని ఇప్పటివరకు ఆమె నటించిన రెండు సినిమాల్లో ఆమె చేసిన యాక్షన్ చూస్తే అర్థమౌతుంది. 'దంగల్', 'సీక్రెట్ సూపర్ స్టార్'.. రెండూ శుభ్రమైన సినిమాలు. టీన్స్‌ని ఇన్‌స్పైర్ చేసేవి. త్వరలో రాబోతున్న మూడో సినిమా 'ది స్కై ఈజ్ పింక్' కూడా అలాంటిదే. ఐషా చౌదరి అనే టీనేజ్ అమ్మాయి బయోపిక్ అది. దంగల్‌లోని గీతా ఫోగట్, సీక్రెట్ సూపర్ స్టార్‌లోని ఇన్సియా మాలిక్, ఇప్పుడీ స్కై ఈజ్ పింక్‌లోని ఐషాలకు జైరా సరిగ్గా సరిపోయారు. మొదటి సినిమా.. కూతురు మీద తండ్రి పెట్టుకున్న ఆశల్ని కూతురు నెరవేర్చడం. రెండో సినిమా.. కూతురు ఆశల్ని పట్టించుకోని తండ్రికి తెలియకుండా కూతురు తన ఆశయాన్ని నెరవేర్చుకోవడం. మూడో సినిమా.. చిన్న వయసులోనే శ్వాసకోశ వ్యాధి బారిన పడిన ఓ టీనేజర్.. మనుషులు తమ ఆశల్ని, ఆశయాల్ని నెరవేర్చుకునేలా మోటివేట్ చేయడం.



జీవిత పరమార్థంపై ఐషా ఇచ్చిన ప్రసంగం నాకు స్ఫూర్తిని ఇచ్చింది.
- దీపక్ చోప్రా, ప్రముఖ రచయిత, ప్రజావక్త

కథలో లైఫ్ ఉంది. కథను సినిమాగా తీసిన వాళ్లలో స్కిల్ ఉంది. సినిమాలో ముఖ్యపాత్రగా నటించిన జైరాలో టాలెంట్ ఉంది. ఇన్ని ఉన్నప్పుడు మూవీ ప్రమోషన్ నుంచి జైరా క్విట్ అవడంలో వ్యూహం ఏముంటుంది? మనసులో ఉన్నదాన్ని క్లియర్‌గా చెప్పే వయసునింకా ఆమె దాటి రానేలేదు. అదలా ఉంచితే, 'ది స్కై ఈజ్ పింక్'ను.. ఆ చిత్రంలో జైరా తల్లిగా నటించిన ప్రియాంక చోప్రా గానీ, తండ్రిగా నటించిన ఫర్హాన్ అఖ్తర్ గానీ సాదాసీదా స్టార్‌లేమీ కారు. సినిమాను వాళ్లు ప్రమోట్ చేయగలరు. చిత్ర దర్శకురాలు సోనాలీ బోస్‌కు ఉన్న ఫేస్ వాల్యూ తక్కువేమీ కాదు. సినిమాను ఆమె ప్రమోట్ చేయగలరు. చిత్ర నిర్మాతలు సిద్ధార్థరాయ్ కపూర్, రోనీ స్క్రూవాలా! ప్రమోషన్‌లో వాళ్లను మించినవారెవరు? వీళ్లందరూ చేయకున్నా పోయిందేమీ లేదు. 'ది స్కై ఈజ్ పింక్' రిలీజ్ అయ్యాక ఆ సినిమా తనకు తాను ప్రమోట్ చేసుకోగలదు. అంత జీవితం ఉంది కథలో. జీవితం కోసం థియేటర్‌లకు వెళతారా ప్రేక్షకులు! జీవితంలో ఊపిరి ఆడకే కదా ఆ రెండున్నర గంటలు బతికేందుకు వెళతారు. కావచ్చు. కానీ ఐషా జీవితంలో పదిమందిని బతికించే శక్తి ఉంది. బతకమని ఇన్‌స్పైర్ చేసే గుణం ఉంది. అందుకే 'ది స్కై ఈజ్ పింక్'కు కథానాయిక అయింది.



'ది స్కై ఈజ్ పింక్' చిత్రం పోస్టర్‌లో జైరా వసీమ్, ప్రియాంకా చోప్రా, ఫర్హాన్ అఖ్తర్.. ఇంకా దర్శక నిర్మాతలు.

●●●

ఐషా జీవితంలోని తొలి రోజు 1996 మార్చి 27. ఆ రోజున ఆమె పుట్టింది. ఐషా జీవితంలోని చివరి రోజు 2015 జనవరి 24. ఆ రోజు ఆమె మరణించింది. ఈ మధ్యలోని పందొమ్మిదేళ్లలో చివరి నాలుగేళ్లు ఆమె తన స్పీచ్‌లతో యువతను మోటివేట్ చేశారు. పద్దెనిమిదేళ్ల వయసుకే పుణెలోని టెడ్‌లో (టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్, డిజైన్) స్పీకర్‌గా పని చేశారు. 'మై లిటిల్ ఎపిఫనీస్' అనే పుస్తకం రాశారు. ఆమె చనిపోవడానికి ముందు రోజు ఆ పుస్తకం రిలీజ్ అయింది. జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో పుస్తకావిష్కరణ అనంతరం ఐషా గుర్‌గావ్‌లో కన్నుమూశారు.

ఐషా తండ్రి నిరేన్ చౌదరి. అమెరికన్ ఫాస్ట్ ఫుడ్ కంపెనీ 'యమ్ బ్రాండ్' దక్షిణాసియా విభాగంలో పెద్ద ఉద్యోగి. తల్లి అదితి.. మెంటల్ హెల్త్ వర్కర్. అన్నయ్య ఇషాన్. ఇదీ ఐషా ఫ్యామిలీ. ఢిల్లీలో ఉంటారు. పుట్టుకతోనే ఐషాకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంది. ఆరేళ్ల వయసులో బోన్‌మ్యారో మార్పిడి జరిగింది. సైడ్ ఎఫెక్ట్‌గా పల్మనరీ ఫైబ్రోసిస్ వృద్ధి చెందింది. చివరికి శ్వాసకోశాలు దెబ్బతిని ఐషాను మృత్యువు లాక్కెళ్లింది. ఆమెతో పాటు ఆమె తన ప్రసంగాలతో నిలబెట్టవలసిన ఎంతోమంది జీవితాల్లోని భాగ్యాన్ని కూడా! అయితే ఐషా గురించి ఇదంతా పైపై కథ. ఐషా లోపల ఇంకో జీవితం ఉంది. అది.. ఆలోచనల జీవితం. మనిషి ఆలోచనలే మనిషి అనుకుంటే.. ఐషా ఇంకా బతికే ఉన్నట్లు. 'మై లిటిల్ ఎపిఫనీస్' ఆమెను సజీవంగా ఉంచినట్లు.

●●●

ఐషా తన జీవితాన్ని ఎలా అర్థం చేసుకుందో, జీవితంలో తను ఏం కనిపెట్టిందో, జీవితంలో ఏది ముఖ్యమని గ్రహించిందో, జీవితాన్ని తను ఏ విధంగా అవలంబించిందో అదే.. మై లిటిల్ ఎపిఫనీస్. ఇంత చిన్న వయసులోనా! అందుకే కదా.. జైరా వసీమ్ ఆ పాత్రకు చక్కగా సరిపోయారు. 'ఎపిఫనీ' అంటే అవగాహన పరచుకోవడం. 'నాకొక కొత్త జత షూ కావాలి.. ఈసారి నా నుంచి నేను పరుగెత్తి పోడానికి' అని పుస్తకంలో ఒక చోట రాసుకున్నారు ఐషా. జీవితం నుంచి వెళ్లిపోయే రోజున 'ఎక్కడికెళతావ్..' అని మనం పెంచుకుంటున్న కుక్కపిల్ల కూడా బలంగా కాళ్లకు చుట్టేసుకుంటుందని ఆమెకు మాత్రం తెలియదా? ఐషాను అంటుకుని ఎప్పుడూ కోబో, రోలో అనే రెండు పెంపుడు కుక్కలు ఉండేవి. రోలో చనిపోయింది. పుస్తకం ప్రారంభంలోనే రెండు మూడు పేజీల తర్వాత రోలో గురించి ఉంటుంది.

'మై డియరెస్ట్ డార్లింగ్, రోలో.. మాటలు రావడం లేదు. బేబీ.. నువ్వు లేకుండా నాకు ఊపిరి అందుతుందా? నా జీవితానికి కాంతివి నువ్వు. నా వేకువకు కారణం నువ్వు. నా శక్తివి. నువ్వే అన్నీ. నా అనారోగ్యాన్ని నీ కళ్లలోకి తీసుకున్నావు. మరీ అంతగా తీసుకోవద్దని చెప్పేలోపే అకస్మాత్తుగా నాకన్నా ముందే నువ్వు వెళ్లిపోయావు. నిన్నెప్పటికీ మర్చిపోలేను' అని రాసుకున్నారు ఐషా. ఐదువేల పదాల ఆలోచనలున్న ఈ పుస్తకం చెప్పేదొక్కటే. మనిషి చనిపోవచ్చు... ఆశ చావకూడదని. తన స్పీచ్‌లలో.. అంత చిన్న వయసులో ఐషా ప్రతి చోటా ఇదే మాట చెప్పేవారు. బహుశా ఈ మాటలే ఆమె కూడా తన మరణాన్ని తేలిగ్గా తీసుకునేలా చేసి ఉండాలి.

ఇంగ్లిష్‌లో 'ఇన్ ది పింక్' అనే మాట ఉంది. గుడ్ కండిషన్‌లో ఉందని చెప్పడం. 'ఇన్ ది పింక్ ఆఫ్ హెల్త్' అంటే.. ఇన్ వెరీ గుడ్ హెల్త్ అని. ఐషా ఊపిరి ఆకాశానికి చేరుకుంది. ఆకాశాన్ని ఆరోగ్యవంతం చేసింది. అందుకేనా ఈ చిత్రానికి 'ది స్కై ఈజ్ పింక్' అని పేరు పెట్టారు!

చెట్టు నీడ

## సంకల్ప బలం

సముద్రపు ఒడ్డున ఉన్న రాతి గుహల్లో ఒక చిన్న పక్షి వుండేది. అది ఒడ్డున తన గుడ్లు పెట్టుకుంది. ఒక రోజు సముద్రంలో అలలు పొంగి ఆ గుడ్లు కొట్టుకుని పోయాయి. అప్పుడు ఆ పక్షి ఏడుస్తూ కూర్చోలేదు. ఓదార్చడానికి వచ్చి పోయే వాళ్లతో మాట్లాడుతూ కూర్చోలేదు. ఎప్పుడైతే గుడ్లు కొట్టుకు పోయాయో, అప్పుడు వెంటనే తన ముక్కుతో సముద్రపు నీరు



నింపుకుని దూరంగా వెళ్లి నేలపైన వేసింది. ఆ పక్షిని చూసి, దాని గుడ్లు కొట్టుకుపోయాయని తెలిసి ఎవరైతే సానుభూతి చూపించడానికి వచ్చారో వారు కూడ అదే పని చెయ్యడం మొదలు పెట్టారు. ఎలాగైనా సముద్రుడిని శుష్కింపచేయాలన్న దృఢ నిశ్చయంతో ఇక వారు ఎవరి మాటా వినలేదు.

ఇంత చిన్నపక్షి సముద్రుడిని శుష్కింప చేయగలదా చెప్పండి! కానీ దాని మనసులో ఎంతటి దృఢత్వం! పౌరుషం! ఎంతటి ప్రయత్నం!! సంకల్ప బలం దాని అణువణువునా నిండిపోయింది. ఇక దేశదేశాలనుండి కూడా పక్షులు రావడం మొదలు పెట్టాయి.

ఈ సమాచారం పక్షులకు రాజయిన గరుత్మంతుడికి తెలిసింది. సముద్రుని శుష్కింపజేయటానికి కోట్లాది పక్షులు ఆ పనిలో నిమగ్నమైవున్నాయట. 'పద నేను చూస్తాను' అని గరుడుడు కూడా వచ్చాడు.

''ఓ సముద్రమా! మా వారంతా ఒకటై నిన్ను శుష్కింపజేయాలనుకుంటున్నారు. నీవేమో 'ఇవి నన్నేం చేస్తాయి? క్షుద్రమైన పక్షులు' అనుకుంటున్నావా ఇప్పుడు చూడు నా తడాఖా!'' అని గరుడుడు సముద్రం పైన తన రెక్కలతో రెండు మూడు సార్లు బలంగా ప్రహారం చేశాడు. అప్పుడు సముద్రుడు భీతిచెంది పక్షి గుడ్లను తెచ్చి ఇచ్చాడు.

అంటే ఎంత పెద్దపనైనా సరే సంకల్పించి, శక్తి కొద్దీ ప్రయత్నిస్తే అప్పుడు నీకు సహాయం చేసేవాళ్లు, నీకు సలహా ఇచ్చేవాళ్లు నీకు లభిస్తారు. అప్పుడు ఆ పని చెయ్యడం వలన నీకు సాఫల్యం చేకూరుతుంది. ఇదే విషయాన్ని జగద్గురు శంకరాచార్యులవారి గురువు గౌడపాదాచార్యులవారు శిష్యులకు బోధించేవారు.

వెన్నెల రేడు

## చెంచుల కోసం క్షీరసాగరం





కృష్ణారావు (నాడు, నేడు)

'నెల నెలా వెన్నెల' పేరుతో ఔత్సాహిక కవుల వెన్ను తట్టి శెభాస్ అంటూ ప్రోత్సహించి ముందుకు నడిపించిన కవి.. గిరిజన బిడ్డల కడుపు నింపడమే ఉద్యోగధర్మంగా నిరంతరం వారి పూరిళ్లలో నివసిస్తూ గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందిన ఉద్యోగి.. నేడు 94వ ఏట అడుగు పెడుతున్న నిబద్ధతా స్వరూపం.. శ్రీ సి.వి.కృష్ణారావు. గుంటూరు, బ్రాడీపేటలో సత్తెనపల్లి వెళ్లే రైలు పట్టాల పక్క ఖాళీ స్థలంలో నలుగురు చేరి కవిత్వాన్ని వినిపించడంతో ప్రారంభమైన కవితా గోష్ఠి కృష్ణారావు నేతృత్వంలో 'నెల నెలా వెన్నెల'గా రూపుదిద్దుకొని ఇంచుమించు అరవై సంవత్సరాలు నిరంతరాయంగా కొనసాగింది. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఒక సంపన్న జమీందారీ కుటుంబంలో 1926 జూలై 3న జన్మించిన కృష్ణారావు మఖమల్ పరుపుల మీద పారాడే అదృష్టం వెనుక పుట్టినప్పుడే తల్లిని, తరువాత కొద్దికాలానికి మాతామహులను పోగొట్టుకోవడమనే దురదృష్టమూ వెన్నంటి ఉంది. గుంటూరులో కళాశాల విద్యనభ్యసించే కాలంలో నయాగరా కవుల (కుందుర్తి, ఏల్చూరి మొ) పరిచయం లభించింది. కవిత్వాన్ని ఆస్వాదించడం, విస్తృతంగా పుస్తక పఠనం, రచనలు చేయడం ప్రారంభమైంది. 'వైతరణి' మొదటి కవితా సంపుటి. 'మాదీ మీ వూరే మహారాజ కుమారా', 'అవిశ్రాంతం' మొదలైనవి ముద్రితాలు! లాతూరు భూకంపం సందర్భంగా కంపన కేంద్ర గ్రామమైన 'కిల్లారి'లో స్వామీ రామానంద తీర్థ సంస్థ పనుపున సేవలు అందించిన సందర్భంగా ఆ బీభత్సానికి అచ్చుగుద్దిన 'కిల్లారి' అనే కావ్యం కృష్ణారావు కలం నుండి వెలువడి Fiery and Fierce పేరుతో తర్జుమా అయింది. రామారావు దానిని ఆంగ్లంలోనికి అనువదించారు. చిన్నతనంలో అలవడిన, నరనరాన జీర్ణించుకొన్న కమ్యూనిస్టు భావపరంపరను నిజ జీవితంలో అమలు పరిచే అదృష్టాన్ని ఆయన ఎంచుకున్న ఉద్యోగం అందించింది. గిరిజన ఆదివాసీ జనుల జీవనగతులను మార్చగలిగే అవకాశాన్నివ్వగల ఉద్యోగంలో కృష్ణారావు కుదురుకోవడం అంటే ఒక సిద్ధాంతాన్ని నిబద్ధతగా అమలు పరచే వ్యక్తిత్వం ఉండాలే గాని సిద్ధాంతం ఎప్పుడూ పేలవమైనదీ, నిరర్థకమైనదీ కాదని నిరూపించడమే! వందలాది చెంచుల జీవన విధానాన్ని మెరుగు పరచిన 'క్షీరసాగరం' ప్రాజెక్టు సృష్టికర్త ఆయనే. అసిఫాబాద్ అడవులలో గాని, రంపచోడవరం మన్యంలో గాని తాను చూచిన సంఘటనలే ఆయన కవితా వస్తువులు! ప్రతి కవితలోను ఆ జీవుల రక్తాశుర్రులు దర్శనమిస్తాయి!

– సి.బి.వి.ఆర్.కె.శర్మ

గీతాసనం

## భరత రాగ యోగం

ఇటీవల యోగా డే సందర్భంగా మంజునాథ అనే సంగీతకారుడు స్వరపరిచిన యోగా గీతం 'యోగ నియోగ' ఇప్పుడు యూ ట్యూబ్‌లో అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పటికే సుమారు పన్నెండు లక్షల మంది ఈ వీడియోను వీక్షించారు. ఇందులో సూర్య నమస్కారాలు, సూర్యునికి అర్ఘ్యం సమర్పించడం, యోగా చేయడం, ముఖ ప్రక్షాళన, కుంకుమ ధారణ వంటి అంశాలను నృత్యరూపంలో చూపించారు. ఈ గీతాన్ని ప్రముఖ కన్నడ శతావధాని డా. ఆర్. గణేశ్ రచించారు. మంజునాథ కొత్తగా ఒక రాగాన్ని కనిపెట్టి, దానికి భరత రాగం అనే పేరు పెట్టి ఆ రాగంతో యోగా గీతానికి బాణీ కట్టారు. 'కొత్త రాగాన్ని కనిపెట్టడమంటే పునర్జన్మ ఎత్తడం కంటె పై మాటే. మూర్ఛన రూపొందించాలి' అంటారు మంజునాథ. ఈ గీతాన్ని ఆలపించడానికి గాయకులందరినీ ఏకతాటి మీదకు తీసుకు రావటానికి కొద్దిగా శ్రమించారు మంజునాథ్. బాంబే జయశ్రీ నుంచి మిగతా కళాకారులందరినీ సమన్వయం చేశారు. మొదట ఈ గీతాన్ని రికార్డు చేసి, సంగీత కళాకారులందరికీ మెయిల్ చేశారు. 'వియ్ ట్రాన్స్‌ఫర్' ద్వారా కళాకారులంతా వారి వారి భాగాలను రికార్డు చేసి మంజునాథ్‌కు అందచేశారు. అందరూ ఒకే శృతిలయలను అనుసరించారు. ఈ ట్రాక్ ఓంకారంతో ఆరంభమవుతుంది. మంద్ర



'యోగ నియోగ' వీడియోలో ఓ దృశ్యం

స్థాయిలో పలికే ఓంకారం, తారస్థాయిలో పాడిన ఓంకారంతో కలిసేలా ఎక్కడా శృతి దోషాలు లేకుండా శ్రద్ధ వహించారు. వాద్యకారులు కూడా దోషం రాకుండా చాలా జాగ్రత్తగా రికార్డు చేసి పంపారు. భారీగా వినిపించే ట్రంపెట్ సౌండ్, మృదువుగా మనసును హత్తుకునే ఫ్లూట్‌తో సమానంగా వినిపిస్తుంది, అలాగే సరస్వతి వీణతో మృదంగం సమన్వయమైంది. ఈ పాటకు రాధా కల్ప డ్యాన్స్ కంపెనీ వారు నృత్యకల్పన చేశారు. ఈ పాటలో పాడినవారెవ్వరూ పారితోషికంగా ఒక్క పైసా కూడా తీసుకోకపోవడం విశేషం.

– డా. వైజయంతి



వయొలిన్ విద్వాంసుడు ముంజునాథ

సాక్షి
# ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
3-7-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! నేనొక అమ్మాయికి వన్ ఇయర్ బ్యాక్ ప్రపోజ్ చేశాను. కానీ అప్పుడు.. తను 'నాకు ఇష్టం లేదు' అంది. రీసెంట్‌గా వచ్చి నాకు ఓకే చెప్పింది. అయితే నాకు ఇప్పుడు ఇంట్రెస్ట్ లేదు. కానీ నేను నో చెప్పలేకపోయాను. మా బంధం ముడిపడి ఇప్పటికే మూడు నెలలు దాటింది. ఒక వేళ నేను సడన్‌గా బ్రేకప్ చెప్తే.. తను ఏం చేసుకుంటుందోనని భయం వేస్తోంది. నాకు ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. హెల్ప్ చెయ్యండి సార్ ప్లీజ్!

– పవన్

ఏం చేసుకోదు!

'ఏంటి సార్ అంతమాట అనే..సారూ???'

అవును నీలాంబరీ! ఈయన కాదంటే ఏం చేసుకోదు!!

'ఆర్ యు షూర్ సార్??'

ఈయన్ని అయితే కచ్చితంగా చేసుకోదు!!

'అది తెలుసు సార్.. కానీ..!?'

కానీ లేదు.. గీనీ లేదు.. పవన్ హ్యాపీగా అమ్మాయికి నో చెప్పెయ్యొచ్చు!!

'సార్ మీరు చాలా అది సార్!'

నేనేదైతేనేమి నీలూ?? అమ్మాయికి ఏం కాదు!!

'సరే.. పవన్ చెప్పేసెయ్..! నో అని చెప్పేసెయ్..!! మళ్లీ తర్వాత బాధపడొద్దు..!! అంత లవ్లీ అమ్మాయిని పోగొట్టుకున్నానని తర్వాత ఫీల్ అయ్యి లాభం లేదు!!'

చెప్పేసెయ్! నో అంటే నో అని చెప్పేసెయ్!!

'సార్ నాకొక డౌట్ సార్! నో అని చెప్పాక పవన్ ఏమైనా చేసుకుంటాడేమోనని!?'

నీలూ పవన్ నో చెప్పడు.. చెబితే నీకు నా క్లినిక్ రాసిస్తాను!

'మీరు చాలా అది సార్!' అని నవ్వింది నీలూ.

lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 9 | | | 6 | | | 5 | 2 |
| 5 | | 8 | | 3 | | 6 | | |
| 2 | | 7 | 1 | | | 9 | | |
| 3 | | | | | | 5 | 2 | 4 |
| | | | | 1 | | | | |
| 7 | 2 | 9 | | | | | | 8 |
| | | 6 | | | 7 | 2 | | 5 |
| | | 2 | | 8 | | 7 | | 9 |
| 9 | 7 | | | 2 | | | 3 | 6 |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 5 | 7 | 9 | 8 | 6 | 4 | 2 | 1 |
| 1 | 8 | 6 | 4 | 7 | 2 | 5 | 9 | 3 |
| 9 | 4 | 2 | 3 | 1 | 5 | 7 | 8 | 6 |
| 5 | 7 | 1 | 8 | 2 | 3 | 9 | 6 | 4 |
| 6 | 3 | 9 | 7 | 5 | 4 | 2 | 1 | 8 |
| 4 | 2 | 8 | 1 | 6 | 9 | 3 | 7 | 5 |
| 7 | 1 | 5 | 2 | 4 | 8 | 6 | 3 | 9 |
| 8 | 6 | 3 | 5 | 9 | 7 | 1 | 4 | 2 |
| 2 | 9 | 4 | 6 | 3 | 1 | 8 | 5 | 7 |

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



బాలా త్రిపురమణి నడుం తిప్పుకుని
అలా ఎలా కదిలింది?
చూస్తే వెన్నుపూస తానో వెన్నపూస
అనే ఎలా తెలిసింది?
తానో కంచిపట్టు నాదా పంచెకట్టు
అయినా జరీ కుదిరింది
ఎప్పుడో అప్పుడో చివరికొచ్చేది అక్కడికేగా
బుద్ధుడే ఓ యుద్ధమే చేసేయడా నిను చూస్తే
అంతగా ఉన్నావనే తెలిసిందిలే నిను గమనిస్తే
సూటిగా తెరచాటుగా అడిగావుగా నన్నేదో
ఘాటుగా చెప్పానులే ఆకట్టుకున్నదిక నన్నేదో
అలెలె అలెలె అలె అలెలె అలె అలె అలె ॥2॥

ఏ మాత్రమూ మొహమాటము ఇక లేదనేయనా
నీ మాటలో తెలిసిందిలే లేదే తనా మనా
వయసుకు తెలియదా.. తెలుసులే
నిన్నే అడగదా.. గొడవలే
తడబడి ఆపినా.. ఆగదే
పైగా సరాసరీ కలిశాకే.. ఏదో ఆత్రమే.. కలిగినా
దానికి అర్థమే.. తెలుపనా
నియంతలే నీ అంతగా ఆకట్టుకోలేదు నన్నిట్టా
అలెలె అలెలె అలె అలెలె అలె అలె అలె ॥2॥

నిను దాటనీ ప్రతి మాటనీ వినాలనుందిగా
పొరపాటుగా అనుకున్నదీ అనాలనుందిగా
లెక్కలు అందనీ తీరికా.. గమ్మత్తైన ఈ గమనిక
ఆపదు ఎందుకో నన్నిక
నీతో తెగించనా తెల్గ్గా
దిక్కులు దాటినా కలయిక
ఎవరిక తగ్గినా తగదిక.. చనువన్నదే కనుగొన్నదే
నీలాంటి అందాన్ని చూశాక
అలెలె అలెలె అలె అలెలె అలె అలె అలె ॥2॥

**చిత్రం : బ్రహ్మోత్సవం**
**సంగీతం : మిక్కీ జే మేయర్**
**రచన : శ్రీమణి**
**సింగర్ : రాహుల్ నంబియార్**

కట్‌చేయ్...దాచేయ్...


నాని

# భాగ్యనగరంలో గ్యాంగ్‌లీడర్

''జీ ఏ యన్ జీ గ్యాంగ్, గ్యాంగ్, బచావో బ్యాంగ్ బ్యాంగ్'' అంటూ అప్పట్లో చిరంజీవి 'గ్యాంగ్‌లీడర్' చిత్రంతో ఎంతో సందడి చేశారు. 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ పేరుతో హీరో నాని సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నాని హీరోగా విక్రమ్. కె. కుమార్ దర్శకత్వంలో తాజా 'గ్యాంగ్‌లీడర్' రూపొందుతోంది. నాని సరసన ప్రియాంక అనే తమిళ భామ ఈ చిత్రం ద్వారా కథానాయికగా తెలుగు తెరపై ఆరంగేట్రం చేయనుంది. నాని 24వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ ఛాయాగ్రాహకుడు పి.సి. శ్రీరామ్ ఛాయాగ్రాహకుడు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది 'గ్యాంగ్‌లీడర్'. తాజా షెడ్యూల్‌ను ఈ నెల 6న హైదరాబాద్‌లో ప్రారంభించి 20వ వరకు షూట్ చేస్తారు. ఈ షెడ్యూల్‌లో సినిమాకి ఎంతో కీలకమైన కొంత టాకీతో పాటు, ఓ ఫైట్‌ను చిత్రీకరిస్తారట. రొమాంటిక్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ విలన్ పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. నాని నటించిన 'జెర్సీ'కి స్వరాలందించిన అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి స్వరకర్త.

# కాలేజీకి వేళాయె


అనుపమా పరమేశ్వరన్

కాలేజీకి వెళ్లడానికి బ్యాగ్‌లో బుక్స్ సర్దుకుంటున్నారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. రియల్ లైఫ్‌లో కాదులెండీ. రీల్ లైఫ్‌లో. తమిళ యువ నటుడు అధర్వ హీరోగా కన్నన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో కథానాయికగా అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారు. ఈ సినిమాలో ఇంజినీరింగ్ స్టూడెంట్ కమ్ భరతనాట్యం డ్యాన్సర్‌గా నటించనున్నారు అనుపమా పరమేశ్వరన్. హీరో అధర్వ పీహెచ్‌డీ స్కాలర్‌గా పాత్ర చేయనున్నారు. ''ఈ సినిమా షూటింగ్‌ను ఎక్కువ శాతం విదేశాల్లో చిత్రీకరించాలని ప్లాన్ చేశాం. యూఎస్, ఆస్ట్రేలియాలో మేజర్ షూటింగ్ ప్లాన్ చేస్తున్నాం. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని కంప్లీట్ చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం'' అని దర్శకుడు పేర్కొన్నారు. అనుపమ తమిళంలో చేస్తున్న రెండో చిత్రం ఇది. ఇంతకుముందు ధనుష్ ద్విపాత్రాభినయం చేసిన 'కొడి' సినిమాలో ఆమె ఒక హీరోయిన్‌గా నటించారు.


బి. గోపాల్, బాలకృష్ణ, చిరంజీవి, కోదండ రామిరెడ్డి, వెంకటేశ్, రాఘవేంద్రరావు, అశ్వనీదత్

ప్రముఖ దర్శకుడు కోదండ రామిరెడ్డి 70వ జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగాయి. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, దర్శకులు కె. రాఘవేంద్రరావు, బి.గోపాల్ తదితరులు పాల్గొని, శుభాకాంక్షలు అందజేశారు. ఏయన్నార్, కృష్ణ వంటి నాటి తరం నటులతో పాటు ఆ తర్వాతి తరం హీరోలతోనూ సినిమాలు చేసిన ఘనత కోదండ రామిరెడ్డిది. చిరంజీవికి 'న్యాయం కావాలి, అభిలాష, ఖైదీ' వంటి పలు హిట్ చిత్రాలు ఇవ్వడంతోపాటు, ఆయనతో ఎక్కువ సినిమాలు చేసిన దర్శకుడు ఈయనే. బాలకృష్ణకు 'అనసూయమ్మగారి అల్లుడు, నారి నారి నడుమ మురారి' వంటి విజయవంతమైన చిత్రాలు ఇచ్చారు. నాగార్జునతో 'కిరాయి దాదా, విక్కీ దాదా, అల్లరి అల్లుడు' వంటి సినిమాలు తెరకెక్కించారు.

# సస్పెన్స్ లవ్ స్టోరీ


సాయిరామ్ శంకర్, దాడిశెట్టి రాజా, ఉమాశంకర్

హీరోగా పలు చిత్రాల్లో నటించిన ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరాం శంకర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం మంగళవారం మొదలైంది. ఈ చిత్రంతో చిరుమామిళ్ల కృష్ణ దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అమృత హరిణి క్రియేషన్స్ సురేష్ రెడ్డి, రియల్ రీల్స్ రాజారెడ్డి, శ్రీ శరణం అయ్యప్ప క్రియేషన్స్ రాజు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తలుపులమ్మ దేవస్థానంలో ప్రారంభమైంది. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాడిశెట్టి రాజా క్లాప్ ఇచ్చారు. సాయిరాం శంకర్ మాట్లాడుతూ–''నేను ఇదివరకు నటించిన చిత్రాల్లోకి ఇది విభిన్న కథా చిత్రం అవుతుంది. నా కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''క్రైమ్, సస్పెన్స్, లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కనున్న చిత్రమిది. అన్ని కమర్షియల్ అంశాలు ఉంటాయి. ఆగస్టులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం'' అన్నారు చిరుమామిళ్ల కృష్ణ.

# ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాం!


రాజశేఖర్



ఎఫ్‌డీసీ (ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఛైర్మన్ పదవి నాకు ఇవ్వబోతున్నారన్న వార్తలు కేవలం పుకార్లే. వైఎస్ జగన్‌గారి కోసం మాకు దొరికిన తక్కువ సమయంలో చేయగలిగిన ప్రచారం చేశాం. ఆయన గెలిచినందుకు హ్యాపీగా ఉంది. ప్రజలకు చాలా మంచి పనులు చేస్తున్నారు. ఇప్పుడు నాకైతే ఆంధ్ర, తెలంగాణ అనే ఫీలింగ్ పోయినట్లు ఉంది. ఇంతకు ముందు ఆంధ్ర, తెలంగాణ వేర్వేరు అనే ఫీలింగ్ ఉండేది సైకలాజికల్‌గా. ఇప్పుడు ఇద్దరు సీయంలు (ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్) మధ్య మంచి సాన్నిహిత్యం ఉన్నట్లు కనిపిస్తోంది. **- జీవిత**

**"ఈ వయసులో మనం చేయలేని యాక్షన్ సీన్స్ చేయగలుగుతున్నామే... అని హ్యాపీ ఫీలయ్యాను. చేయలేకేం కాదు. యాక్షన్ సీన్స్‌ని ఎంజాయ్ చేస్తూ హ్యాపీగా చేశాను. సినిమాలో ప్రస్తావించిన కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతాను" అన్నారు రాజశేఖర్. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా సి. కల్యాణ్ నిర్మించిన 'కల్కి' గత శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాజశేఖర్‌తో పాటు ఆయన సతీమణి జీవిత చెప్పిన సంగతులు.**

- నటన, లుక్స్, మేనరిజమ్.. ఇలా అన్ని అంశాల్లో 'కల్కి' నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. కలెక్షన్స్ పరంగా 60–70 శాతం మార్కులే వచ్చాయి. థియేటర్‌లో 100 పర్సెంట్ కలెక్షన్ లేదు. ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యాం. ఇలా ఎందుకు జరిగిందని విశ్లేషించుకోవాల్సి ఉంది. మొత్తంగా 'కల్కి' నేను అనుకున్న స్పీడ్ అందుకోలేదు. త్వరలో అందుకుంటాను. వదలను. మా సినిమాకు కొన్ని బ్యాడ్ రివ్యూస్ రాశారని తెలిసింది. మంచి సినిమాపై బ్యాడ్ రివ్యూస్ ప్రభావం చూపలేవు. స్క్రీన్‌ప్లే ఇంకా ఫాస్ట్ అండ్ గ్రిప్పింగ్‌గా ఉండి ఉంటే వంద మార్కులు సాధించి ఉండేవారమని నా అభిప్రాయం.
- సినిమాలో 'ఏం సెప్తిరి.. ఏం సెప్తిరి' అనే డైలాగ్ ప్రశాంత్ వర్మ ఫస్ట్ చెప్పినప్పుడు బాగా రాశారన్నాను. ఈ విషయం జీవితతో చెబితే... ఈ డైలాగ్ మీదే కదా అని చెప్పింది. నాపై వేసిన కామెడీ డైలాగ్ నాదే అని కూడా తెలియకుండా నటించాను. ఆ తర్వాత ఏవో కామెంట్స్ వినిపించాయి. ఆ సినిమా (ఈ డైలాగ్ ఉన్న సినిమా) చూడలేదు. విలన్ పాత్రలు చేయాలని ఉంది. కానీ రొటీన్‌గా ఉండేవి చేయాలనుకోవడం లేదు.
- మా ఇద్దరు కూతుర్లు మంచి ఆర్టిస్టులుగా పేరు తెచ్చుకుంటారనే మాటలు వినిపించడం హ్యాపీగా ఉంది. ఓ సందర్భంలో నేను, శివానీ కలిసి ఓ సినిమా చేద్దాం అనుకున్నాం. కుదర్లేదు. నేను, జీవిత, శివానీ, శివాత్మిక కలిసి భవిష్యత్‌లో ఓ సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నాం. ఇదే కాదు నా పిల్లలతో ఎన్ని సినిమాలు వచ్చినా చేస్తాను. కొడుకులే చేస్తారు? కూతుళ్లు అంతగా చేయలేరు? అనుకున్న నాకు నా కూతుళ్లు సర్‌ప్రైజ్ ఇచ్చారు. అంతగా ఇన్‌వాల్వ్ అవుతున్నారు.
- 'కల్కి 2' ఉండొచ్చు కానీ ఎప్పుడన్న విషయం గురించి స్పష్టంగా చెప్పలేను. మరోవైపు ప్రవీణ్ సత్తారు 'గరుడ వేగ 2' స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారు. జీవిత అవుట్‌లైన్ విన్నారు. అయితే నా నెక్ట్స్ సినిమా ఏంటీ అని ఇంకా అనుకోలేదు.

### ఇన్‌వాల్వ్‌మెంట్ కాదు... కేరింగ్

*''కల్కి' సినిమా డైరెక్షన్‌లో జీవిత లీనమయ్యారనే వార్త అక్కడక్కడా వినిపిస్తోంది. దీని గురించి జీవితా రాజశేఖర్‌లు ఈ విధంగా స్పందించారు.*

**జీవిత:** ఈ సినిమా బడ్జెట్ దాదాపు 23 కోట్లు అయ్యింది. ఇన్ని కోట్లు పెట్టి సినిమా తీసేప్పుడు కరెక్ట్‌గా వస్తుందా? రాదా?.. అంటే యూనిట్‌లో మేం ఒక 10 మెంబర్స్ డిసైడింగ్ ఫ్యాక్టర్స్‌గా ఉంటాం. ఈ పదిమందికి ముందు నచ్చాలి కదా. రిలీజ్ తర వాత పదికోట్లమందికి నచ్చుతుందా? లేదా అన్నది తర్వాతి విషయం. ప్రశాంత్ వర్మకు ఇది రెండో సినిమా. పెద్ద సినిమా చేస్తున్నాం. మనం షూట్ చేసిన రషెస్ పరిశీలించుకున్నప్పుడు అవసరమైతే టీమ్ అందరితో కలిసి చర్చించుకోవాలి కదా. అలా చేయడం ఇంటర్‌ఫియరెన్స్ అవుతుందా? లేక ప్రాజెక్ట్‌పై మేం తీసుకునే కేర్ అవుతుందా?

**రాజశేఖర్:** డైరెక్షన్‌లో కాదు జీవిత డిస్కషన్స్‌లో పాల్గొన్నారు. ఈ కేర్‌ను ఇంటర్‌ఫియరెన్స్ అంటే బాధగా ఉంటుంది కదా.

**జీవిత:** ఇటీవల 'డిగ్రీ కాలేజీ' సినిమా ప్రెస్‌మీట్‌లో టీజర్ అసభ్యకరంగా ఉందని నా అభిప్రాయం చెప్పాను. సినిమాలో అవసరమైన చోట రొమాన్స్ అవసరం. నేనూ నటించాను. మా కూతుళ్లూ నటిస్తున్నారు. ఒక కిస్సింగ్ సీనో... ఒక హగ్గింగ్ సీనో కథ డిమాండ్ చేస్తేనే పెట్టాలి. మణిరత్నంగారు ఎంతో రొమాన్స్ చూపిస్తారు. కానీ వల్గర్‌గా అనిపించదు. బాలచందర్‌గారు, విశ్వనాథ్‌గారు, బాపుగారి సినిమాల్లో రొమాన్స్ ఉంటుంది. కానీ చూపించాల్సిన విధానంలోనే ఉంటాయి. ఒక సెన్సార్ మెంబర్‌గా ఆర్‌సీ (రివైజింగ్ కమిటీ) నా దగ్గరకు వచ్చిన కొన్ని సినిమాలు చూస్తుంటే... ఏడవాలో నవ్వాలో తెలియదు. అదేదో 'ఏడుచేపల కథ' అని ఒక సినిమా ఉంది. అందులో అనవసరమైన రొమాన్స్ ఉన్నట్లు ఉంది. ఇలాంటివి వద్దు అని చెబుతున్నాను. వెంటనే జీవితగారు తన పాత సినిమాల్లో చేయలేదా? రేపు ఆమె కుమార్తెలు ఎవర్నీ ముట్టుకోరా? రాజశేఖర్ గారు ఎవరితోనూ రొమాన్స్ చేయలేదా? అంటే నేనిప్పుడు దాని గురించి మాట్లాడటంలేదు. రొమాన్స్, లవ్ సీన్స్ లేకుండా సినిమాలు తీయలేం. కానీ కావాలని అలాంటివి పెట్టొద్దన్నది నా అభిప్రాయం. ఇక 'కల్కి'లో 30 శాతం అంశాలు కొందరికి నచ్చలేదు. వాటినే పట్టుకుని రాయొద్దని కోరుకుంటున్నాను.


తాప్సీ

## త ప్లేస్‌లో తా?

మూడో రాజుగారి గదిలోకి ఇటీవల తమన్నా గృహప్రవేశం చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. అయితే తమన్నా ప్లేస్‌లోకి తాప్సీ రానున్నారని లేటెస్ట్ టాక్. ఓంకార్ దర్శకత్వంలో ఇటీవల 'రాజుగారి గది 3' మొదలైంది. ఈ చిత్రాన్ని ఓక్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. 'రాజుగారి గది 2' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ సినిమా స్క్రిప్ట్ పరంగా కొన్ని క్రియేటివ్ డిఫరెన్సెస్ వచ్చి తమన్నా తప్పుకున్నారట. దీంతో చిత్రబృందం తాప్సీతో సంప్రదింపులు జరుపుతున్నారన్నది తాజా సమాచారం.

# అలా అనుకోకపోతే పేరు మార్చుకుంటా

– రాజేంద్రప్రసాద్


రాజేంద్రప్రసాద్, మిథాలీ రాజ్, కేఎస్ రామారావు, భీమనేని శ్రీనివాసరావు, ఐశ్వర్యారాజేష్

''కౌసల్య కృష్ణమూర్తి' సినిమా చూసి బయటికి వెళ్లేటప్పుడు ఎవరైనా సరే.. మరీ ముఖ్యంగా ఆడపిల్లలు 'రాజేంద్రప్రసాద్ మా నాన్నగారు అయ్యుంటే బాగుండు' అనుకోకపోతే నా పేరు మార్చుకుంటాను'' అని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఐశ్వర్యారాజేశ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'కనా'. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఐశ్వర్యారాజేశ్‌తోనే 'కౌసల్య కృష్ణమూర్తి' పేరుతో తెలుగులో రీమేక్ చేశారు. భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. రాజేంద్రప్రసాద్, కార్తీక్ రాజు ముఖ్య పాత్రల్లో నటించారు. కేయస్ రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ నిర్మించారు. దిబు నినన్ థామస్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ వేడుకలో మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ –** ''అభిరుచి ఉన్న నిర్మాత ఎప్పటికీ సినిమాలు తీస్తూనే ఉంటారు. అభిరుచికి, డబ్బుకి సంబంధం లేదు. రామారావు గారు ఇప్పటికీ, ఎప్పటికీ సినిమాలు తీస్తూనే ఉంటారు. 'కౌసల్య కృష్ణమూర్తి' గొప్ప కథ. ఈ సినిమాలో కామెడీ, తండ్రీ కూతుళ్ల బంధం ఉంటుంది. భీమనేని శ్రీను నా నుంచి చాలా సున్నితమైన నటన రాబట్టుకున్నాడు'' అన్నారు.

**మిథాలీ రాజ్ మాట్లాడుతూ –** ''ఈ చిత్రం టీజర్ చూశాను.. వాస్తవానికి దగ్గరగా ఉంది. మంచి ఎమోషన్స్ ఉన్నాయి. తల్లిదండ్రులతో అమ్మాయిల రిలేషన్‌షిప్స్ ఎలా ఉంటాయి? అమ్మాయిల కలలకు తల్లిదండ్రులు ఎలా సపోర్టివ్‌గా నిలిచారు? అనే అంశాలను సినిమాలో చర్చించారు. ఇలాంటి చిత్రాల వల్ల ఉమెన్ క్రికెట్‌ను ప్రోత్సహించాలన్న విషయం మరింత మందికి చేరువ అవుతుంది. అబ్బాయిలతోపాటు అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచనకు ఈ సినిమా దోహదం చేస్తుందని ఆశిస్తున్నా'' అన్నారు. నిర్మాతల మండలి అధ్యక్షుడు, నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''మా రామారావు అన్నయ్య రీమేక్ చేసిన సినిమాలన్నీ హిట్లు, రికార్డులు బద్దలు కొట్టాయి. చిరంజీవిగారివంటి ఎందరో పెద్ద స్టార్స్‌తో సినిమాలు తీసినా, ఆయన తీసిన చిన్న సినిమాలే సెన్సేషన్ హిట్లు.. మైండ్ బ్లోయింగ్ కలెక్షన్లు తీసుకొచ్చాయి. ఈ సినిమా హిట్ కొడితే ఆయన కొడుకు వల్లభ సక్సెస్‌కి నాంది అవుతుంది'' అన్నారు.

**భీమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ–**''ఐశ్వర్య నటిస్తోందనిపించదు.. నటన ఆమెకు నల్లేరు మీద నడకలాంటిది. రాజేంద్రప్రసాద్ గారు, ఐశ్వర్య పోటీపడి మరీ నటించారు. రామానాయుడుగారిలాంటి టాప్ 10 నిర్మాతల్లో రామారావుగారు ఒకరు'' అన్నారు.

**ఐశ్వర్యారాజేష్ మాట్లాడుతూ –** ''కనా' నా జీవితాన్ని మార్చింది. తెలుగులో నా తొలి సినిమా 'కౌసల్య కృష్ణమూర్తి' కావడం అదృష్టం. రామారావుగారి ప్రొడక్షన్‌లో నా తొలి సినిమా ఉండటం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు.

**కె.ఎస్. రామారావు మాట్లాడుతూ–** ''ఈ సినిమా హక్కులు నాకు కావాలని ఐశ్వర్యను అడిగితే ఇప్పించింది. సావిత్రిగారు, శారదగారు.. ఇప్పుడు కీర్తీ సురేశ్, సమంత బాగా నటిస్తారు. వారికి ఏ మాత్రం తీసిపోకుండా నటించగలదు ఐశ్వర్య'' అన్నారు.

తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు, నిర్మాతలు పోకూరి బాబూరావు, కె. అశోక్ కుమార్, జి.విజయ రాజు, కార్తీక్ రాజు, నటుడు మహేశ్, డైరెక్టర్ క్రాంతిమాధవ్, 'కనా' చిత్ర దర్శకుడు, కథా రచయిత అరుణ్ రాజా కామరాజు, కెమెరామెన్ ఆండ్రూ, సంగీత దర్శకుడు దిబు నినన్ థామస్, నటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ఆమె వస్తోంది


అమలాపాల్

'నాయక్, ఇద్దరమ్మాయిలతో, జెండాపై కపిరాజు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన అమలాపాల్ నటించిన తొలి థ్రిల్లర్ మూవీ 'ఆడై'. రత్నకుమార్ దర్శకత్వంలో రాంబాబు కల్లూరి, ఎం. విజయ్ నిర్మించిన ఈ తమిళ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు హక్కులను దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సొంతం చేసుకున్నారు. 'ఆమె' పేరుతో చరిత్ర చిత్ర ప్రొడక్షన్స్ పతాకంపై ఆయన తెలుగులో విడుదల చేయనున్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''రత్నకుమార్ విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. అమలాపాల్ బోల్డ్ లుక్ కూడా సంచలనం సృష్టించింది'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఒ. ఫణీంద్ర కుమార్, సంగీతం: ప్రదీప్ కుమార్, ఊర్క, కెమెరా: విజయ్ కార్తీక్ ఖన్నన్, వీఎఫ్‌ఎక్స్ ప్రొడ్యూసర్: హరిహర సుతన్.

# ఇది సమష్టి విజయం - వివేక్ ఆత్రేయ



ప్రియదర్శి, శ్రీవిష్ణు, వివేక్ ఆత్రేయ, నివేదా థామస్..

''బ్రోచేవారెవరురా' సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో ప్రతి ఒక్కరూ బాగా చేశారు. ఇది మా టీమ్ సమష్టి కృషితో సాధించిన విజయం'' అన్నారు దర్శకుడు వివేక్ ఆత్రేయ. శ్రీవిష్ణు, నివేదా థామస్ ప్రధాన పాత్రల్లో వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. సత్యదేవ్, నివేతా పేతురాజ్, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ముఖ్య పాత్రల్లో నటించారు. విజయ్‌కుమార్ మన్యం నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ''సినిమాకి మంచి ఆదరణ లభిస్తోంది'' అని చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'థాంక్స్ మీట్'లో విజయ్‌కుమార్ మన్యం మాట్లాడుతూ –''మా సినిమా చూసి ప్రోత్సహించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. కేటీఆర్‌గారు, సురేశ్‌బాబుగారు, వెంకటేశ్‌గారు, నానిగారు, అనిల్ రావిపూడి, తరుణ్ భాస్కర్, రామ్.. ఇలా మా సినిమా గురించి మంచి మాటలు చెప్పిన అందరికీ థ్యాంక్స్. మంచి కలెక్షన్లు, మంచి ఓపెనింగ్స్ రావడానికి మంచి రివ్యూలు దోహదపడ్డాయి'' అన్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''మా సినిమా చూసి సురేష్‌బాబుగారు బావుందన్నారు. ప్రీ రిలీజ్‌కి రామ్‌గారు, రోహిత్‌గారు వచ్చారు. దానివల్ల అందరికీ రీచ్ అయింది. ముందు రోజు నానిగారు చూసి బావుందని చెప్పడంతో అందరూ థియేటర్లకు వచ్చి మెచ్చుకోవడం ఆనందంగా ఉంది'' అన్నారు.

# కాశ్మీరు జీవన నావ


● గుల్ గుల్షన్ గుల్ఫామ్




**భు**విపైన స్వర్గం కాశ్మీరం. మంచుదుప్పటి కప్పుకున్న లోయలు, పువ్వుల సోయగాలతో నిండిన లోయలు.. ఎటు చూసినా చేయి తిరిగిన చిత్రకారుడు అందంగా చిత్రించిన కాశ్మీరం గురించి ఎంత చెప్పినా తక్కువ. ఆ అందమైన కాశ్మీరంలో మూడు దశాబ్దాల క్రితం కొత్తగా ఊపిరి పోసుకుంది ఓ సీరియల్. పేరు గుల్ గుల్షన్ గుల్ఫామ్. కాశ్మీర్ పేరు వినగానే అప్పుడూ, ఇప్పుడూ ఎక్కడో ఓ చోట హింస చెలరేగుతూనే ఉండటం మన మనోఫలకం మీద నిలుస్తుంది. ఇది నాణేనికి ఒక వైపు. మరోవైపు.. అద్భుత ప్రకృతి సౌందర్యం, స్థానికుల సంప్రదాయబోటింగ్ విధానాలు, అక్కడి వారి జీవనం, సంస్కృతి.. ఎలా ఎన్నో కొత్త అంశాలను బుల్లితెర 28 ఏళ్ల క్రితం ప్రేక్షకుల కళ్లకు కట్టింది. 'గుల్ గుల్షన్ గుల్ఫామ్' అనే లోయ అందాన్ని, అక్కడి కీర్తిని 45 ఎపిసోడ్లలో చూపింది.





### హౌజ్‌బోట్లతో ఆదాయ వనరు

గుల్ గుల్షన్ గుల్ఫామ్ అనే లోయ దాల్ సరస్సు సరిహద్దులను దాటి వ్యాపించి ఉంటుంది. 1991లో తీసిన ఈ సీరియల్ మొత్తం కాశ్మీరీ కుటుంబం చుట్టూ తిరుగుతుంటుంది. హౌజ్‌బోట్ యజమాని మల్లా ఖాలిక్. అతని భార్య అజీజ్ దయాద్. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. మల్లాకు సొంతంగా మూడు పడవలు ఉంటాయి. వీరు 'గుల్ గుల్షన్ గల్ఫామ్' లోయలో కాపురం ఉంటారు. దాల్ సరస్సు వరకు వ్యాపించి ఉన్న ఈ లోయ నుంచి పర్యాటకులను దాల్ సరస్సు అవతలివైపుకు హౌజ్‌బోట్లలో తీసుకెళ్లి, తీసుకువస్తుంటారు. ఇదే వీరి ఆదాయ వనరు. ఈ సీరియల్‌లో ఉల్లాసమైన ఉదయాలు, సందడిగా సాగే సాయంత్రాలు.. ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. ఈ ధారావాహికలో కనిపించే హౌజ్‌బోట్ల వల్ల కాశ్మీరీల జీవితంలోని ఒక విలక్షణమైన అంశం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సరస్సులో ప్రయాణిస్తూ పర్యాటకులు ఛాయాచిత్రాలు తీస్తూనే ఉండటం దీంట్లో చూస్తాం. మల్లా తన వృత్తి ప్రవక్త నుండి నేరుగా తనకు ప్రసాదించిన వరంగా నమ్ముతాడు. మిగతా పడవదారులు కూడా అదే నమ్మకంతో జీవిస్తుంటారు. వారంతా సరస్సులో నీటిమట్టం పెరిగినప్పుడు పడవలను తేలుతూ ఉంచడానికి పడే ప్రయాసలు, డక్ షూటింగ్స్, జీవనోపాధి కోసం చేసే ఎన్నో పోరాటాలు ఇందులో చూడచ్చు. మల్లా ముగ్గురు కొడుకులు అనాదిగా వస్తున్న హౌజ్‌బోట్ల వనరును కాదని నగరానికి వలస వెళ్లాలనుకుంటారు. దీంతో మల్లా ప్రపంచం ఎలా తలకిందులవుతుందో ఈ సీరియల్‌లో చూపించారు. ఈ క్రమంలో తండ్రి పడే తపన, పిల్లల కలలు, వారి ఆకాంక్షలు ఈ సీరియల్‌లో ప్రతిఫలిస్తాయి.

'మల్లా ఖాలిక్ పెద్ద కుమారుడుగా నటించిన వినయ్ రైనా ఇక్కడి హంజీల గురించి తనకున్న అపోహలను దూరం చేసిందని ఓ సందర్భంలో చెప్పుకొచ్చాడు. 'నేను కొన్ని రోజులు హౌజ్‌బోట్లలో నివసించాను. ఈ యజమానుల జీవితం విలాసవంతమైనదని మొదట్లో అనుకునేవాడిని. కానీ, వారివి ఎంత కష్టతరమైన జీవితాల్లో ఈ సీరియల్‌లో నటించడం ద్వారా తెలుసుకున్నాను' అన్నారు.

### ఆటుపోట్ల పడవలు

ఎప్పుడు పడితే అప్పుడు దాడులకు దిగబడే మిలిటెంట్ల వల్ల ఈ ప్రాంతం ప్రజలు ఎదుర్కొనే ఆటుపోట్లను చూపింది ఈ సీరియల్. మిలిటెంట్ల ఆగడాల వల్ల పర్యాటకరంగం మీద ఆధారపడి జీవించేవారి జీవితాలు ఎలా తలకిందులు అయ్యాయనే దానిపై ఈ షో దృష్టిపెట్టింది. '1940ల చివరలో శ్రీనగర్‌లో చింక్రాల్ మొహల్లా నుండి రోజుకు రూపాయి చొప్పున ఒక చిన్న పడవను అద్దెకు తీసుకుని నడుపుతుంటాడు. అతడిని చూసినప్పుడు నాకీ ఆలోచన కలిగింది' అని రచయిత కిషోర్ తన అనుభవాలను తెలియజేశారు. 'నా చిన్నతనంలో స్నేహితులతో కలిసి మేరీ కెనాల్ గుండా తిరుగుతూ దాల్ సరస్సు నుంచి గాగ్రాబల్ చేరుకున్నాను. ఆ ప్రయాణంలోనే దాల్ సరస్సు నా మనస్సులో చెరగని ముద్రవేసింది. దీంతో అక్కడి నివాసులపై ఆసక్తి చూపాను. కాలేజీలో చేరినా పర్యాటకులను కలుస్తూ ఉండేవాడిని. నా సోదరుడు సరస్సులోని హౌజ్‌బోట్ యజమానులతో వ్యాపారం చేస్తుండేవాడు. ఇది నా ఆలోచనకు మరింత బలం చేకూర్చింది' అని తెలిపారు.

రచయిత ప్రాణ్‌కిషోర్ మొదట్లో హంజీ సమాజం గురించి ఒక నవల రాయడానికి బయల్దేరాడు. అదే ముందు టెలివిజన్ షోగా మారింది. 'గుల్ గుల్షన్ గల్ఫామ్' పేరుతో వచ్చిన ఈ సీరియల్ ఆ తర్వాత నవలగా విడుదల చేశారు. ప్రేమ్ క్రిషన్ మల్హోత్రా, సునీల్ మెహతా నడుపుతున్న ముంబై సంస్థ సినీవిస్టాస్ నిర్మించిన ఈ టీవీ సిరీస్ మొదట్లో 1989లో దాల్ సరస్సులోనూ, అక్కడి చుట్టుపక్కల చిత్రీకరించారు. ఈ సీరియల్ కాశ్మీరీ జీవితాన్ని ప్రామాణికమైన వివరాలతో చిత్రీకరించడానికి మొదటి ప్రయత్నం చేసింది. ఇది శాశ్వత ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 'అందుకే ఈ సిరీస్ దేశంలోని భావి తరాలకు ఒక టెలీ డిక్షనరీగా నిలుస్తుంది' అని చెప్పారు కిషోర్. నిజానికి ఈ సీరియల్ 90ల కాలంలో ఇళ్ల నుండి తరిమివేయబడిన కాశ్మీరీ పండిట్ల జీవనాన్ని చూపడానికి మొదలుపెట్టింది. అయితే, కాశ్మీరీల జీవనాన్ని చూపించాలనుకున్నప్పుడు వివాదం చెలరేగడంతో కథను హౌజ్‌బోట్ల యజమానుల ద్వారా చూపారు.

### కాపీ దోపిడీ

గుల్ గుల్షన్ గల్ఫామ్ సీరియల్ ఐరోపా, అమెరికా కేబుల్ నెట్‌వర్క్‌లలోనూ ప్రసారం చేయడంతో ఈ టెలీ షో ఇతర దేశాలలోనూ ప్రసిద్ధి పొందింది. 'ఈ సీరియల్ కాపీలు దొంగతనంగా ఇతర దేశాలకు దుబాయ్ ద్వారా వ్యాపించాయి. పాకిస్తాన్‌లోని ప్రతీ ఇంటిలో ఈ సీరియల్ టేపులు ఉన్నాయంటే కాపీ దోపిడీ ఎంతగా జరిగిందో గ్రహించవచ్చు..

### హిందూ-ముస్లిం

ఈ షో సక్సెస్ అయినందుకు రచయిత ప్రాన్ కిషోర్, దర్శకుడు వేద్ రాహి, ప్రేమ్ క్రిషన్ ఘనత వహించారు. కాశ్మీర్‌లోని షికారా యజమానుల జీవన విధానాన్ని దగ్గరగా చూసి తెలుసుకోవడానికి షెడ్యూల్‌కి ఇరవై రోజుల ముందే కాశ్మీర్ వెళ్లిందట ఈ బృందం. 'ఈ సిరీస్ నా జీవితంలోనే ఒక గొప్ప అనుభవాన్నిచ్చింది' అన్నారు పరీక్షిత్. కాశ్మీర్‌ను కొత్తగా పరిచయం చేసింది. షికారా యజమానుల భాషను అర్థం చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. అక్కణ్ణుంచి తిరిగి వచ్చేటప్పుడు చాలా బాధపడ్డాను. ఈ సిరీస్ 'ఆరోగ్యకరమైన మతసామరస్యాన్ని' ప్రోత్సహించింది. ముస్లిం, హిందూ వ్యక్తులు స్నేహితుల్లా ఉండేవారు. వారు కలిసి అన్ని పండుగలను ఆనందంగా జరుపుకునేవారు. కలిసి మెలిసి ఉన్నారు. అలాంటి వారు విడిపోవాల్సిన పరిస్థితులు తలెత్తినప్పుడు.. ఈ పాత్రను పోషించడంలో మనసుకు కష్టంగా అనిపించింది.. అంటూ నాటి అనుభవాలను చెప్పుకొచ్చారు పరీక్షిత్ సాహ్నీ.

### నటీ నటులు

నిర్మాత ప్రేమ్ క్రిషన్, సునిల్ మెహతా, దర్శకుడు వేద్ రాహి ఈ పాపులర్ సిరీస్‌ను 45 ఎపిసోడ్లలో రూపొందించారు. నటుడు పరీక్షిత్ సహ్నీ, రాధా సేత్, పంకజ్ బెర్రీ, విశాల్ సింగ్, ఉపేందర్ ఖుషు, బషీర్ దాదా.. మొదలైన వారు ఈ సిరీస్‌లో నటించారు. చాలా మంది స్థానిక నటులు కూడా ఈ షోలో పాల్గొన్నారు.

– ఎస్.ఆర్

### నిర్మాత ప్రేమ్ క్రిషన్ అనుభవాలు



'కాశ్మీర్ కేంద్రంగా ఒక టీవీ షో చేయాలన్నది మా తండ్రి ప్రేమంత్ (దివంగత నటుడు) కల. అప్పటికే దూరదర్శన్ భిన్నమైన కథనాల షోలను ప్రసారం చేయడానికి ఆసక్తి చూపుతోంది. దీంతో మేం, కాశ్మీర్‌లోనే సెట్ వేసుకున్నాం' అని తెలిపారు ప్రేమ్ క్రిషన్. అయితే, కాశ్మీర్‌లో పదిహేను ఎపిసోడ్స్ తీసిన తర్వాత వివాదాలు చెలరేగాయి. దీంతో తప్పనిసరిగా అక్కణ్ణుంచి ముంబయ్‌కి చేరుకున్నారు ఈ సీరియల్ టీమ్ అంతా. మిగతా ఎపిసోడ్స్ గోర్గావ్ ఫిల్మ్‌సిటీలో తీశారు. 'కాశ్మీర్‌లోనే అన్ని ఎపిసోడ్స్ తీయాలని ప్లాన్ చేసుకున్నాను. కానీ, ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు సృష్టించిన అవాంతరాల కారణంగా, తిరిగి వెనక్కి రావాల్సి వచ్చింది' అని తెలిపారు ప్రేమ్. షూటింగ్‌కి ముందే ప్రభుత్వ ఆమోదం కోసం స్క్రిప్ట్‌తో సహా అన్నిపత్రాలు సబ్‌మిట్ చేసినప్పటికీ స్థానిక దూరదర్శన్ స్టేషన్ డైరెక్టర్ లాసా కౌల్‌ను ఈ సీరియల్‌ను ఆపివేయాలని మిలిటెంట్ల కాల్పులు జరిపారు. నాడు షూటింగ్ కోసం ఉపయోగించిన మూడు హౌజ్‌బోట్లు ఇప్పటికీ దాల్ సరస్సుపై ప్రయాణిస్తూ కనిపిస్తాయి.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 3-7-2019

సీరియల్

# సోషల్ మీడియాలో ఫోటో చూసి ఎంపిక చేశారు



'కావాలని వెతకలేదు. వెతుక్కుంటూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వెలుతున్నాను. భవిష్యత్తు గురించిన కలలు లేవు. ఈ రోజే ఏం చేస్తున్నానో అదే భవిష్యత్తు' అంటూ చెప్పుకొచ్చింది 'కృష్ణవేణి' సీరియల్ హీరోయిన్ రక్ష. కట్టూ బొట్టులోనూ తెలుగింటి విరిబోణిలా ఆకట్టుకుంటున్న కన్నడ అమ్మాయి 'రక్ష' పంచుకుంటున్న కబుర్లు ఇవి...





### సీరియల్‌లో అవకాశం

నేనూ ముందు ఊహించలేదు. ఓ రోజు "నేను సీరియల్ డైరెక్టర్‌ని ..." అంటూ ఓ ఫోన్ కాల్ వచ్చింది. సోషల్‌మీడియాలో నా ఫొటోస్ చూసి సీరియల్‌కి ఎంపిక చేశానని చెప్పారు. ముందు నేను నమ్మలేదు. ఎంక్వైరీ చేశాను. వారిచ్చిన వివరాలన్నీ తెలుసుకొని అమ్మ–నేను వెళ్లాం. నిజమే, సీరియల్ యూనిట్ నుంచి వచ్చిన ఫోన్ అది. నాకు చాలా హ్యాపీగా అనిపించింది. అలా అక్కణ్ణుంచి కన్నడలో 'రాధా రమణ, పుట్‌మల్లి' సీరియల్స్ చేశాను. అక్కణ్ణుంచి తెలుగు 'స్టార్ మా'లో కృష్ణవేణి సీరియల్‌కి అవకాశం వచ్చింది. మంచి సబ్జెక్ట్. తల్లిని గొప్పగా చూసుకునే కూతురు, కూతురంటే వల్లమాలిన ప్రేమ ఉన్న తల్లి. థీమ్ నచ్చింది. అలా మీ ముందుకు వచ్చాను.

### సీరియల్ 'కృష్ణవేణి'..

తన పెళ్లి అయి అత్తారింటికి వెళ్లిపోతే.. తండ్రిలేని తల్లి ఒంటరిగా ఎలా బతుకుతుంది? అమ్మకో తోడు కావాలని ఆలోచించిన కూతురు తల్లికి మరో పెళ్లి చేసి ఆనందిస్తుంది. ఈ క్రమంలో తన వైవాహిక జీవితంలో అలజడులు చెలరేగుతాయి. భర్త నుంచి నిరాదరణ ఎదురవుతుంది. 'స్టార్ మా'లో వచ్చే 'కృష్ణవేణి' సీరియల్ కథ సింగిల్ మదర్ చుట్టూ నడుస్తుంది.





### రియల్ లైఫ్‌లో అమ్మ

మాది బెంగుళూరు. అక్కడే పుట్టి పెరిగాను. అమ్మ బెంగుళూరులోని క్యాన్సర్ హాస్పిటల్‌లో సీనియర్ స్టాఫ్ నర్స్. ఉద్యోగం, నేను తప్ప మరో ప్రపంచం లేదు అమ్మకు. నా గురించి ఏదైనా అమ్మ బెస్ట్‌గా ఆలోచిస్తుంది. నేనిక్కడ షూటింగ్‌లో ఉన్నా.. వెళ్లేసరికి అమ్మ నా కోసం ఏం కావాలో షాపింగ్ చేసి రెడీగా ఉంచుతుంది. నేను స్క్రీన్ మీద ఎలా కనిపిస్తున్నానో.. ఇంకా ఎలా ఉండాలో అమ్మకు బాగా తెలుసు. టైమ్‌కి తీసుకోవాల్సిన ఫుడ్ గురించైతే ఇక చెప్పనక్కర్లేదు.

### చదువు ... సీరియల్స్

నేను ప్రస్తుతం బిబిఎ మూడవ సంవత్సరం చదువుతున్నాను. షూటింగ్ ఉన్నప్పుడు మినహా మిగతా రోజులు కాలేజీ, స్నేహితులు, షాపింగ్, షికార్లతో టైమ్ స్పీడ్‌గా గడిచిపోతుంది. చదువు అంటే విపరీతమైన ఇష్టం. అయితే, ఉద్యోగం చేసే ఆలోచన లేదు. సీరియల్, సినిమా నటిగా ఇండస్ట్రీలోనే గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.





### నటనలో ఓనమాలు

అస్సలు తెలియవు. డైరెక్టర్‌గారు ఫోన్ చేసినప్పుడు 'నిజమేనా?' అనే అనుమానంతో స్టూడియోకి వెళ్లాను. కొన్ని సీన్స్ చెప్పారు. ఎలా నటించాలో చెప్పారు. అంతే..! కాకపోతే ఇప్పుడు నా సీనియర్స్ నటనను బాగా అబ్జర్వ్ చేస్తుంటాను. నా నటనలో మరింత బెటర్‌మెంట్ ఉండేలా చూసుకుంటాను. నా ఫ్రెండ్స్, బంధువులు.. నేను ఏ సీన్‌లో ఎలా నటిస్తున్నానో.. చెబుతూ మెచ్చుకుంటూ ఉంటారు. వారిచ్చిన సూచనలూ తీసుకుంటాను.

### పెళ్లి.. కలలు

ప్రస్తుతం నా దృష్టి అంతా నటన మీదే. ఏది ఎలా వస్తే జీవితాన్ని అలా ఆస్వాదించడం అలవాటు నాకు. అందుకే, రాబోయే వాడు ఇలాగే ఉండాలనే ఊహలు లేవు. కాకపోతే, నన్ను అర్థం చేసుకునేవాడు రావాలని కోరుకుంటున్నాను.

– నిర్మలారెడ్డి

పరి పరిశోధన

# బ్యాక్టీరియా బాగుంటే.. కేన్సరైనా పరార్!



**మీ**కు ఈ విషయం తెలుసా? మన శరీరంలో కణాల కంటే బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవుల సంఖ్యే ఎక్కువని! మీ బరువులో నాలుగైదు కిలోలు సూక్ష్మజీవులదేనని! ఇప్పుడు వీటి ప్రస్తావన ఎందుకూ? అంటే.. వందల వేల రకాల బ్యాక్టీరియా సరైన బ్యాలెన్స్‌లో ఉంటే.. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులనూ సమర్థంగా ఎదుర్కోవచ్చునని మెల్బోర్న్ శాస్త్రవేత్తలు గుర్తించారు కాబట్టి! ఆశ్చర్యంగా అనిపిస్తున్న ఈ సరికొత్త పరిశోధన వివరాలు ఇలా ఉన్నాయి. శరీరంలోని బ్యాక్టీరియా శరీర క్రియలను ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకునేందుకు మెల్బోర్న్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టారు. ఈ క్రమంలో బ్యాక్టీరియా రోగనిరోధక వ్యవస్థలోని టి–సెల్స్ అభివృద్ధిని ఎలా ప్రోత్సహిస్తోందో పరిశీలించారు. రోగకారక బ్యాక్టీరియా, వైరస్‌లను మొట్టమొదట గుర్తించి తగిన రక్షణ సర్యలు తీసుకునేది ఈ టి–సెల్స్. శరీరంలో బ్యాక్టీరియా లేని ఎలుకలతో పోల్చి చూసినప్పుడు ఈ టి–సెల్స్ మనుగడ సాగించలేకపోయినట్లు తెలిసింది. బాగా పీచుపదార్థమున్న ఆహారం తీసుకున్న ఎలుకల్లో మాత్రం ఈ బ్యాక్టీరియా విడుదల చేసే షార్ట్‌చెయిన్ ఫ్యాటీ ఆసిడ్ల కారణంగా టి–సెల్స్ బతకడంతోపాటు కేన్సర్ వంటి రోగాలను గుర్తించగలిగే సామర్థ్యాన్ని సంపాదించుకున్నట్లు తెలిసింది. ఈ షార్ట్ చెయిన్ ఫ్యాటీ ఆసిడ్లు వినాళ గ్రంథులతోపాటు ప్లీహంలోకి చొచ్చుకుపోయి టి–సెల్స్‌ను చైతన్య పరుస్తున్నాయని.. ఫలితంగా అవి రోగాలను గుర్తించడంలో చాలా చురుకుగా వ్యవహరిస్తున్నాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త బెడొయి తెలిపారు.

స్పెల్ కౌన్సెలింగ్

# బోరింగ్ ఫోన్ వచ్చేసింది



**పి**ల్లలు స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారని బాధపడుతున్నారా? గేమ్స్ ఆడేస్తూ టైమే తెలియట్లేదు... ఫోన్ మార్చేయాలని అనుకుంటున్నారా? అయితే మీ నిరీక్షణ ఫలించినట్లే ఎందుకంటే.. బోరింగ్‌ఫోన్ వచ్చేసింది మరి. ఏంటి దీని ప్రత్యేకత? చూసేద్దాం. ఒక్కమాటలో చెప్పాలంటే.. అత్యంత సింపుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది ఇది. షావోమీ ఏ1లో హంగులు ఆర్భాటాల్లేని ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించారు. స్క్రీన్ సైజు 5.5 అంగుళాలు కాగా.. ఈమెయిల్, ఇంటర్నెట్, సోషల్ మీడియాలు మాత్రం ఉండవు. ఇంకో విశేషం ఏమిటంటే.. నచ్చిన ఆప్‌లు డౌన్‌లోడ్ చేసుకుందామన్నాసరే.. ఇందులో ప్లే స్టోర్ కూడా ఏర్పాటు చేయలేదు. ఒక కెమెరా, ఎఫ్ఎం, ఎస్ఎంఎస్, మ్యాప్, పాడ్‌క్యాస్ట్ మేనేజర్, మ్యూజిక్ ప్లేయర్, ఇతర ఫోన్లు, కంప్యూటర్లతో సింక్ అయ్యేందుకు ఒక అప్లికేషన్, కాంటాక్ట్స్, కాలెండర్‌లు మాత్రమే ఉంటాయి దీంట్లో. కాలిక్యులేటర్, గ్యాలరీ, నోట్‌ప్యాడ్ టూల్, వాయిస్ రికార్డర్, టార్చ్‌లు వీటికి అదనం అన్నీ ఉచితంగా లభించే అప్లికేషన్లే. నోటిఫికేషన్లతో ఇబ్బందిపడకుండా ఉండే ఉద్దేశంతో తాము ఈ బోరింగ్ ఫోన్‌ను అభివృద్ధి చేసినట్లు కంపెనీ చెబుతోంది. బోరింగ్‌ఫోన్ మ్యాప్ అప్లికేషన్ ద్వారా గూగుల్ మ్యాప్‌లలో మాదిరిగా మనం ఎక్కడికి, ఎప్పుడు వెళ్లామన్న సమాచారం కంపెనీలకు చేరదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్



# ఇప్పుడు వెన్నెముక సర్జరీలోనూ ఎండోస్కోపిక్ పద్ధతులు!

నా వయసు 42 ఏళ్లు. గృహిణిని. కొద్దికాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాను. డాక్టర్‌ను కలిస్తే ఎక్స్‌రే, ఎమ్మారై చేయించుకోమన్నారు. వెన్నెముకలో ఏదో సమస్య ఉన్నందున మందులు వాడుతూ, ఫిజియోథెరపీ చేయించుకోవాల్సిందిగా సూచించారు. కొంతకాలం వాడినా నొప్పి తగ్గలేదు. ఇతర వైద్యవిధానాలను అనుసరించినా కూడా ప్రయోజనం కనిపించలేదు. దాంతో మళ్లీ ముందు డాక్టర్‌నే కలిస్తే మరికొంతకాలం పాటు మందులు వాడుతూ, ఫిజియోథెరపీ చేయించుకోమన్నారు. అప్పటికీ తగ్గకపోతే స్పైన్ సర్జరీ చేయించాల్సి రావచ్చని చెప్పారు. నాకు చాలా భయంగా ఉంది. వెన్ను సర్జరీ అంటే చాలా కాంప్లికేషన్స్ ఉంటాయనే ఆందోళన ఉంది. ఒక్కోసారి కాలో చెయ్యో పడిపోతాయని కొందరు చెప్పగా విన్నాను. దయచేసి నాకు స్పైన్ సర్జరీ గురించి వివరంగా చెప్పండి. వీటిలో ఆధునికమైన అడ్వాన్స్‌మెంట్‌లు ఉన్నాయా వివరించండి.

– ఎం. పద్మావతి, వైజాగ్

మనిషిని నిలువుగా నిలిపి ఉంచేదీ, ఆత్మవిశ్వాసానికీ, ఆరోగ్యానికీ ప్రతీకగా నిలిచేది వెన్నెముక. ఇది తనంతట తానే నడిచే (అటానమస్) నాడీమండల భాగం. ఇది చాలా కీలకమైనదే కాకుండా, అత్యంత సున్నితమైనది కూడా. దృఢమైన వెన్నుపూసలతో నిర్మితమైన ఈ ప్రధాన నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు కొన్నిసార్లు చాలా తీవ్రమైన బాధకు దారితీస్తాయి. ఈ సమస్యల పరిష్కారం కోసం కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్సలు అనివార్యం. వెన్నుకు చేసే శస్త్రచికిత్సలు సాధారణంగా ఓపెన్ సర్జరీలుగానే ఉంటూ వచ్చాయి. ఇలాంటి సర్జరీల్లో ఆపరేషన్ చేయాల్సిన ప్రాంతంలో సర్జన్ పెద్ద గాటు పెట్టి తెరిచి చూస్తూ శస్త్రచికిత్స చేస్తారు. అయితే ఇటీవలి కాలంలో ఈరంగంలో వచ్చిన పురోగతితో వెన్ను, మెడ ప్రాంతాల్లో అతి చిన్న గాటుతో ఎండోస్కోపిక్ విధానంలో శస్త్రచికిత్స చేస్తున్నారు.

ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలనే వీటిలో ఆపరేషన్ కోసం పెద్దగా కోత పెట్టాల్సిన అవసరం లేకపోవడం వల్ల వెన్ను చుట్టూరా ఉండే కండరాలకు నష్టం జరగకుండా చూడటం సాధ్యమవుతోంది.

సంప్రదాయ ఓపెన్ సర్జరీలో డాక్టర్లు 5 నుంచి 6 అంగుళాల మేర గాటు పెడతారు. వెన్నును చూడటానికి కండరాలను పక్కకు జరుపుతారు. అప్పుడు మాత్రమే వెన్నునొప్పికి కారణమైన భాగాన్ని సర్జన్‌లు చూడగలుగుతారు. వ్యాధిసోకిన, దెబ్బతిన్న ఎముకలను, వెన్నుపూసల మధ్య డిస్కులను తొలగించగలుగుతారు. సర్జరీ చేసిన ప్రాంతంలో శరీర అంతర్భాగాలను స్పష్టంగా చూసి స్క్రూలను, అవసరమైన ఇతరాలను పెట్టి వెన్నుపూసలను స్థిరీకరించి, తద్వారా రోగి కోలుకునేట్లు చేయగలుగుతారు. ఈ ఓపెన్ సర్జరీ కారణంగా తలెత్తే పెద్ద దుష్ప్రభావం ఏమిటంటే... కండరాలను పక్కకు లాగడం వల్ల వాటితో పాటు వాటికి అతికి ఉన్న మృదువైన కణజాలం కూడా దెబ్బతింటుంది. సర్జన్ పనికి అవసరమైన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో కణజాలం ప్రభావితమవుతుంది. దానివల్ల శరీర కండర కణజాలానికి తీవ్రమైన నష్టం జరుగుతుంటుంది. సర్జరీకి పూర్వం ఉన్నదానికంటే భిన్నమైన నొప్పి, బాధ వంటివి పేషెంట్ల అనుభవంలోకి వస్తాయి. వారు కోలుకోడానికి ఎక్కువ సమయం పడుతుంది.

ఇప్పుడు సర్జరీ వల్ల వెన్నుకూ, కండరాలతో సహా వెన్ను నిర్మాణానికి జరిగే నష్టాన్ని వీలైనంత కనీస స్థాయికి తగ్గించి విధంగా 'ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ'ని రూపొందించారు. వెన్నులో సమస్యకు కారణమవుతున్న భాగాన్ని సర్జన్ స్పష్టంగా చూసేందుకు వీలవుతుంది. చిన్నగాటు, అతి తక్కువ రక్తం నష్టం కావడం, వేగంగా కోలుకోగలగడం వంటి ప్రయోజనాలుంటాయి. సంప్రదాయ వెన్ను శస్త్రచికిత్సలతో పోలిస్తే కొన్ని ప్రత్యేక కేసులలో మినహాయించి ఇప్పుడీ తక్కువగాటుతోనే సాధ్యమయ్యే 'మినిమల్లీ ఇన్వేసివ్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ'లతో చాలా తక్కువ సమయంలోనే ఆపరేషన్ పూర్తవుతుంది.

ఫ్యూజన్ (ఎముకలు, నరాలను అతికించే ప్రక్రియ), డికంప్రెషన్ వంటి ప్రొసిజర్లను ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ పద్ధతిలో చేయడానికి స్పైన్ ఎండోస్కోపీ అనే పరికరాన్ని వాడతారు. ప్రొసిజర్ నిర్వహించాల్సిన ప్రదేశంలో ఆరు నుంచి ఎనిమిది మిల్లీమీటర్ల మేరకు మాత్రమే అతి చిన్న గాటు పెడతారు. అక్కడి నుంచి చర్మం, మృదుకణజాలం గుండా ఈ పరికరాన్ని వెన్ను చేరేదాకా లోపలికి ప్రవేశపెడతారు. ఈ ఏర్పాటుతో వెన్నులోని సమస్యాత్మక ప్రదేశం వద్దకు ఓ సన్నని కనెక్షన్ తయారవుతుంది. ప్రొసిజర్ పూర్తయ్యేవరకు ఇది శస్త్రచికిత్స జరిగే ప్రాంతంలోని కండరాలను పక్కకు జరిపి ఉంచుతుంది.

ఈ ఎండోస్కోపీ వల్ల ఏర్పడ్డ సన్నని కనెక్షన్ సహాయంతో శస్త్రచికిత్సకు సంబంధించిన పరికరాలను సర్జన్ లోపలికి ప్రవేశపెట్టగలుగుతారు. అవసరమైతే వెన్న వద్దకు ఒక ప్రోబ్‌ను పంపించడానికి వీలవుతుంది. వెన్ను నుంచి తొలగించాల్సిన ఎముక భాగాలు... ఈ గొట్టం లాంటి సన్నని కనెక్షన్ ద్వారానే బయటకు వస్తాయి.

ఫ్యూజన్ ప్రొసిజర్లలో వాడే స్క్రూలు, రాడల్లను కూడా దీని ద్వారానే లోపలికి తీసుకెళ్తారు. ఎండోస్కోపిక్ అండ్ ఫ్లోరోస్కోపీని ఉపయోగిస్తూ వెన్నుపై ఎక్కడ గాటు పెట్టాలో సర్జన్ నిర్ణయం తీసుకుంటారు. మరోవైపు నిరంతరాయంగా తీస్తూ ఉండే ఎక్స్–రే చిత్రాలు ఈ సర్జరీకి సాయపడుతుంటాయి. ప్రొసిజర్, శస్త్రచికిత్స అనంతరం ఎండోస్కోప్‌ను తొలగిస్తారు. దీంతో కండరాలు మళ్లీ తమ యథాస్థానానికి జరుగుతాయి. ఇది కండరాలకు జరిగే నష్టాన్ని అత్యంత కనీసస్థాయికి పరిమితం చేస్తుంది. సంప్రదాయ ఓపెన్ సర్జరీతో పోలిస్తే ఈ కండరాలకు జరిగే నష్టం చాలా తక్కువగా ఉంటుంది. పైగా ఓపెన్ సర్జరీలో సాధారణంగా జనరల్ అనస్థీషియా ఇస్తారు. ఇందువల్ల ప్రొసిజర్ పూర్తయ్యేవరకు పేషెంట్ నిద్రలోనే ఉంటారు. కానీ ఎండోస్కోపీ ప్రొసిజర్లో అవసరమైన చోటే (రీజియనల్) అనస్థీషియా ఇవ్వడం వల్ల పేషెంట్ స్పృహలోనే ఉన్నా శస్త్రచికిత్స చేస్తున్న చోట నొప్పి తెలియకుండా ఉంటుంది.

ఈ ఫుల్ ఎండోస్కోపీ ప్రొసిజర్ వల్ల పేషెంట్లు ఆసుపత్రిలో ఉండాల్సిన సమయం గణనీయంగా తగ్గుతుంది. ఇది సాధారణంగా రెండు, మూడు రోజులకు మించదు. కండరాలను చాలా తక్కువగా కదిలించడం వల్ల నొప్పి కూడా చాలా చాలా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అత్యాధునికమైన పెయిన్ మేనేజ్‌మెంట్ పద్ధతులు అందుబాటులోకి వచ్చినందున శస్త్రచికిత్స వల్ల కలిగే ఆ కొద్దిపాటి నొప్పిని కూడా తగ్గించేందుకు వీలుంది.



ఫ్యూజన్ ప్రొసిజర్ చేయించుకున్న తర్వాత ఎముక గట్టిబడేందుకు కొన్ని నెలల సమయం పడుతుంది. అయినప్పటికీ ఈలోగానే నొప్పి తగ్గి, పరిస్థితి మెరుగుపడుతుంది. కోలుకునే సమయంలో పేషెంట్ కదలికలు ఏవిధంగా ఉండాలి, కూర్చోవడం, నిల్చోవడం, నడవడంలో పాటించాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. ఒక వ్యక్తి ఎంత వేగంగా సాధారణ ఆరోగ్య పరిస్థితికి చేరుకోగలడనే అంశం అతడు చేయించుకున్న ప్రొసిజర్, శస్త్రచికిత్స సంక్లిష్టత, ఆ వ్యక్తి సాధారణ ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. అయితే రోగి త్వరగా కోలుకుని, బలం పుంజుకునేందుకు డాక్టర్లు ఫిజియోథెరపీని సూచించే అవకాశం కూడా ఉంది.

సంప్రదాయ శస్త్రచికిత్స చేయించుకున్న వారితో పోలిస్తే ఫుల్ ఎండోస్కోపిక్ పద్ధతిన సర్జరీ చేయించుకున్నవారు త్వరగా ఫిజియోథెరపీని చేపట్టేందుకు, ఇబ్బందిలేకుండా చేసేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి మీకు ఒకవేళ శస్త్రచికిత్స తప్పనిసరి అయితే మీరు ఎలాంటి భయాలు, ఆందోళనలు, పెట్టుకోకుండా ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీతో మెరుగైన ఫలితాలు పొందవచ్చు.



**డాక్టర్ సుకుమార్ సూర**
సీనియర్ స్పైన్ అండ్ న్యూరో సర్జన్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ,
హైదరాబాద్

# సాక్షి భవిత

స్పర్థయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

బుధవారం
3-7-2019





## కెరీర్ సాగుకు..

# వ్యవసాయ డిప్లొమాలు

రసాయన రహిత, సహజ సిద్ధమైన ఆహారం పట్ల ఆసక్తి పెరుగుతోంది. వ్యవసాయం, అనుబంధ రంగాల ప్రాధాన్యం రెట్టింపవుతోంది. మరోవైపు యువతరం పాడిపంటల రంగం వైపు మళ్లుతోంది. దాంతో వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీస్ విభాగాల్లోకి పెట్టుబడుల ప్రవాహం పెరుగుతోంది. ఫలితంగా అగ్రికల్చర్, డెయిరీ, హార్టికల్చర్(ఉద్యాన) కోర్సులకు డిమాండ్ నెలకొంది. పదో తరగతి అర్హతతోనే అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో చేరే వీలుంది. తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్ యూనివర్సిటీల్లో 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. వ్యవసాయ అనుబంధ డిప్లొమా కోర్సులు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం...

- పదో తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం
- స్వయం ఉపాధి, ఉద్యోగ సాధనకు మేలైన కోర్సులు
- తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న ప్రవేశ ప్రక్రియ

### ప్రవేశ ప్రక్రియ ఇలా

- అగ్రికల్చర్, దాని అనుబంధ డిప్లొమా కోర్సులు, అదే విధంగా హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్, ఫిషరీ సైన్స్, డెయిరీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశం పూర్తిగా పదో తరగతిలో చూపిన ప్రతిభ ఆధారంగానే ఉంటుంది. వచ్చిన దరఖాస్తుల్లో పదో తరగతి మార్కులను ప్రాతిపదికగా తీసుకొని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. మెరిట్ లిస్ట్‌లో నిలిచిన విద్యార్థులు ఆయా యూనివర్సిటీలు నిర్దేశిత తేదీల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- ఈ కోర్సుల ఎంపిక ప్రక్రియలో పూర్తిగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకే ప్రాధాన్యం ఉంటుంది. పదోతరగతి వరకు పదేళ్ల విద్యాభ్యాసంలో కనీసం నాలుగేళ్లపాటు గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదివి ఉండాలి.

## అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు

తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు(ఏఎన్‌జీఆర్‌ఏయూ-ఏపీ, పీజేటీఎస్‌ఏయూ -తెలంగాణ) రెండేళ్లు, మూడేళ్ల వ్యవధిలో అగ్రికల్చర్, అనుబంధ డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి. అగ్రికల్చర్ డిప్లొమా; విత్తన సాంకేతిక పరిజ్ఞానం (సీడ్ టెక్నాలజీ), సేంద్రీయ వ్యవసాయం(ఆర్గానిక్ ఫార్మింగ్), అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సు వ్యవధి మూడేళ్లు. కాగా, మిగతా మూడు డిప్లొమా కోర్సుల వ్యవధి రెండేళ్లు. వీటిల్లో చేరేందుకు అర్హత పదో తరగతి ఉత్తీర్ణత.

### ఈ కోర్సులతో ప్రయోజనాలు

- అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, న్యూట్రియంట్ పరిశ్రమల్లో ప్లాంట్ అసిస్టెంట్, టెక్నీషియన్ వంటి హోదాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రారంభంలోనే నెలకు రూ.15వేల వరకు వేతనం అందుకోవచ్చు.
- ఉన్నత విద్య పరంగా బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీల్లో చేరొచ్చు. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా విత్తన ఉత్పత్తి కేంద్రాలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఉన్నత హోదాలు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్రభుత్వ విభాగాల్లో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల్లోనూ అవకాశాలు లభిస్తాయి.

### ఆంధ్రప్రదేశ్‌లో..
### కోర్సులు, కళాశాలలు, సీట్ల వివరాలు

1) అగ్రికల్చర్ డిప్లొమా కోర్సు: ప్రభుత్వ అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్: 15; సీట్లు – 510
ప్రైవేటు అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్: 53; సీట్లు – 2420

2) విత్తన సాంకేతిక పరిజ్ఞానం(సీడ్ టెక్నాలజీ)
ప్రభుత్వ పాలిటెక్నిక్స్: 1 ; సీట్లు–25
ప్రైవేటు పాలిటెక్నిక్స్: 10 ; సీట్లు–440

3) సేంద్రీయ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్)
ప్రభుత్వ పాలిటెక్నిక్స్:1; సీట్లు– 25
ప్రైవేటు పాలిటెక్నిక్స్: 3; సీట్లు–120

4) అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ
ప్రభుత్వ పాలిటెక్నిక్స్: 2 ; సీట్లు–60
ప్రైవేటు పాలిటెక్నిక్స్:15 ; సీట్లు–450

- వీటి దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 4, 2019
- వెబ్‌సైట్: https://angrau.ac.in

### తెలంగాణలో..
### కోర్సులు, కళాశాలు, సీట్ల వివరాలు

1) అగ్రికల్చర్ డిప్లొమా కోర్సు:
ప్రభుత్వ అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్: 9; సీట్లు: 200
ప్రైవేటు అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్: 8; సీట్లు – 420

2) విత్తన సాంకేతిక పరిజ్ఞానం(సీడ్ టెక్నాలజీ)
ప్రభుత్వ పాలిటెక్నిక్స్: 1; సీట్లు: 20
ప్రైవేటు పాలిటెక్నిక్స్: 1; సీట్లు – 60

3) సేంద్రీయ వ్యవసాయం:
ప్రభుత్వ పాలిటెక్నిక్స్: లేవు
ప్రైవేటు పాలిటెక్నిక్స్: 1; సీట్లు–60

4) అగ్రికల్చర్ ఇంజనీరింగ్:
ప్రభుత్వ పాలిటెక్నిక్స్: 1; సీట్లు–20
ప్రైవేటు పాలిటెక్నిక్స్: 3; సీట్లు–90

- వీటి దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 4 ,2019
- వివరాలకు వెబ్‌సైట్: https://pjtsau.edu.in

## హార్టికల్చర్ డిప్లొమా కోర్సు



ఇటీవల కాలంలో ప్రాధాన్యం పెరుగుతున్న మరో విభాగం.. ఉద్యాన రంగం. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ఆసక్తి కారణంగా హార్టికల్చర్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. వీటికి అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సే.. హార్టికల్చర్ డిప్లొమా కోర్సు. ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. దీన్ని పూర్తి చేసుకోవడం ద్వారా నర్సరీలు, ఎకలాజికల్ పార్క్స్‌లో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్స్ (దసనాపూర్, రామగిరి ఖిల్లా)లో కలిపి అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 50.

- దరఖాస్తుకు చివరి తేదీ: జూలై, 25, 2019.
- వివరాలకు వెబ్‌సైట్: skltshu.ac.in
- ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్స్, ఏడు ప్రైవేటు పాలిటెక్నిక్స్‌లో హార్టికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు జూన్ 20తో ముగిసింది.

## వెటర్నరీ, ఫిషరీస్ డిప్లొమా

దేశంలో పౌల్ట్రీ, డెయిరీ రంగం విస్తరిస్తోంది. పౌల్ట్రీ ఫార్మ్స్, డెయిరీ ఫార్మ్స్‌లో పని చేసేందుకు నిపుణుల అవసరం ఏర్పడుతోంది. మరోవైపు పెంపుడు జంతువులను పెంచుకునే అలవాటు పెరుగుతోంది. దీంతో వెటర్నరీ సైన్స్ డిప్లొమా పూర్తి చేసుకున్న వారు మంచి అవకాశాలు అందుకోవచ్చు. వీరికి పౌల్ట్రీ ఫార్మ్స్, లైవ్ స్టాక్ ఫర్మ్స్, డెయిరీ ఫార్మ్స్‌లో.. లైవ్ స్టాక్ అసిస్టెంట్స్, ఫర్మ్ క్యూరేటర్ వంటి కొలువులు పొందొచ్చు. అదే విధంగా ఫిషరీస్ సైన్స్‌లో డిప్లొమా పూర్తి చేసిన వారికి ఆక్వాకల్చర్ ఫర్మ్స్, ఆక్వా సీడ్ ప్రొడక్షన్ సంస్థల్లో ప్లాంట్ ఆపరేటర్, క్యూరేటర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

### ఆంధ్రప్రదేశ్‌లో కాలేజీలు, సీట్లు

- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ప్రవేశాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ పరిధిలో ఏడు, ప్రైవేటు పరిధిలో 12 పాలిటెక్నిక్స్‌లో వెటర్నరీ డిప్లొమా కోర్సు అందుబాటులో ఉంది.



సీట్ల సంఖ్య ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో 210, ప్రైవేటు పాలిటెక్నిక్స్‌లో 600.

- ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్; ఎనిమిది ప్రైవేటు పాలిటెక్నిక్స్‌లో ఫిషరీ సైన్స్ డిప్లొమా కోర్సు అందుబాటులో ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 29సీట్లు, ప్రైవేటు పాలిటెక్నిక్స్‌లో 350 సీట్లలో ప్రవేశం కల్పిస్తున్నారు.

### బ్యాచిలర్ డిగ్రీ ప్రవేశాల్లో ప్రాధాన్యం

అగ్రికల్చర్, అనుబంధ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి, అదే విధంగా వెటర్నరీ సైన్స్, హార్టికల్చర్ డిప్లొమా పూర్తి చేసుకున్న వారికి బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల ప్రవేశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇందుకోసం వీరికి ప్రత్యేకంగా కొన్ని సీట్లు కేటాయిస్తారు. అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులు.. లేటరల్ ఎంట్రీ విధానంలో బీఎస్సీ అగ్రికల్చర్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు. అదే విధంగా అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులకు బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం లభిస్తుంది. ఇందుకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

## డెయిరీ డిప్లొమా



శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోనే డెయిర్ ప్రాసెసింగ్ డిప్లొమా కోర్సు కూడా ఉంది. కేవలం ఒక ప్రైవేటు కళాశాలలోనే ఈ కోర్సు ఉంది. ఇందులో సీట్ల సంఖ్య 50. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి డెయిరీ ఫార్మ్స్‌లో చిల్లింగ్ ఆపరేటర్స్, టెక్నీషియన్స్, ప్లాంట్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

- దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ: జూలై 12, 2019
- వివరాలకు వెబ్‌సైట్: https://svvu.edu.in

### తెలంగాణ రాష్ట్రం

తెలంగాణలో నాలుగు పాలిటెక్నిక్స్‌లో వెటర్నరీ డిప్లొమా కోర్సు అందుబాటులో ఉంది. పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ 110 సీట్లలో ప్రవేశం కల్పించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

- దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ: జూలై 10, 2019.
- వివరాలకు వెబ్‌సైట్: tsvu.nic.in




## ఆరోగ్యశ్రీ ట్రస్ట్

**ఖాళీలు 12**

గుంటూరు (ఏపీ)లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్–7, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (నాన్–టెక్నికల్)–3, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (టెక్నికల్)–2.
- **అర్హత:** పోస్టులను బట్టి ఎంబీబీఎస్, బీడీఎస్, సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **ఇంటర్వ్యూ తేదీ:** 2019, జులై 9, 10 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయి.
- **వేదిక:** డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్, చుట్టుగుంట, గుంటూరు.
- **దరఖాస్తు:** ఈ–మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** ww.ysraarogyasri.ap.gov.in

## సెయిల్-రూర్కెలా

**ఖాళీలు 205**

ఒడిశాలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)కి చెందిన రూర్కెలా స్టీల్ ప్లాంట్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 205 ఎగ్జిక్యూటివ్, నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎగ్జిక్యూటివ్ (డిప్యూటీ మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, జూనియర్ మేనేజర్)–26.
- **నాన్ ఎగ్జిక్యూటివ్:** (ఫైర్ సర్వీసెస్, బాయిలర్ ఆపరేటర్, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ), అటెండెంట్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ)–179.
- **అర్హత:** పోస్టులను బట్టి మెట్రిక్యులేషన్, సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం, శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** 2019, జులై 31 నాటికి పోస్టులను బట్టి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.500; అన్నీ ఆపరేటర్ పోస్టులకు రూ.250; మిగిలిన పోస్టులకు రూ.150. (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్–సర్వీస్‌మెన్ పోస్టులకు ఫీజు లేదు).
- **దరఖాస్తులు ప్రారంభం:** జులై 10, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 31, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.sailcareers.com

## డీసీసీబీ-శ్రీకాకుళం

**ఖాళీలు 71**

శ్రీకాకుళం జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ).. 71 స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టుల భర్తీకి జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల్లో 57 పోస్టులు ఓపెన్ విధానంలో భర్తీ చేస్తారు. మిగిలిన 14 పోస్టుల్లో డీసీసీబీ అనుబంధ సంస్థల్లో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇస్తారు.

- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ప్రొఫిషియన్సీ ఉండాలి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:** 2019, మార్చి 31 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీహెచ్‌సీలకు పదేళ్ల గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** 2019, ఆగస్టు నెలలో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఓసీ, బీసీలకు రూ.600; మిగిలిన వారికి రూ.350.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 8, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://dccb-srikakulam.org

## సీఎస్ఐఆర్-ఐఐసీటీ

**ఖాళీలు 19**

తార్నాక (హైదరాబాద్)లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ).. 19 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సైంటిస్ట్–13, సీనియర్ సైంటిస్ట్–4, ప్రిన్సిపల్ సైంటిస్ట్–2.
- **వయసు:** సైంటిస్టులకు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్టులకు 37 ఏళ్లు, ప్రిన్సిపల్ సైంటిస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 30, 2019.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** ఆగస్టు 14, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iictindia.org

## ఏఈఈఎస్

**ఖాళీలు 57**

ముంబైలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ (ఏఈఈఎస్).. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు/కళాశాలల్లో 57 టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. పీజీటీ–3
   సబ్జెక్టులు: హిందీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ.
2. టీజీటీ–21
   సబ్జెక్టులు: ఇంగ్లిష్, హిందీ/సంస్కృతం, మ్యాథమెటిక్స్/ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ, సోషల్ సైన్స్.
3. లైబ్రేరియన్–2;
4. స్పెషల్ ఎడ్యుకేటర్–1
5. పీఆర్‌టీ–30

- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, బీఎల్ఐఎస్సీ, లైబ్రరీ సైన్స్‌లో డిప్లొమా/డిగ్రీ, డీఈఎల్ఈడీ/డీఎడ్, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీలు:** 2019, ఆగస్టు 30, 31; సెప్టెంబర్ 1 తేదీల్లో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.750. (మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 20, 2019.
- **వెబ్‌సైట్:** www.aees.gov.in

## ప్రవేశాలు

### పీఎస్‌టీఐలో పీజీ డిప్లొమా ప్రవేశాలు

బెంగళూరులోని నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)కి చెందిన పవర్ సిస్టమ్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (పీఎస్‌టీఐ).. ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విభాగంలో పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్.
- **కాల వ్యవధి:** 26 వారాలు.
- **మొత్తం సీట్లు:** 60.
- **అర్హత:** బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ (బీఈ) లేదా ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ పవర్ ఇంజనీరింగ్‌లో తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **ఎంపిక:** గ్రాడ్యుయేషన్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ (దరఖాస్తును ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పూరించిన తర్వాత పోస్టులో పంపాలి).
- **దరఖాస్తు ఫీజు:** రూ.500. (డీడీ రూపంలో చెల్లించాలి).
- **చివరితేదీ:** జులై 19, 2019.
- **కౌన్సెలింగ్ తేదీలు:** 2019, జులై 29, 30, 31 తేదీల్లో ఉంటుంది.
- **కోర్సు ప్రారంభం:** ఆగస్టు 1, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nptibangalore.in

### ఐఐటీ-మండీలో ఎంఏ ప్రోగ్రామ్

హిమాచల్‌ప్రదేశ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)–మండీ 2019కి గాను ఎంఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** ఎంఏ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఏ/బీఎస్సీ ఇన్ ఎకనామిక్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, హిస్టరీ, పబ్లిక్ పాలసీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలు:** 2019, జులై 25, 26.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 8, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iitmandi.ac.in

**2** సచిన్ (రెండు సార్లు) తర్వాత ఒకే ప్రపంచకప్‌లో 500కు పైగా పరుగులు చేసిన రెండో భారత ఆటగాడు రోహిత్ శర్మ. సచిన్ 1996 (523 పరుగులు), 2003 (673 పరుగులు)లలో ఈ ఘనత సాధించాడు.

**2** కుమార సంగక్కర (2015లో) తర్వాత ఒకే ప్రపంచ కప్‌లో 4 సెంచరీలు చేసిన రెండో ఆటగాడు రోహిత్ శర్మ. గత ప్రపంచకప్‌లో బంగ్లాపై చేసిన సెంచరీతో కలిపి రోహిత్ చేసిన మొత్తం శతకాల సంఖ్య 5. సచిన్ మాత్రమే 6 సెంచరీలు సాధించాడు.

**26** రోహిత్ వన్డే సెంచరీల సంఖ్య. ఓవరాల్ జాబితాలో సచిన్ (49), కోహ్లి (41), పాంటింగ్ (30), జయసూర్య (28), ఆమ్లా (27) తర్వాత అతను ఆరో స్థానంలో ఉన్నాడు.

**230** వన్డేల్లో రోహిత్ సిక్సర్ల సంఖ్య. ధోని (228)ని అధిగమించగా... అఫ్రిది (351), గేల్ (326), జయసూర్య (270) మాత్రమే ముందున్నారు.

**1** ఒకే ప్రపంచ కప్‌లో 500కు పైగా పరుగులు చేసి కనీసం 10 వికెట్లు పడగొట్టిన తొలి ఆటగాడు షకీబ్ అల్ హసన్

# విజయం అదిరె...

## ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్

- 28 పరుగులతో బంగ్లాదేశ్‌పై విజయం
- సెంచరీతో చెలరేగిన రోహిత్
- రాణించిన బౌలర్లు

**ఈ ప్రపంచకప్‌లో రోహిత్ జోరు, భారత్ స్కోర్లను చూస్తుంటే ఇక టీమిండియాకు తిరుగులేదనే అనిపిస్తుంది. తాజాగా బంగ్లా పనిపట్టింది. చక్కగా సెమీఫైనల్ చేరింది. ఈ టోర్నీలో మేటి జట్లకు దీటుగా రాణిస్తున్న బంగ్లాదేశ్ ఆట లీగ్ దశలోనే ముగిసింది. ఇక కోహ్లి సేన లక్ష్యం అగ్రస్థానంలో నిలవడమే! ఆఖరి మ్యాచ్‌లో లంకను ఓడిస్తే సెమీస్ పరీక్షను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవచ్చని భావిస్తోంది.**


రాహుల్

**బర్మింగ్‌హామ్:** ఒక్క పరాజయం ఎదురైందో లేదో వెంటనే టీమిండియా పుంజుకుంది. బంగ్లాదేశ్‌పై అదరగొట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. సగర్వంగా భారత్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. ఈ మెగా ఈవెంట్‌లో 'హిట్‌మ్యాన్' రోహిత్ (92 బంతుల్లో 104; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మళ్లీ సెంచరీతో చెలరేగాడు. కేఎల్ రాహుల్ (92 బంతుల్లో 77; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ముస్తఫిజుర్ రహ్మాన్‌కు 5 వికెట్లు దక్కాయి. తర్వాత కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 48 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. షకీబ్ (74 బంతుల్లో 66; 6 ఫోర్లు), సైఫుద్దీన్ (38 బంతుల్లో 51 నాటౌట్; 9 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో బుమ్రా 4 వికెట్లు తీశాడు. రోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్లు రెండేసి మార్పులతో బరిలోకి దిగాయి. టీమిండియా తరఫున కుల్దీప్, కేదార్ స్థానాల్లో భువనేశ్వర్, దినేశ్ కార్తీక్ బరిలోకి దిగారు. రుబెల్ హొస్సేన్, షబ్బీర్ రహ్మాన్ బంగ్లా తుదిజట్టులోకి వచ్చారు.

### సూపర్ హిట్ జోడి...

ధావన్ గాయపడగానే భారత్‌కు పెద్ద దెబ్బనుకున్నాం. కానీ ఆ లోటు మాత్రం లేనేలేదు. రాహుల్, రోహిత్‌లిద్దరు కీలకమైన మ్యాచ్‌ల్లో శుభారంభాలిస్తున్నారు. ఈ మ్యాచ్‌లోనూ అదే చేశారు. టాస్ నెగ్గగానే కోహ్లి బ్యాటింగ్‌కే ఓటేశాడు. ఆ వెంటే రాహుల్, రోహిత్‌ల జోడి బలమైన భాగస్వామ్యానికి ధాటిగా పునాదులు వేశారు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఫోర్లు, సిక్సర్లు అవలీలగా బాదుతుంటే స్కోరు జోరందుకుంది. తొలి 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 69 పరుగులు చేసిన భారత ఓపెనర్లు భారీ భాగస్వామ్యాన్ని నెలకొలిపే పనిలో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. రోహిత్ 45 బంతుల్లో, రాహుల్ 57 బంతుల్లో ఫిఫ్టీలు చేశారు. చేతిలో ఉన్న బౌలింగ్ వనరులన్నీ ఉపయోగించినా... 20 ఓవర్లు పూర్తయినా... ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయిన బంగ్లా బౌలర్లు మరింత నీరసించారు.

### రోహిత్ శతకం

బంగ్లా బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారిన రోహిత్... వీలుచిక్కితే సిక్స్, కుదిరితే బౌండరీలుగా బాదుతుంటే స్కోరు అమాంతం పెరుగుతూ పోయింది. 23.1 ఓవర్లోనే భారత్ స్కోరు 150కి చేరింది. రోహిత్ 90 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ టోర్నీలో అతనికిది నాలుగో సెంచరీ కావడం విశేషం. పైగా 29వ ఓవర్లోనే సెంచరీ కొట్టడంతో అభిమానులు డబుల్ సెంచరీకి అవకాశముందనుకున్నారు. అందుకేనేమో 30వ ఓవర్లో అతను ఔట్ కాగానే భారత ప్రేక్షకులు తీవ్రంగా నిరాశచెందారు. సౌమ్య సర్కార్ బౌలింగ్‌లో రోహిత్ వెనుదిరగడంతో 180 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. స్వల్పవ్యవధిలో రాహుల్‌ను రుబెల్ పెవిలియన్ చేర్చాడు.

### ముస్తఫిజుర్ దెబ్బ...

భారత్ జోరు, స్కోరు చూస్తే 350 పైచిలుకు గ్యారంటీ అనే అనుకున్నారంతా కానీ ముస్తఫిజుర్ బౌలింగ్ నైపుణ్యం భారత బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేసింది. ఓపెనర్లు ఔటయ్యాక కెప్టెన్ కోహ్లి, రిషభ్ పంత్ స్కోరు పెంచే బాధ్యతను తీసుకున్నారు. ఈ దశలో ఇన్నింగ్స్ 39వ ఓవర్ వేసిన ముస్తఫిజుర్... కోహ్లి (26), హార్దిక్ పాండ్యా (0)లను ఔట్ చేయడంతో స్కోరు వేగం మందగించింది. ధాటిగా ఆడుతున్న పంత్ (41 బంతుల్లో 48; 6 ఫోర్లు, 1 సిక్స్)ను షకీబ్ పెవిలియన్ చేర్చగా, మిగతా బ్యాట్స్‌మెన్ దినేశ్ కార్తీక్ (8), భువనేశ్వర్ (2), షమీ (1) తేలిపోయారు. ధోని (33 బంతుల్లో 35; 4 ఫోర్లు) ఆఖరి ఓవర్‌దాకా ఉన్నా మళ్లీ విమర్శలపాలయ్యే ఆటే ఆడాడు. ఆఖరి 10 ఓవర్లలో కేవలం 63 పరుగులే చేసిన భారత్ 5 వికెట్లను కోల్పోయింది.

### 9 పరుగుల వద్ద బతికిపోయి...

రోహిత్ పరుగుల ఖాతా సిక్సర్‌తో మొదలైంది. అలా మొదలైన ఇన్నింగ్స్ 9 పరుగుల వద్దే ముగియాల్సింది. దురదృష్టం తమీమ్ చేతుల్లోంచి జారితే... అదృష్టం రోహిత్ బ్యాట్‌ను తాకింది. తమీమ్ క్యాచ్ మిస్ చేయడం. తదనంతరం అతను మూడంకెల స్కోరు దాకా చెలరేగడం జరిగిపోయాయి. తొలిఓవర్లోనే స్క్వేర్ లెగ్‌లో సిక్స్ కొట్టాడు రోహిత్. ఐదో ఓవర్‌ను ముస్తఫిజుర్ వేసే సమయానికి మరో మూడే పరుగులు జతచేశాడు. నాలుగో బంతిని డీప్ స్కేర్ లెగ్‌లో గాల్లోకి లేపాడు. తమీమ్ సునాయాస క్యాచ్‌ను నేలపాలు చేయడంతో బతికిపోయిన హిట్‌మ్యాన్ శతక్కొట్టాడు. ఈ టోర్నీలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లపై సాధించిన సెంచరీలు కూడా క్యాచ్ మిస్‌అయ్యాకే సాధించాడు.

### షకీబ్ మరో అర్ధసెంచరీ...

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌కు పదో ఓవర్ నుంచి కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్‌ల జోరు లేకపోయినా... క్రీజులో పాతుకుపోతున్న దశలో షమీ తొలిదెబ్బ తీశాడు. తమీమ్ (22)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో సర్కార్‌కు సూపర్ ఫామ్‌లో ఉన్న షకీబ్ అల్ హసన్ జతయ్యాడు. 12వ ఓవర్లో జట్టు 50 పరుగులను అధిగమించింది. 16వ ఓవర్ వేసిన హార్దిక్... సర్కార్ (38 బంతుల్లో 33; 4 ఫోర్లు)ను ఔట్ చేయడంతో 74 పరుగుల వద్ద రెండో వికెట్ కూలింది. అనంతరం షకీబ్, ముష్ఫికర్ జట్టు స్కోరును వందకు చేర్చారు. మూడో వికెట్‌కు 47 పరుగులు జతయ్యాయో లేదో ముష్ఫికర్ (23 బంతుల్లో 24, 3 ఫోర్లు)ను చహల్ ఔట్ చేశాడు. ఇలా భారత బౌలర్లు ప్రత్యర్థి జట్టు బలమైన భాగస్వామ్యాలు నమోదు చేయకుండా తలా ఒక చెయ్యివేశారు. 30వ ఓవర్లో పాండ్యా బౌలింగ్‌లో లిటన్ దాస్ (24 బంతుల్లో 22; 1 సిక్స్) ఔట్ కావడంతో బంగ్లా ఆశలు ఆవిరయ్యాయి. 58 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న షకీబ్ ఆ తర్వాత ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. మొసద్దిక్, షకీబ్ వరుస ఓవర్లలో నిష్క్రమించడంతో 179 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. టెయిలెండర్లు షబ్బీర్ (36 బంతు ల్లో 36; 5 ఫోర్లు), సైపుద్దీన్ కాసేపు పోరాడినప్పటికీ లక్ష్యానికి అవేమాత్రం సరిపోలేదు. ఒకే ఓవర్లో రుబెల్ (9), ముస్తఫిజుర్ (0)లను బౌల్డ్ చేసిన బుమ్రా బంగ్లా ఇన్నింగ్స్‌ను ముగించాడు.


ముస్తఫిజుర్ (5/59)

### ఔటెందుకివ్వరు



భారత కెప్టెన్ కోహ్లి ఫీల్డు అంపైర్లతో వాదనకు దిగాడు. సౌమ్య సర్కార్ ఎల్బీడబ్ల్యూ అప్పీల్‌ను ఔటెందుకు ఇవ్వరని తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. షమీ వేసిన ఇన్నింగ్స్ 12 ఓవర్లో బంతి సర్కార్ ప్యాడ్లను తాకింది. వెంటనే భారత ఆటగాళ్లంతా గట్టిగా అప్పీల్ చేసినా ఫీల్డ్ అంపైర్ ఎరాస్మస్ తిరస్కరించాడు. దీనిపై ఆలస్యంగా... అసహనంతో డీఆర్ఎస్‌కు వెళ్లాడు. పలు మార్లు రీప్లే చూశాక నాటౌట్ అని ప్రకటించారు. అయితే గత మ్యాచ్‌లో రోహిత్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురైనపుడు ఔటిచ్చారు కదాని కాస్త గట్టిగానే వాదించాడు.



### 87 ఏళ్ల అభిమానం!

భారత్, బంగ్లా మధ్య మ్యాచ్‌లో ఒక వృద్ధ మహిళా అభిమాని ఉత్సాహం అందరినీ ఆకర్షించింది. 87 ఏళ్ల ఆమె పేరు చారులత పటేల్. భారత్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో చిన్నపిల్లలకు ఏమాత్రం తగ్గకుండా బూర ఊదుతూ ఆమె చూపించిన జోష్‌కు అటు ఆటగాళ్లు, ఇటు కామెంటేటర్లు ఫిదా అయ్యారు. 1983లో కపిల్ డెవిల్స్ లార్డ్స్‌లో ప్రపంచ కప్ గెలిచినప్పుడు అక్కడే ఉన్నానని చెప్పిన 'ఫ్యాన్ ఆఫ్ ద డే'...మ్యాచ్ తర్వాత తన వద్దకు అభిమానంతో వచ్చిన కోహ్లి, రోహిత్‌లపై ఆప్యాయత కురిపిస్తూ భారత్ మళ్లీ టైటిల్ గెలుస్తుందని నమ్మకం వ్యక్తం చేసింది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రాహుల్ (సి) ముష్ఫికర్ (బి) రుబెల్ 77; రోహిత్ (సి) లిటన్ దాస్ (బి) సర్కార్ 104; కోహ్లి (సి) రుబెల్ (బి) ముస్తఫిజుర్ 26; రిషభ్ (సి) మొసద్దిక్ (బి) షకీబ్ 48; హార్దిక్ (సి) సర్కార్ (బి) ముస్తఫిజుర్ 0; ధోని (సి) షకీబ్ (బి) ముస్తఫిజుర్ 35; దినేశ్ కార్తీక్ (సి) మొసద్దిక్ (బి) ముస్తఫిజుర్ 8; భువనేశ్వర్ రనౌట్ 2; షమీ (బి) ముస్తఫిజుర్ 1; బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 314.**
**వికెట్ల పతనం:** 1-180, 2-195, 3-237, 4-237, 5-277, 6-298, 7-311, 8-314, 9-314. **బౌలింగ్:** మొర్తజా 5-0-36-0, సైఫుద్దీన్ 7-0-59-0, ముస్తఫిజుర్ 10-1-59-5, షకీబ్ 10-0-41-1, మొసద్దిక్ 4-0-32-0, రుబెల్ 8-0-48-1, సౌమ్య సర్కార్ 6-0-33-1.

**బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తమీమ్ (బి) షమీ 22; సర్కార్ (సి) కోహ్లి (బి) హార్దిక్ 33; షకీబ్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హార్దిక్ 66; ముష్ఫికర్ (సి) షమీ (బి) చహల్ 24; లిటన్ దాస్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హార్దిక్ 22; మొసద్దిక్ (బి) బుమ్రా 3; షబ్బీర్ (బి) బుమ్రా 36; సైపుద్దీన్ నాటౌట్ 51; మొర్తజా (సి) ధోని (బి) భువనేశ్వర్ 8; రుబెల్ (బి) బుమ్రా 9; ముస్తఫిజుర్ (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం ( 48 ఓవర్లలో ఆలౌట్) 286.**
**వికెట్ల పతనం:** 1-39, 2-74, 3-121, 4-162, 5-173, 6-179, 7-245, 8-257, 9-286, 10-286. **బౌలింగ్:** భువనేశ్వర్ 9-0-51-1, బుమ్రా 10-1-55-4, షమీ 9-0-68-1, చహల్ 10-0-50-1, హార్దిక్ 10-0-60-3.

# సెమీ ఫైనల్ రేసులో...

- నేడు న్యూజిలాండ్‌తో ఇంగ్లండ్ కీలక పోరు
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో ప్రత్యక్షప్రసారం


విలియమ్సన్


మోర్గాన్

**చెస్టర్ లీ స్ట్రీట్:** ప్రపంచ కప్ ఆతిథ్య జట్టు, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధించేందుకు తమ చివరి మ్యాచ్ వరకు శ్రమించాల్సిన పరిస్థితి! ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా సెమీస్ చోటు దక్కించుకునే ప్రయత్నంలో మోర్గాన్ సేన నేడు (బుధవారం) జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. భారత్‌పై విజయంతో కోలుకున్న ఇంగ్లండ్... ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే 12 పాయింట్లతో సెమీస్ చేరుకుంటుంది. ఒక వేళ ఓడితే మాత్రం పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. మరో వైపు గత మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో ఓడిన న్యూజిలాండ్ కూడా విజయం సాధించి దర్జాగా ముందంజ వేయాలని కోరుకుంటోంది. ఇంగ్లండ్ బ్యాటింగ్ ఒక్కసారిగా ఫామ్‌లోకి రాగా... కివీస్ ప్రధానంగా విలియమ్సన్, టేలర్‌లపైనే ఆధార పడుతోంది. 2015 ప్రపంచకప్‌లో ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లో ఇంగ్లండ్ 123 పరుగులకే కుప్పకూలగా కివీస్ 12.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. దానికి సొంతగడ్డపై ప్రతీకారం తీర్చుకోవాలని కూడా ఇంగ్లండ్ భావిస్తోంది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | 1.000 | 14 |
| భారత్ | 8 | 6 | 1 | 1 | 0.811 | 13 |
| న్యూజిలాండ్ | 8 | 5 | 2 | 1 | 0.572 | 11 |
| ఇంగ్లండ్ | 8 | 5 | 3 | 0 | 1.000 | 10 |
| పాకిస్తాన్ | 8 | 4 | 3 | 1 | -0.792 | 9 |
| శ్రీలంక | 8 | 3 | 3 | 2 | -0.934 | 8 |
| బంగ్లాదేశ్ | 8 | 3 | 4 | 1 | -0.195 | 7 |
| దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.080 | 5 |
| వెస్టిండీస్ | 8 | 1 | 6 | 1 | -0.335 | 3 |
| అఫ్గానిస్తాన్ | 8 | 0 | 8 | 0 | -1.418 | 0 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

### పాక్ చేతిలో ఓటమి

**దోహా:** డిఫెండింగ్ చాంపియన్ భారత్ తన స్నూకర్ వరల్డ్ కప్ టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయింది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పంకజ్ అద్వానీ-లక్ష్మణ్ రావత్ సభ్యులుగా ఉన్న భారత జట్టు 1-3తో పాకిస్తాన్ చేతిలో ఓడి రన్నరప్ స్థానంతో సరిపెట్టుకుంది.

# తొలి సెట్ కోల్పోయినా..

- రెండో రౌండ్ చేరిన ఫెడరర్
- బార్టీ, సెరెనా, నాదల్ ముందంజ
- వింబుల్డన్ టోర్నీ



**లండన్:** సంచలన ఫలితాలతో మొదలైన వింబుల్డన్ రెండో రోజు కూడా అలానే కొనసాగుతుందా అనే రీతిలో సాగింది. 9వ టైటిల్‌పై కన్నేసిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ మ్యాచే దీనికి కారణం. తన కెరీర్‌లోనే మొదటిసారి వింబుల్డన్ ఆడుతోన్న దక్షిణాఫ్రికాకు చెందిన 22 ఏళ్ల లాయిడ్ హారీస్ చేతిలో కేవలం 28 నిమిషాల్లోనే మొదటి సెట్‌ను ఫెడరర్ కోల్పోయాడు. దీంతో రెండో రోజు కూడా అతి పెద్ద సంచలనం నమోదవుతుందేమోనని అందరూ అనుకున్నారు. అయితే రెండో సెట్ నుంచి తన అసలైన గ్రాస్ కోర్టు ఆటను హారీస్‌కు చూపిస్తూ వరుసగా మూడు సెట్లను గెలిచిన ఫెడరర్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 6-3, 1-6, 2-6, 2-6తో హారిస్‌ను ఓడించాడు.

### నాదల్ విజయం

రెండు సార్లు వింబుల్డన్ విజేత స్పెయిన్ బుల్ నాదల్ 6-3, 6-1, 6-3తో సుగిటా(జపాన్)పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకోగా...సెరెనా విలియమ్స్ 6-2, 7-5తో గులియా గుట్టో(ఇటలీ)ను ఓడించి ముందంజ వేసింది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్, ఐదో సీడ్ ఆస్ట్రియా ఆటగాడు డొమినిక్ థీమ్ తొలి రౌండ్‌లోనే తన కథను ముగించాడు. అమెరికా అన్‌సీడెడ్ ఆటగాడు కొరి చేతిలో 7-6, 6-7, 3-6, 0-6 చేతిలో ఓటమి చెందాడు. మహిళల మొదటి రౌండ్ మ్యాచ్‌లో షరపోవా(రష్యా) గాయం కారణంగా ఆట మధ్యలోనే వైదొలిగింది. పౌలిన్ పరమెన్‌టైర్(ఫ్రాన్స్)తో జరిగిన మ్యాచ్‌లో ఇరువురు చెరో సెట్‌ను గెలిచారు. నిర్ణయాత్మక మూడో సెట్‌లో 0-5తో వెనుకబడిన సమయంలో షరపోవా మణికట్టు గాయంతో తప్పుకుంది.

### బార్టీ అలవోకగా..

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ విజేత ప్రస్తుత నంబర్ 1 క్రీడాకారిణి యాష్లే బార్టీ తొలి రౌండ్‌లో 6-4, 6-2తో జెంగ్(చైనా)పై విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇతర మ్యాచ్‌లలో డిఫెండింగ్ చాంపియన్ కెర్బర్(జర్మనీ) 6-4, 6-3తో తన దేశానికే చెందిన మరియాపై, 2017 యూఎస్ ఓపెన్ విన్నర్ స్లోన్ స్టీఫెన్(అమెరికా) 6-2, 6-4తో టిమియా బాసిన్‌స్కీపై గెలుపొందారు.




MUTUAL FUNDS నిజమే మరి
మ్యూచువల్ ఫండ్స్ మీకోసం ఎలా నిజమైనవో, తెలుసుకునేందుకై సందర్శించండి: mutualfundssahihai.com
మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌కి లోబడి ఉంటాయి, స్కీముకు సంబంధించిన దస్తావేజులన్నింటినీ జాగ్రత్తగా చదవండి.

# సాక్షి బిజినెస్

బుధవారం
3-7-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 130 ▲ | 45 ▲ |
| 39,816 | 11,910 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తెలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,075 | ▽ 17 |
| డోజోన్స్ | 26,689 | ▽ 27 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,560 | ▲ 62 |
| డాక్స్ | 12,527 | ▲ 5 |
| షాంఘై | 3,044 | ▽ 1 |
| నికాయ్ | 21,754 | ▲ 24 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ధాముకుకి | 67.37 | 79.98 |
| £ | బ్రిటన్ పౌండ్ | ధాముకుకి | 85.07 | 90.00 |
| € | యూరో | ధాముకుకి | 76.07 | 80.52 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ధాముకుకి | 60.00 | 67.00 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్ | ధాముకుకి | 47.02 | 50.10 |
| S$ | సింగపూర్ డాలర్ | ధాముకుకి | 49.67 | 52.75 |
| SAR | సౌదీ రియాల్ | ధాముకుకి | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ధాముకుకి | 18.08 | 19.59 |
| ¥ | చైనా యువాన్ | ధాముకుకి | 9.40 | 10.76 |



# నీరవ్ మోదీకి సింగపూర్ హైకోర్టు షాక్..!

**కుటుంబ సభ్యుల ఖాతాల స్తంభనకు ఆదేశం**

**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ని మోసగించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త నీరవ్ మోదీ కుటుంబసభ్యులకు చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయాలంటూ సింగపూర్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీటి ప్రకారం నీరవ్ మోదీ సోదరి పుర్వి మోదీ, బావ మయాంక్ మెహతాల ఖాతాలను అక్కడి బ్యాంకులు స్తంభింపచేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వెల్లడించింది. ఈ అకౌంట్స్‌లో సుమారు 6.122 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 44.41 కోట్లు) ఉన్నట్లు పేర్కొంది. బ్యాంకులను మోసం చేయడం ద్వారా వచ్చిన సొత్తులో ఇది కూడా భాగమేనని, దీన్ని నిందితులు విత్‌డ్రా చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడంతో న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు ఈడీ వెల్లడించింది. ఇప్పటికే నీరవ్ మోదీకి స్విస్ బ్యాంకుల్లో ఉన్న నాలుగు ఖాతాలను అక్కడి బ్యాంకులు స్తంభింపచేశాయి. వీటిలో దాదాపు రూ. 283 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. పీఎన్‌బీని నీరవ్ మోదీ దాదాపు రూ. 14,000 కోట్ల మేర మోసం చేసి, విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసును ఈడీ, సీబీఐ తదితర ఏజెన్సీలు విచారణ జరుపుతున్నాయి.






# రీఫైనాన్స్ సదుపాయం కల్పించండి

**కేంద్రం, ఆర్‌బీఐకి ఎన్‌బీఎఫ్‌సీల విన్నపం**



**ముంబై:** నిధుల కొరతతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) తమకు ముద్రా స్కీము కింద రీఫైనాన్స్ సదుపాయాన్ని కల్పించాలంటూ కేంద్రాన్ని కోరాయి. అలాగే, లిక్విడిటీ అవసరాలు తీర్చేందుకు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) తరహాలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసేలా రిజర్వ్ బ్యాంక్‌లో ప్రత్యేక రీఫైనాన్స్ విండో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాయి. ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల సమాఖ్య ఫైనాన్స్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎఫ్ఐడీసీ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్‌బీఐలో నమోదైన అన్ని ఎన్‌బీఎఫ్‌సీలకు ముద్రా స్కీము కింద రీఫైనాన్స్ సదుపాయం కల్పించాలని, స్ప్రెడ్స్ మధ్య (ఎన్‌బీఎఫ్‌సీలు తీసుకునే రుణాలు, ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్ల మధ్య వ్యత్యాసం) గరిష్ట పరిమితి 6 శాతమే ఉండాలన్న నిబంధనను ఎత్తివేయాలని కోరింది. మార్కెట్‌కు అనుగుణంగా వడ్డీ రేట్లు ఆమోదయోగ్య స్థాయిల్లోనే ఉండేలా సాధారణంగానే సంస్థలు జాగ్రత్తపడతాయని పేర్కొంది. అలాగే, వ్యవస్థలో కీలకమైన భారీ ఎన్‌బీఎఫ్‌సీలు చిన్న, మధ్య స్థాయి షాడో బ్యాంకులకు రుణాలివ్వడానికి ముద్రా స్కీము కింద రీఫైనాన్స్ సదుపాయం పొందే వెసులుబాటు కల్పించాలని ఎఫ్ఐడీసీ చైర్మన్ రామన్ అగర్వాల్ తెలిపారు. ఎన్‌బీఎఫ్‌సీలు దివాలా తీసే పరిస్థితి ఉందంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. రుణ వృద్ధి మాత్రమే మందగించిందని దివాలా పరిస్థితులేమీ లేవని స్పష్టం చేశారు.

## సమస్యల వలయం..

**గ**తేడాది సెప్టెంబర్‌లో ఐఎల్అండ్ఎఫ్ఎస్ సంస్థ దివాలా తీసినప్పట్నుంచి మొత్తం షాడో బ్యాంకింగ్ రంగం నిధుల కొరతతో అల్లాడుతున్న సంగతి తెలిసిందే. డీహెచ్ఎఫ్ఎల్ వంటి పెద్ద సంస్థలు కూడా డిఫాల్ట్ అవుతున్నాయి. వీటికి తోడ్పాటు అందిస్తామంటూ ఆర్‌బీఐ ప్రకటించినప్పటికీ నిర్మాణాత్మక చర్యలేమీ లేకపోవడంతో సంక్షోభం మరింత ముదురుతోంది. ఎన్‌బీఎఫ్‌సీలు ఒకవైపు మార్కెట్ వాటా పోగొట్టుకుంటూ ఉండగా.. మరోవైపు వాటి షేర్ల ధర కూడా భారీగా పతనమవుతోంది. పరిశ్రమ గణాంకాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఎన్‌బీఎఫ్‌సీల రుణ వితరణ 19 శాతం తగ్గింది. గతంలో రుణ వృద్ధి ఏటా 15% పైగా ఉండేది.

# వృద్ధి పరుగే ప్రధాన లక్ష్యం

- ఆర్థిక వ్యవస్థపైనే అధికంగా దృష్టిపెడతాం
- దేశ ఆర్థిక వ్యవస్థపై నోట్ల రద్దు ప్రభావం లేదు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ:** భారత్ ఇప్పటికీ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, డీమోనిటైజేషన్ (నోట్ల రద్దు) తాలూకు ప్రభావం ఆర్థిక రంగంపై లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం రాజ్యసభకు చెప్పారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా ఎదురైన ప్రశ్నలకు ఆమె స్పందించారు. తయారీ రంగంలో కొంత క్షీణత ఉందని, అయితే, ఇది నోట్ల రద్దు వల్ల కాదన్నారు. ప్రభుత్వ ఎజెండాలో ఆర్థిక వృద్ధి ఎంతో ప్రాధాన్య అంశంగా ఉందని చెప్పారు. జీడీపీ వృద్ధి పెంపు కోసం ఎన్నో రంగాల్లో సంస్కరణలను చేపట్టడం జరుగుతోందన్నారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి మోస్తరుగా ఉండడానికి వ్యవసాయం, అనుబంధ రంగాలు, వాణిజ్యం, హోటల్, రవాణా, స్టోరేజ్, కమ్యూనికేషన్, ప్రసార సేవల రంగాల్లో వృద్ధి తక్కువగా ఉండడమేనని చెప్పారు. ''ముఖ్యంగా కొన్ని రంగాల్లో తక్కువ వృద్ధి ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపించింది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, నైపుణ్య సేవల్లో ఈ పరిస్థితి నెలకొంది'' అని మంత్రి వివరించారు. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో వృద్ధి రేటు పడిపోయిందని, పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలను కూడా అమల్లో పెట్టినట్టు చెప్పారు. ఈ విషయంలో సభ్యుని ఆందోళనను అర్థం చేసుకోగలనన్నారు. అయినా కానీ, ఇప్పటికీ భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగానే ఉన్నట్టు చెప్పారు. అమెరికా వృద్ధి రేటు 2016–2019 మధ్య 1.6 శాతం నుంచి 2.3 శాతం మధ్య ఉంటే, చైనా వృద్ధి 6.7 శాతం నుంచి 6.3 శాతానికి పడిపోయిందని, కానీ, దేశ వృద్ధి రేటు 7 శాతానికి పైనే ఉన్నట్టు చెప్పారు.

**రైతులందరికీ ఆదాయం...**

కిసాన్ సమ్మాన్ యోజన, పెన్షన్ యోజన కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మోదీ సర్కారు రెండో విడత పాలనలో చేపట్టిన కీలక సంస్కరణ... పీఎం కిసాన్ యోజన కింద రైతులందరికీ రూ.6,000 చొప్పున ఆదాయం అందించనున్నట్టు చెప్పారు. గతంలో ఇది రెండు హెక్టార్ల రైతులకే పరిమితం చేశారు. దీనికి తోడు చిన్న, సన్నకారు రైతులు, చిన్న వర్తకులకు స్వచ్ఛంద పెన్షన్ పథకాన్ని కూడా తీసుకొచ్చినట్టు మంత్రి చెప్పారు. వృద్ధి విషయమై మరింత దృష్టి పెట్టేందుకు ప్రధాని అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో పెట్టుబడులు, వృద్ధిపై కేబినెట్ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జీఎస్టీ, ఎఫ్‌డీఐ నిబంధనలు సరళతరం సహా పూర్వపు ఐదేళ్ల కాలంలో చేపట్టిన సంస్కరణలను కూడా మంత్రి గుర్తు చేశారు.

**నోట్ల రద్దుతో సానుకూల ఫలితాలు**

రూ.500, రూ.1,000 నోట్ల డీమోనిటైజేషన్ వల్ల సానుకూల ఫలితాలు ఉన్నట్టు మంత్రి చెప్పారు. అక్రమ ధనం ఉగ్రవాదులకు పెద్ద ఎత్తున నిధుల సాయంగా వెళ్లేదని, నోట్ల రద్దు తర్వాత ఉగ్రవాదుల వద్ద ఉన్న డబ్బంతా పనికిరాకుండా పోయిందన్నారు. అలాగే, డిజిటల్ లావాదేవీలు కూడా పెద్ద ఎత్తున పెరిగాయన్నారు.

## బ్యాంకు మోసాలు తగ్గాయి

**బ్యాం**కుల్లో రూ.లక్ష, అంతకుమించిన మోసాలు 2018–19లో 6,735 తగ్గినట్టు మంత్రి చెప్పారు. ఈ మోసాల వల్ల పడిన ప్రభావం రూ.2,836 కోట్లుగా ఉంటుందన్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం 2017–18లో 9,866 మోసం కేసులు (రూ.4,228 కోట్లు) నమోదైనట్టు తెలిపారు.

# ఎమ్ఎక్స్ ప్లేయర్‌లో పేటీఎమ్, టెన్సెంట్ పెట్టుబడులు

**రూ.860 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్స్**




**న్యూఢిల్లీ:** టైమ్స్ ఇంటర్నెట్ ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్, ఎమ్ఎక్స్ ప్లేయర్‌లో భారీ పెట్టుబడులు రానున్నాయి. ఎమ్ఎక్స్ ప్లేయర్‌లో డిజిటల్ చెల్లింపుల సంస్థ, పేటీఎమ్, చైనా ఇంటర్నెట్ సంస్థ, టెన్సెంట్‌లు ఈ నెలలోనే రూ.860 కోట్ల(12.5 కోట్ల డాలర్ల)మేర పెట్టుబడులు పెట్టనున్నాయి. భారత ఇంటర్నెట్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే వ్యూహంలో భాగంగా టెన్సెంట్ కంపెనీ ఈ పెట్టుబడులు పెడుతోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీర్ఘకాల పెట్టుబడుల వ్యూహంలో భాగంగా పేటీఎమ్ కంపెనీ ఎమ్ఎక్స్ ప్లేయర్‌లో ఇన్వెస్ట్ చేస్తోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలపై ఈ మూడు సంస్థలు ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు.

**50 కోట్లకు పైగా డౌన్‌లోడ్స్...**

ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫార్మ్‌పై ఎమ్ఎక్స్ ప్లేయర్ డౌన్‌లోడ్స్ 50 కోట్లకు మించాయి. హిందీ, ఇతర భారత ప్రాంతీయ భాషల్లో ఒరిజినల్ కంటెంట్‌పై ఎమ్ఎక్స్ ప్లేయర్ దృష్టి పెడుతోంది. కాగా టైమ్స్ ఇంటర్నెట్ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్ 'గానా'లో గత ఏడాది ఫిబ్రవరిలో టెన్సెంట్ కంపెనీ 11.5 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది.

# రూ. 888కే విమాన ప్రయాణం..

**స్పైస్‌జెట్ 'మాన్‌సూన్ సేల్' ఆఫర్**

**న్యూఢిల్లీ:** చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్.. దేశీయ రూట్లలో రూ.888కే టికెట్ సేల్ ప్రకటించింది. వర్షాకాల ఆఫర్‌లో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ 25 వరకు చేసే ప్రయాణాలపై ఈ ధర వర్తిస్తుంది. అయితే, ప్రయాణ టికెట్లను ఈనెల 6వ తేదీ లోపు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇదే ఆఫర్ అంతర్జాతీయ రూట్లలో అయితే.. ప్రారంభ టికెట్ ధర రూ.3,499 నుంచి ఉన్నట్లు కంపెనీ వివరించింది. ఇక గత వారంలోనే అంతర్జాతీయ మార్గాల్లో కొత్త విమానాలను ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది.



# ఓలా ఎలక్ట్రిక్‌లోకి నిధుల జోరు!

**రూ.1,725 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సాఫ్ట్‌బ్యాంక్**



**న్యూఢిల్లీ:** ఓలా ఎలక్ట్రిక్ వాహన విభాగం, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ(ఓఈఎమ్)లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ రూ.1,725 కోట్లు(25 కోట్ల డాలర్లు) పెట్టుబడులు పెట్టింది. ఈ మేరకు సమాచారాన్ని నియంత్రణ సంస్థలకు ఓఈఎమ్ వెల్లడించింది. రూ.10 ముఖ విలువ గల పూర్తిగా, తప్పనిసరిగా మార్చుకునే సిరీస్ బి ప్రిఫరెన్స్ షేర్లను సాఫ్ట్‌బ్యాంక్ టొపాజ్ (కేమ్యాన్) లిమిటెడ్‌కు జారీ చేయడం ద్వారా రూ.1,725 కోట్లు సమీకరించామని ఓఈఎమ్ పేర్కొంది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు పెట్టిన భారత సంస్థల్లో ఒకటిగా ఓఈఎమ్ చేరింది. సాఫ్ట్‌బ్యాంక్ ఇప్పటివరకూ ఫ్లిప్‌కార్ట్, జొమాటో, పేటీఎమ్, ఓఈఎమ్ మాతృసంస్థ ఓలాలో కూడా పెట్టుబడులు పెట్టింది. కాగా ఓలాలో అతి పెద్ద సింగిల్ ఇన్వెస్టర్‌గా సాఫ్ట్‌బ్యాంక్ నిలిచింది.

**రతన్ టాటా పెట్టుబడులు...**

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీలో టాటా సన్స్ చైర్మన్ ఎమెరిటస్ రతన్ టాటా కూడా పెట్టుబడులు పెట్టారు. ఓఈఎమ్ సిరీస్ ఏ పెట్టుబడుల్లో భాగంగా రతన్ టాటా పెద్దమొత్తంలోనే ఇన్వెస్ట్ చేశారు. టైగర్ గ్లోబల్, మ్యాట్రిక్స్ ఇండియా సంస్థలు కూడా ఓఈఎమ్‌లో రూ.400 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాయి.

**పది లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు..**

భారత్‌లో 2021 కల్లా పది లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను నడపాలని ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంట్లో భాగంగా చార్జింగ్ సొల్యూషన్స్, బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్లు, టూ, త్రీ,–ఫోర్ వీలర్ సెగ్మెంట్లలో ఎలక్ట్రిక్ వాహనాలను సమకూర్చుకోవడం తదితర కార్యకలాపాలు చేపడుతోంది.

## విజయవాడలో యూఐడీఏఐ తొలి ఆధార్ సేవా కేంద్రం

**న్యూఢిల్లీ:** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) నిర్వహణలో ఆధార్ సేవా కేంద్రాలు మొదటిసారిగా ఢిల్లీ, విజయవాడలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది చివరినాటికి దేశవ్యాప్తంగా మరో 53 నగరాల్లో 114 కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం అంచనా వ్యయం రూ.300–400 కోట్లుగా ప్రభుత్వం వెల్లడించింది. ఢిల్లీలో అక్షరధామ్ మెట్రో స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటైన సేవా కేంద్రం రోజుకు 1,000 నమోదు/నవీకరణ అభ్యర్థనలను పూర్తిచేయనుండగా.. విజయవాడ కేంద్రం 500 వరకు అభ్యర్థనలను పూర్తిచేయనుంది.




## ఎయిర్‌టెల్ పేమెంట్స్‌లోకి రూ.325 కోట్ల నిధులు

- భారతీ ఎయిర్‌టెల్ రూ.260 కోట్లు
- భారతీ ఎంటర్‌ప్రైజెస్ రూ.65 కోట్లు




**న్యూఢిల్లీ:** ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఎంటర్‌ప్రైజెస్‌లు రూ.325 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. ప్రిఫరెన్స్ షేర్ల రూపంలో భారతీ ఎయిర్‌టెల్ రూ.260 కోట్లు, భారతీ ఎంటర్‌ప్రైజెస్ రూ.65 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయని మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ, టోఫ్లర్ తెలిపింది. కాగా ఈ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణకు పెట్టుబడులు కొనసాగిస్తామని ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ అనుబ్రత బిశ్వాస్ పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి బ్యాంకింగ్ సేవలందించడం, డిజిటల్ ఇండియా వంటి ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా డిజిటల్ లావాదేవీలు జోరుగా పెరుగుతున్నాయని వివరించారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ రిటైల్ బ్యాంకింగ్ అవుట్‌లెట్స్ 5 లక్షలకు చేరాయని, మంచి వృద్ధి సాధిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రిటైల్ బ్యాంకింగ్ పాయింట్స్ ద్వారా భారతీ ఆక్సా లైఫ్ పాస్ సరళ్ జీవన్ బీమా యోజన టర్మ్ పాలసీని విక్రయించనున్నామని తెలిపారు. ఈ మేరకు భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు రూ.3 లక్షలు లేదా రూ.5 లక్షల పాలసీలను ఎంచుకోవచ్చని, వీటికి ప్రీమియమ్‌లు తక్కువగా ఉంటాయని వివరించారు.

# వాట్సాప్‌తో బీఎస్ఎన్ఎల్ పోటీ!

- వైఫైతో కాల్స్ చేసుకునే సదుపాయం
- ప్రస్తుతం ప్రయోగదశలో వీవోవైఫై
- ముందుగా ద్వితీయ శ్రేణి నగరాల్లో ప్రారంభం




**ముంబై:** ప్రైవేట్ టెల్కోల రాకతో వెనుకబడిన ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) జోరు పెంచుతోంది. తాజాగా వాట్సాప్ వంటి ఓవర్–ది–టాప్ (ఓటీటీ) సంస్థలతో పోటీపడేందుకు సిద్ధమవుతోంది. వైఫై ఇంటర్నెట్ ద్వారా కాల్స్ చేయడం, రిసీవ్ చేసుకునే సదుపాయాన్ని ప్రవేశపెట్టే యత్నాల్లో ఉంది. ఇందుకు సంబంధించిన అడ్వాన్స్‌డ్ వాయిస్ ఓవర్ వైఫై (వీవోవైఫై) సర్వీసులను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తోంది. అత్యుత్తమ టెక్నాలజీతో అత్యంత నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఎంపిక చేసిన కొన్ని సర్కిల్స్‌లో ప్రస్తుతం వీటిని పరీక్షిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా అన్ని సర్కిల్స్‌లోనూ ఈ సేవలు ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నా.. ముందుగా మాత్రం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, స్పెక్ట్రం అంతగా అందుబాటులో ఉండని మారుమూల ప్రాంతాల్లో వీటిని అందుబాటులోకి తేవాలని బీఎస్ఎన్ఎల్ యోచిస్తోంది.

**ప్రత్యర్థి సంస్థలతోనూ పోటీ..**

ప్రస్తుతం ప్రైవేట్ టెల్కోలైన భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ (ఆర్‌జియో) తదితర సంస్థలు కూడా వీవోవైఫై సర్వీసులను పరీక్షిస్తున్నాయి. ఇవి తుది దశలో ఉండగా త్వరలోనే సేవలు అందుబాటులోకి తేవాలని ఆయా సంస్థలు యోచిస్తున్నాయి. అయితే, వాటికన్నా ముందే రంగంలోకి దిగాలని, మార్కెట్‌ను దక్కించుకోవాలని బీఎస్ఎన్ఎల్ చకచకా పావులు కదుపుతోంది.

**బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్స్‌లో మార్పులు..**

రిలయన్స్ జియో కొత్తగా బ్రాడ్‌బ్యాండ్ సేవలు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ఈ విభాగంలో ముందే పట్టు సాధించేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనిలోభాగంగా భారత్ ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్స్ చార్జీలను సవరించింది. నెలకు 500 జీబీ డేటా ఆఫర్ చేసే రూ. 777 ప్లాన్‌ను సవరించి రూ. 849కి మార్చింది. దీని కింద 50 ఎంబీపీఎస్ స్పీడ్‌తో డేటాను 600 జీబీకి పెంచింది. అలాగే అన్‌లిమిటెడ్ కాల్స్ కూడా అందిస్తోంది. మరోవైపు, రోజుకు 50 జీబీ డేటా అందించే రూ. 3,999 ప్లాన్‌ని కూడా సవరించి రూ. 4,499కి మార్చింది. ఈ ప్లాన్ కింద ఇకపై 100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో రోజూ 55 జీబీ డేటా లభిస్తుంది.

**మొ**బైల్ సిగ్నల్ లేకపోయినా యూజర్లకు కనెక్టివిటీ దెబ్బతినకుండా చూసే అత్యుత్తమ టెక్నాలజీగా వీవోవైఫైకి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. వైర్‌లెస్ ఇంటర్నెట్ కనెక్షన్ (వైఫై) ద్వారా కాల్స్ చేయడం, రిసీవ్ చేసుకోవడాన్ని సాధారణంగా వైఫై కాలింగ్‌గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం

## వీవోవైఫై అంటే ..

వాట్సాప్, స్కైప్, హైక్, ఫేస్‌బుక్, గూగుల్ వంటి ఓటీటీ సంస్థలు ఈ తరహా సేవలు అందిస్తున్నాయి. అయితే, టెల్కోల్లాగా లైసెన్సు బాదరబందీ లేని ఈ సంస్థలు తమ వాయిస్ సేవల విభాగం ఆదాయానికి గండి కొడుతున్నాయంటూ టెలికం సంస్థలు చాన్నాళ్లుగా గగ్గోలు పెడుతున్నాయి. ఓటీటీ సంస్థలు కూడా తమ లాగా కాలింగ్, మెసేజింగ్ సర్వీసులను అందిస్తున్నాయి కాబట్టి వాటిని సైతం లైసెన్సింగ్ పరిధిలోకి తీసుకురావాలంటూ డిమాండ్ చేస్తున్నాయి.

# 'ఎక్స్‌యూవీ 300'లో ఏఎంటీ వెర్షన్

**ధర రూ.11.5 లక్షలు**



**ఢిల్లీ:** దేశీ వాహన తయారీ కంపెనీ 'మహీంద్రా అండ్ మహీంద్రా' (ఎం అండ్ ఎం) తాజాగా తన ప్రముఖ కాంపాక్ట్ ఎస్‌యూవీ 'ఎక్స్‌యూవీ 300'లో ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) వెర్షన్‌ను మంగళవారం ఆవిష్కరించింది. 'డబ్ల్యూ8' పేరుతో అందుబాటులోకి వచ్చిన డీజిల్ ట్రిమ్ ధర రూ.11.5 లక్షలు (ఎక్స్–షోరూం, ఢిల్లీ) కాగా, ఆప్షనల్ ట్రిమ్ ధర రూ.12.7 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. టెక్నాలజీ అభివృద్ధి చెందిన కారణంగా.. మునుపటి వెర్షన్‌తో పోల్చితే ధర రూ.55,000 పెరిగినట్లు వివరించింది. ఈ సందర్భంగా సంస్థ ఆటోమోటివ్ విభాగం చీఫ్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) విజయ్ రామ్ నక్రా మాట్లాడుతూ.. 'ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన ఎక్స్‌యూవీ 300 మాన్యువల్ వెర్షన్‌కు వచ్చిన విశేష స్పందన చూశాక, ఆటోషిఫ్ట్‌ను విడుదల చేస్తే అమ్మకాలు మరింత పెరుగుతాయని నిర్ణయం తీసుకున్నాం. ఈ కారణంగానే నూతన వెర్షన్ అందుబాటులోకి వచ్చింది' అని తెలిపారు.

# రూ.130 కోట్లు సమీకరించిన రిన్యూబై



రిన్యూబై బృందం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** డిజిటల్ ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్ రిన్యూబై.కామ్ రూ.130 కోట్ల నిధులను సమీకరించింది. సిరీస్–బీ రౌండ్‌లో భాగంగా లోక్ క్యాపిటల్, ఐఐఎఫ్ఎల్ ఏఎంసీ, అమికుస్ క్యాపిటల్స్ ఈ పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం రిన్యూబైలో 25 వేల పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) పార్టనర్స్ నమోదయ్యారు. ఏటా రూ.500 కోట్ల ప్రీమియం వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుతం 450 నగరాల్లో సేవలందిస్తున్నామని, 2020 నాటికి వెయ్యి నగరాలకు.. 2 లక్షల పీఓఎస్‌లను లక్ష్యించామని కంపెనీ సీఈఓ బాలచందర్ శేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# డేటా సేకరణ ఆరోపణలు నిరాధారమైనవి: టిక్‌టాక్




**న్యూఢిల్లీ:** చట్టవిరుద్ధంగా యూజర్ల డేటాను సేకరిస్తోందంటూ వస్తున్న ఆరోపణలను షార్ట్–వీడియో షేరింగ్ యాప్ టిక్‌టాక్ ఖండించింది. స్థానిక చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే తాము కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పేర్కొంది. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థలో భాగమైన టిక్‌టాక్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. యూజర్ల డేటా భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించింది. యూజర్ల డేటాను టిక్‌టాక్ చట్టవిరుద్ధంగా సేకరించి .. చైనాకు పంపుతోందని, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన సమస్యని లోక్‌సభలో కాంగ్రెస్ నేత శశి థరూర్ ఆరోపించిన నేపథ్యంలో టిక్‌టాక్ తాజా వివరణనిచ్చింది. తమపై వస్తున్న ఆరోపణలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. తమ సంస్థ కార్యకలాపాలు చైనాలో లేవని, అక్కడి ప్రభుత్వానికి, చైనా టెలికం సంస్థకు గానీ టిక్‌టాక్ యూజర్ల డేటా లభించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. భారతీయ యూజర్ల డేటాను అమెరికా, సింగపూర్‌లోని ప్రముఖ థర్డ్ పార్టీ డేటా సెంటర్స్‌లో భద్రపరుస్తున్నట్లు టిక్‌టాక్ తెలిపింది.

## మెడికల్ మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

- నేటి నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ప్రైవేటులో ఈడబ్ల్యూఎస్ కోటాపై తొలగని ఉత్కంఠ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య, దంత కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్–2019లో అర్హత సాధించిన అభ్యర్థులు కేటగిరీ బీ, సీ (ఎన్ఆర్ఐ) కోటాలో సీట్లకు బుధవారం ఉదయం 9 నుంచి 10వ తేదీ సాయంత్రం 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తులు https://tspvtmedadm.tsche.in లో ఉంటాయి. ఈ నెల 11న ప్రొవిజినల్ మెరిట్ లిస్టును.. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రొఫెసర్ రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్సీడీఈ)లో నిర్వహిస్తారు. తేదీలు ఇంకా ఖరారు కావాల్సి ఉంది. దరఖాస్తుకు సంబంధించి ఎదురయ్యే సాంకేతిక సమస్యలకు 9502001583, 8466924522ను సంప్రదించాలి. పూర్తి సమాచారానికి వర్సిటీ వెబ్‌సైట్ www.knruhs.in, www.knruhs.telangana.gov.in ను చూడాలని వర్సిటీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఇదిలావుండగా 10 ప్రైవేటు మెడికల్ కాలేజీలు అగ్రవర్ణ పేదలకు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద సీట్లు పెంచాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)కి దరఖాస్తు చేశాయి. కానీ ఇప్పటివరకు సీట్ల పెంపుపై ఎంసీఐ స్పష్టత ఇవ్వలేదు. ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్లకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. వాటికి ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. కానీ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఆయా వర్గాల విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

## ఐదారు రోజుల్లో ఇంజనీరింగ్ ఫీజుల ఖరారు

### నేడు 31 కాలేజీల యాజమాన్యాలతో హియరింగ్

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్ ఫీజుల ఖరారు కోసం కోర్టును ఆశ్రయించిన కాలేజీలే కాకుండా కోర్టుకు వెళ్లని కాలేజీలకు కూడా ఫీజులు ఖరారు చేసేందుకు ప్రవేశాల ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్సీ) చర్యలు చేపట్టింది. కోర్టును ఆశ్రయించి యాజమాన్య ప్రతిపాదిత ఫీజు అమలుకు ఉత్తర్వులు పొందిన కాలేజీలకు ఫీజును ఖరారు చేసేందుకు ఏఎఫ్ఆర్సీ సోమవారమే హియరింగ్ ప్రారంభించింది. మొదటి రోజు 20 కాలేజీల ఆదాయ వ్యయాలను పరిశీలించిన కమిటీ వాటికి ఫీజులను ఖరారు చేసింది. మంగళవారం మరో 30 కాలేజీలతో హియరింగ్ నిర్వహించింది. ఇక బుధవారం 31 కాలేజీల యాజమాన్యాలతో హియరింగ్ నిర్వహించి ఫీజులను ఖరారు చేసేలా ఏర్పాట్లు చేసింది. దీంతో కోర్టును ఆశ్రయించిన కాలేజీల ఫీజుల ఖరారు ప్రక్రియ బుధవారంతో పూర్తి కానుంది. ఇక 4వ తేదీ నుంచి కోర్టుకు వెళ్లని 108 కాలేజీల్లోనూ ఫీజులను ఖరారు చేసేలా ఏర్పాట్లు చేసింది. ప్రతి రోజూ 36 కాలేజీలకు హియరింగ్ నిర్వహించి ఫీజులను ఖరారు చేయాలని నిర్ణయించింది. మొత్తానికి వచ్చే ఐదారు రోజుల్లో అన్ని కాలేజీల ఫీజులను ఖరారు చేసి ప్రభుత్వానికి పంపించనుంది. ప్రభుత్వం వాటిపై ఉత్తర్వులు జారీ చేశాక వచ్చే మూడేళ్ల పాటు వర్తించే కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి.

## లేటరల్ ఎంట్రీ సీట్లకు భారీ కోత

- పాలిటెక్నిక్ విద్యార్థులకు షాక్
- బీటెక్‌లో సగానికి తగ్గిపోయిన లేటరల్ ఎంట్రీ సీట్లు

**సాక్షి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఊహించని షాక్ తగిలింది. డిప్లొమా తర్వాత నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ ద్వారా చేరాలనుకున్న విద్యార్థులకు నిరాశ తప్పేలా లేదు. ఈసెట్ ద్వారా ప్రవేశాలు కల్పించే సీట్ల సంఖ్యను భారీగా తగ్గించడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలో పడ్డారు. గతేడాది ఈసెట్ ద్వారా 19,247 సీట్లు అందుబాటులో ఉంటే ఈ సారి వాటి సంఖ్య 10,221కి తగ్గిపోయింది. గతంలో ఇంజనీరింగ్‌లోని మొత్తం సీట్లలో 20 శాతం సీట్లను డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు కేటాయించేవారు. ఈసారి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి లేటరల్ ఎంట్రీ సీట్లను 10 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో గతంలో కంటే 9,026 సీట్లు తగ్గిపోయాయి.

# మధ్య రాతియుగం 'మోడ్రన్ ఆర్ట్' ఇది!

- పది వేల ఏళ్ల క్రితంనాటి రాతి చిత్రాల కాన్వాస్
- భద్రాచలం అడవుల్లో లభ్యం
- కొన్ని తరాలపాటు కొనసాగిన మానవ ఆవాసంలో చిత్రాల సమూహం

**సాక్షి, హైదరాబాద్:** పాకుతున్న ఓ భారీ ఉడుము... ఆ పక్కనే తాబేలు డిప్పలో ఉండే ఆకృతుల సమ్మేళనం.. ఓ పక్కకు చూస్తే కుక్క లాంటి ఆకారం.. దానికి ఎదురుగా క్రమపద్ధతిలో పేర్చినట్టుగా అర్ధ చతురస్రాకారపు గీతల బొత్తి, అద్దంలో ప్రతిబింబంలా ఒకదానికొకటి విరుద్ధ దిశల్లో... మనిషిలాగా కనిపిస్తుంది, కాదు అది మృగమనే భావన ఆ వెంటనే కలిగే వింత ఆకృతి.. చుట్టూ మోహరించిన జలచరాలు, సరీసృపాలు, ఉభయచర జీవులను తలపించే మరిన్ని ఆకారాలు.. దాదాపు 28 అడుగుల పొడవున్న కాన్వాస్‌పై రూపొందించిన చిత్రాలివి. చూడగానే ఓ మోడ్రన్ ఆర్ట్‌ను తలపిస్తుందది. చిత్రాల ఆకారాలను సులభంగా పోల్చుకునేలా ఉండవు.. కానీ మనసులో మెదిలే ఏవేవో భావాలకు ప్రతిరూపాలన్నట్టుగా తోస్తాయి. వేటికవే ప్రత్యేకం. ఇంతకూ ఆ చిత్రవిచిత్ర చిత్రాల సమాహారంగా ఉన్న కాన్వాస్ వయసెంతో తెలుసా?

### పది వేల ఏళ్లు

ఆదిమానవుల చిత్రాలతో కూడిన గుహలు అడపాదడపా కనిపిస్తుంటాయి. దట్టమైన అడవులే కాదు, ఊరి పొలిమేరల్లో ఉండే గుట్ట రాళ్లపై ఎరుపురంగు చిత్రాలు అప్పుడప్పుడూ వెలుగు చూస్తూనే ఉంటాయి. నాటి మానవులు ఆవాసంగా మార్చుకున్న గుహ గోడలు, పైకప్పుపై రెండుమూడు చిత్రాలు, కొన్ని అంతు చిక్కని గీతలుంటాయి. కానీ, ఓ కాన్వాస్ తరహాలో ఎక్కువ సంఖ్యలో చిత్రాల సమూహం వెలుగుచూడటం మాత్రం అరుదు. అలాంటి అరుదైన రాక్ పెయింటింగ్స్ ఇప్పుడు భద్రాచలం అడవుల్లో బయటపడ్డాయి. పాల్వంచ సమీపంలోని ముల్కలపల్లి మండలం నల్లముడి గ్రామం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో అడవిలో వెలుగుచూసింది. గతంలో సమీపంలోని అక్షరలొద్దిలో ఆదిమానవుల చిత్రాలు వెలుగు చూసిన నేపథ్యంలో స్థానిక ఉపాధ్యాయుడు కొండవీటి గోపీ వరప్రసాద్‌రావు వీటిని గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు కట్టా శ్రీనివాస్, శ్రీరామోజు హరగోపాల్, రాక్‌ఆర్ట్ సొసైటీ సభ్యులు మురళీధర్ రెడ్డిలు వాటిని పరిశీలించి మధ్య రాతి యుగం నాటివి అయి ఉంటాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



రాతి కాన్వాస్‌పై కళా ఖండం..

### కొన్ని తరాల చిత్రాలు..

**ఒం**టి గుండుగా పేర్కొనే ఈ గుహలోని చిత్రాలు ఒకేసారి వేసినవి కావు. కొన్ని తరాలుగా వాటిని వేరువేరు మనుషులు గీస్తూ వచ్చారు. రంగు కొంత వెలిసిపోయి పాత చిత్రాలుగా కనిపిస్తుండగా, వాటిపై కొత్తగా వేసినట్టుగా మరికొన్ని చిత్రాలు ఎర్రటి రంగుతో మెరుస్తున్నాయి. ఈ గుహ కొన్ని తరాలపాటు మానవ ఆవాసంగా ఉందనటానికి ఇదో నిదర్శనం. చుట్టూ నీటి వనరులు ఉండటం, సమీపం అంతా మైదాన ప్రాంతంగా ఉండటం, గుండు ఎక్కితే దూరం నుంచే జంతువుల జాడ తెలుసుకునే వీలుండటంతో ఇది మానవ ఆవాసంగా చాలాకాలం పాటు వాడుకున్నట్టు స్పష్టమవుతోంది. కొన్ని తరాల జనం ఆ గుహ గోడలను బొమ్మలతో నింపేశారు. సాధారణంగా ఆదిమానవుల చిత్రాల్లో మనుషులకు మచ్చికయ్యే పశువుల చిత్రాలు ఎక్కువగా కనిపిస్తాయి. వ్యవసాయాన్ని ప్రారంభించిన తర్వాత తరం వారు ఎక్కువగా ఎద్దుల చిత్రాలు గీసేవారు, కొన్ని చోట్ల శునకాలు కనిపిస్తాయి. కానీ ఇక్కడ పశువుల చిత్రాలు లేకపోవటం విశేషం. దీన్నిబట్టి వ్యవసాయ విధానం ప్రారంభించకపూర్వంనాటి మనుషులు ఈ చిత్రాలు గీసి ఉంటారని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. ఇక మన దగ్గర కనిపించే చిత్రాలు ఎరుపు రంగులోనే ఉంటాయి. కానీ ఇక్కడ దాదాపు అన్ని చిత్రాలు ఎరుపు రంగుతోనే వేసినా, కొన్నింటికి తెలుపు రంగుతో అంచులు అద్దారు. మధ్య మధ్య తెలుపు రంగు చుక్కలతో ముస్తాబు చేసినట్లు ఉండటం విశేషం. ఆఫ్రికాలోని సాన్ థామస్ రివర్ ప్రాంతంలో కనిపించిన చిత్రాలను పోలి ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో రాళ్లపై గీతలతో చెక్కిన పెట్రో గ్లిఫ్స్ చిత్రాలు కూడా కనిపించాయి. పాలకులు ఇక్కడ ఏదో నిర్మాణం చేపట్టాలనుకుని కొంత పనిచేసి వదిలేసినట్టు అనిపిస్తోంది. ఈ రాతి చిత్రాల గుహ ఆదిమానవులపై ఎన్నో పరిశోధనలకు వీలుగా ఉన్నందున ధ్వంసం కాకుండా ప్రభుత్వం కాపాడాల్సి ఉంది.

# ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులు

**సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. శ్రీధర్**



**సాక్షి, హైదరాబాద్:** సింగరేణిలో లాభదాయక బొగ్గు నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 6 నుంచి 10 బ్లాకుల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. వీటిని కేటాయిస్తే రానున్న ఐదేళ్లలో సింగరేణి ఏడాదికి 85 మిలియన్ టన్నుల నుంచి 100 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే స్థాయికి చేరుతుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మిక సంఘం నేతలతో జరిగిన 37వ సీఎండీ స్థాయి స్ట్రక్చర్డ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న 5 ఏళ్ల కాలంలో బొగ్గు పరిశ్రమ కొత్త సవాళ్లను ఎదుర్కోనుందని, 50కి పైగా ప్రైవేటు బొగ్గు సంస్థలతో సింగరేణి, కోలిండియా సంస్థలు పోటీ పడాల్సి వస్తుందని అన్నారు. దీంతో ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గించుకుంటేనే మార్కెట్‌లో నిలబడి మనుగడ సాధించగలమని తెలిపారు. సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని థర్మల్ విద్యుత్‌తోపాటు సోలార్ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయడానికి రంగం సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరికల్లా 130 మెగావాట్లు, వచ్చే ఏడాది మరో 80 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి సన్నాహాలు చేశామన్నారు.

# అటవీ సిబ్బందికి పోలీసు రక్షణ

- జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలతో సమన్వయకమిటీ
- ఎస్పీలకు పలు సూచనలు చేసిన డీజీపీ



**సాక్షి, హైదరాబాద్:** అటవీ సిబ్బందికి రక్షణ కల్పించేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది. వరుస దాడుల నేపథ్యంలో అప్రమత్తమైంది. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం సార్సాల గ్రామంలో ఎఫ్ఆర్వోపై దాడి ఘటన మరవకముందే తాజాగా మరో దాడి జరిగింది. మంగళవారం తెల్లవారుజామున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం గుండాలపాడులో అటవీశాఖ సిబ్బందిపై పలువురు దాడి చేశారు. ఈ నేపథ్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డి ఉదయం జిల్లా ఎస్పీలు, ఉన్నతాధికారులతో మాట్లాడారు. అన్ని జిల్లాల్లోనూ ఫారెస్టు సిబ్బందితో పోలీసులు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు సమన్వయకమిటీని ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ ప్రతిపాదించింది. అందులో జిల్లా ఎస్పీ, కలెక్టర్, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. పోలీసులు, ఫారెస్టు సిబ్బంది సమన్వయంతో సాగాలని, అప్పుడే దాడులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని సూచించారు. సార్సాల ఘటన తరువాత పోలీసులు ఈ విషయంలో కఠినంగానే ఉండాలని నిర్ణయించారు. దాడి జరిగిన వెంటనే డీఎస్పీ, సీఐలను ఐజీ నాగిరెడ్డి సస్పెండ్ చేశారు. సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని, కేసుల నమోదుకు వెనకాడొద్దని పోలీసులు నిర్ణయించారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో అటవీశాఖ చేపట్టే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అటవీ అధికారుల నుంచి తెప్పించుకోవడం ద్వారా దాడులు జరగకుండా నివారించాలన్న వ్యూహంతో పోలీసులు ఉన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఫలితాలు వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలోని క్లినికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు మంగళవారం టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. వీటికి సంబంధించి గతనెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన ఇంటర్వ్యూ మార్కులు, పూర్తి వివరాలను అభ్యర్థులు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించింది.

## జనవరి 11న జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో (జేఎన్‌వీ) వచ్చే విద్యా సంవత్సరం (2020–21) ఆరో తరగతిలో ప్రవేశాల కోసం జవహర్ నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 11వ తేదీన ఉదయం 11:30 గంటలకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని అందులో పేర్కొంది. దేశంలోని మొత్తం 661 జేఎన్‌వీలలో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం దేశంలో 636 జేఎన్‌వీలు ఉండగా, మరో 25 కొత్త విద్యాలయాల్లో ప్రవేశాలను చేపట్టనున్నట్లు పేర్కొంది.

## సివిల్స్ శిక్షణకు బీసీ స్టడీ సర్కిల్ నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల శిక్షణ కోసం ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని బీసీ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ 100 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తుందని పేర్కొన్నారు. దీనికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు www.studycircle.cg-g.gov.in/tsbcw వెబ్‌సైట్‌ను గానీ, 040–24071178 నంబర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

S.I. కానిస్టేబుల్ T/M E/M
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ Hyd. ☎ 9848262600, 9849771902

SI & కానిస్టేబుల్స్
LONG TERM BATCHES : 4th July
Separate Batches for EM/TM
రాజధాని ఇన్‌స్టిట్యూట్ DSNR, HYD 9885361057 9959430501




**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**

Follow us on

**Honda Exclusive Authorized Dealerships: NALGONDA:** Sri Vigneshwara Honda - 9290143623, 9290053788; Kushal Honda - 08682-248822/33, 9160644472/73/74; **MIRYALGUDA:** Mereddy Honda - 9618688155, 08689230666/7; **KODAD:** Mereddy Honda - 08683253925, 9618688177; **HUZURNAGAR:** Mereddy Honda - 8683242888, 9618002354; **SURYAPET:** Sri Vigneshwara Honda - 8885312455, 8179181884; **DEVARAKONDA:** Sri Honda - 8688111770, 08691-252225; **HALIA:** Mereddy Honda - 9618688166, 08680278822; **BHONGIR:** Kushal Honda - 08685-243555, 9154308152; **MOTHKUR:** Kushal Honda - 08694-287999, 9949939988; **THIRUMALGIRI:** Saraswathi Honda - 08693-243243 9505243243; **BIBINAGAR:** Kakateeya Honda - 9949588911, 9121886912; **CHITIYAL:** Sri Laxmi Narasimha - 9948138583, 9948537805; **ALER:** Kushal Honda - 9951208888; **CHOUTUPPAL:** Kushal Honda - 7330869678.

**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792